కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరం
బిసి కమిషన్ బహిరంగ విచారణ షురూ
ఏడాదిలో వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తాం
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 187 | శుక్రవారం | 06 -06-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి

నంబాల మృతి చెందిన పక్షం రోజుల్లోనే మరో కేంద్ర కమిటీ నాయకుడి కాల్చివేత

ప్రజాపక్షం/భద్రాచలం

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. మావోయస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు చలం అలియాస్ సుధాకర్ గురువారం మృతి చెందారు. సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన అతి కొద్దిరోజుల్లోనే మరో కేంద్ర కమిటీ సభ్యున్ని బలగాలు కాల్చి చంపాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధాకర్ (67) యువతను పెద్ద ఎత్తున మావోయిస్టు పార్టీవైపు ఆకర్శింపజేశాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అనేక దాడుల్లో సుధాకర్ ప్రధాన పాత్రదారిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంద్రావతి జాతీయ ఉద్యానవనం ప్రాంతంలోని అడవిలో కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు బుధవారం నుండే సంయుక్త బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టి మట్టుపెట్టినట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీ నాయకుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అప్పారావుతో పాటు మరి కొందరు ఉన్నారనే సమాచారం మేరకు ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు చెబుతున్నారు. చోటు చేసుకున్న ఎదురు కాల్పుల తర్వాత సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బలగాలకు సీనియర్ మావోయిస్టు మృతదేహంతో పాటు ఏకే 47 తుపాకీ లభ్యం కావడంతో స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతి చెందిన వ్యక్తి కేంద్రకమిటీలోని సభ్యుడు సుధాకర్‌గా పోలీసులు తర్వాత గుర్తించారు. ఈయనకు ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, అరవింద్, సోమన్న అనే మారు పేర్లు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన వాడిగా పోలీసులు ధృవీకరించారు. విప్లవ రాజకీయ పాఠశాల, సెంట్రల్ రీజనల్ బ్యూరో లకు కూడా ఈయన ఇంచార్జ్‌గా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అనేక హింసాత్మక సంఘటనల్లో ప్రధాన బాధ్యునిగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. యువతమెదళ్లలో తీవ్రవాదాన్ని నూరిపోసి తప్పుదారి పట్టించడంలో ఈయనకు సిద్ధహస్తునిగా పేరుంని బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజన్ వెల్లడించారు. ఈయన ఎన్‌కౌంటర్ భద్రతాబలగాలు ఖాతాలో పెద్దవిజయమని, ఇప్పటికే మావోయిస్టు పార్టీ పెద్ద ఎత్తున దండకారణ్యంతోపాటు ఏపి, తెలంగాణ, ఒడిస్సాలతో పాటు పలు ప్రాంతాల్లో ఉనికి కోల్పోతుందని ఆయనచెప్పారు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు పార్టీకి తీరని దెబ్బతగిలిందని అభిప్రాయ పడ్డారు. ఎదురుకాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుండి పెద్ద ఎత్తున మావోయిస్టులు తప్పించుకున్నారనే సమాచారం మేరకు కూంబింగ్ ముమ్మరం చేసినట్లు ఐజి తెలిపారు. మావోల కోసం మరింత ఆపరేషన్ ముమ్మరం చేశామని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అయన చెప్పారు. గత నెల మే 21న మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలయాస్ బసవరాజుతో సహా 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటి ఎన్‌కౌంటర్‌తో .ఈ ఏడాది ఇప్పటి వరకు వేర్వేరు ఘటనల్లో 203 మంది



తరువాయి 2లో



## చినాబ్ వంతెన నేడు జాతికి అంకితం

**జమ్మూ :** పహల్గామ్ ఉగ్రదాడి తరువాత ప్రధానమంత్రి తొలిసారిగా శుక్రవారం జమ్మూ కశ్మీర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన రైల్వే వంతెనలను ప్రారంభించనున్నారు. వాటిలో ఒకటి ప్రపంచలోనే అత్యంత ఎత్తులో నిర్మితమైన చీనాబ్ వంతెన. మరొకటి భారత దేశంలో తొలి కేబుల్ వంతెన అంజి బ్రిడ్జ్. అలాగే శ్రీనగర్–కాట్రా మధ్య నడిచే ప్రత్యేకంగా రూపొందించిన రెండు వందేభారత్ రైళ్ళను కూడా ఆయన ప్రారంభిస్తారు. అలాగే 272 కిలోమీటర్ల ఉద్ధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వేలైన్ చివరి దశను ప్రారంభిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనేక ముఖ్య ప్రాంతాలలో అదనపు బలగాలతో పాటు,

తరువాయి 2లో

బతుకమ్మ కుంట పనులు చేసేందుకు

## హైడ్రాకు అనుమతి

ముంపు నివారణ పనులు కొనసాగించొచ్చు - హైకోర్టు ఉత్తర్వులు



ప్రజాపక్షం/హైదరాబాద్

వర్షాకాలంలో వరద ముంపునకు గురికాకుండా బతుకమ్మకుంట పునరుద్ధరణలో భాగంగా అవసరమైన పనులను చేయడానికి హైడ్రాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. బతుకమ్మకుంట స్థలానికి సంబంధించి ప్రైవేటు వ్యక్తులు హక్కుల వివాదంపై సివిల్ కోర్టులో ఇంజంక్షన్ పిటిషన్‌పై తేలే దాకా యథాతథస్థితిని కొనసాగించాలన్న గత ఉత్తర్వులను సవరించింది. హైదరాబాద్ బాగ్‌అంబర్‌పేట సర్వే నెం.563/1లోని 7 ఎకరాలకు సంబంధించిన స్థలంపై మే 5న ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను సవరించాలని కోరుతూ హైడ్రా వేసిన వ్యాజ్యంపై జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ లక్ష్మీ నారాయణ

తరువాయి 2లో



'రాఫెల్' ప్రధాన భాగాల తయారీ

## హైదరాబాద్‌లో...

ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం 'దస్సాల్ ఏవియేషన్'-'టిఏఎస్ఎల్' మధ్య కీలక ఒప్పందం

భారతరక్షణరంగానికి ధన్యవాదాలు తెలియజేసిన దస్సాల్ ఏవియేషన్ ఛైర్మన్, సిఇఒ ఎరిక్ ట్రాపియర్

**న్యూఢిల్లీ :** భారతదేశ వైమానిక దళంలో తిరుగులేని యుద్ధ విమాన ఫైటర్లుగా ప్రశంసలు అందుకున్న రాఫెల్ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ఒక కీలక ఒప్పందం కుదిరింది. భారతదేశంలో రఫేల్ యుద్ధ విమానంలో ఒక కీలకభాగమైన విమాన చట్రం (ఫ్యూజ్‌లేజ్) హైదరాబాద్‌లో తయారీకి ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ మాతృసంస్థ, ఏరోస్పేస్ దిగ్గజం దస్సాల్ ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఏఎస్ఎల్)మధ్య ఒక కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు గురువారం ఆ రెండు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఈ నేపథ్యంలో

తరువాయి 2లో

## ప్రతి భారతీయుడిపై ఆర్థిక ఒత్తిడి

- పెట్టుబడిదారులకోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోంది
- గత ఏడాదిలో వాహన అమ్మకాలు తగ్గిపోయాయి
- ఇంటి అద్దె, దేశీయ ద్రవ్యోల్బణం, విద్యా ఖర్చులు ఖరీదయ్యాయి
- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ:** ప్రతి భారతీయుడు ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్నాడని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. ప్రభుత్వం కొంతమంది పెట్టుబడిదారుల కోసం పని చేస్తోందని విమర్శించారు. 'గణాంకాలు నిజం చెబుతున్నాయి' అని కాంగ్రెస్ నేత తన 'ఎక్స్' ఖాతాలో హిందీలో రాశారు. 'గతేడాది ద్విచక్ర వాహనాల అమ్మకాలు 17 శాతం, కార్ల అమ్మకాలు 8.6 శాతం తగ్గాయి. మొబైల్ మార్కెట్ 7 శాతం తగ్గింది. మరోవైపు ఖర్చులు, అప్పులు నిరంతరం పెరుగుతున్నాయి. ఇంటి అద్దె, దేశీయ ద్రవ్యోల్బణం, విద్యా ఖర్చులు, దాదాపు ప్రతిదీ ఖరీదైనవిగా మారుతున్నాయి. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు. ప్రతి సాధారణ భారతీయుడు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి చెందిన వాస్తవికత ఇది' అని పేర్కొన్నారు. గత నెల సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారులు (ఎస్ఐఏఎం) ద్విచక్ర వాహనాల పంపిణీ ఏప్రిల్‌లో 17 శాతం తగ్గి 14,58,784 యూనిట్లకు చేరుకున్నాయని తెలిపింది. అదే కాలంలో దేశంలోని ఫ్యాక్టరీల నుంచి కంపెనీ డీలర్‌షిప్‌లకు ప్రయాణికుల వాహనాల

తరువాయి 2లో



న్యాయవ్యవస్థలో సాంకేతికత

## ఆధిపత్యం సహేతుకం కాదు

భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్బోధ

లండన్ సెమినార్‌లో కీలకోపన్యాసం



**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థలో సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ హెచ్చరించారు. ఇది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, మానవత్వం దృష్టిని మరల్చవద్దని ఆయన కోర్టులకు హితవు పలికారు. మే 4న (బుధవారం) లండన్‌లో బ్రిటీష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ కంపారటివ్ లా వద్ద 'కోర్ట్స్, కామర్స్ అండ్ ది రూల్ ఆఫ్ లా' అంశంపై జరిగిన సెమినార్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాస్కర్ తన కీలకోపన్యాసం చేశారు. ఆయన తన ప్రసంగంలో వాణిజ్యాన్ని సమతుల్యం చేసే న్యాయ వ్యవస్థ పాత్రను,

తరువాయి 12లో

## నిధుల సమీకరణపై అధికారులు తీవ్ర దృష్టి



- రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్‌కు సంబంధించిన అంశాలు, వాటి పురోగతిపై ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారులను నియమించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం
- రిసోర్స్‌మొబిలైజేషన్ కేబినేట్ సబ్‌కమిటీ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

నిధుల సమీకరణ అంశంపైన అధికారులు తీవ్రంగా దృష్టి సారించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు సూచించారు. రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించేందుకు ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని అధికారులను ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో 'రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' సమావేశం కమిటీ ఛైర్మన్,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతివారం నిర్వహించే సమావేశంలో భాగంగానే ఈ వారం జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాఖల వారీగా పలు అంశాలను భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి ముఖ్యకార్యదర్శి వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ముఖ్యకార్యదర్శి రిజ్వీ,సి సి ఎల్ ఎ సెక్రటరీ నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ ,తో పాటు ఐఎఎస్ అధికారులు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్ర మోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి , ఆర్. వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీం గడ్డపై

## పోడు భూముల రగడ

దశాబ్దాల కష్టంపై అధికారుల దౌర్జన్యం..

తిరగబడ్డ రైతులు

ప్రజాపక్షం/ చింతలమానేపల్లి

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి, పెంచికల్‌పేట మండలాల్లో పోడు భూముల వివాదం రోజు రోజుకు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. వర్షాకాలం ప్రారంభమైనా క్రమంలో అటవీ అధికారుల పోడు భూముల ఆక్రమణ ప్రయత్నాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాణాలు పోయినా సరే, మా పొలాలు వదిలేది లేదు అంటూ పోడు రైతులు కూడా గట్టిగానే చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ అధికారులు అటవీ భూములను స్వాధీనం చేసుకొని మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, మూడు తరాలుగా, 30 నుండి 50 సంవత్సరాలుగా పోడు భూములను నమ్ముకొని జీవిస్తున్న రైతులు దీన్ని తీవ్రంగా



తరువాయి 12లో

## శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

నిరుపేదల చిరకాల స్వప్నం సాకారమవుతున్న వేళ

హామీమేరకు దశలవారీగా నగదు జమచేస్తున్న ప్రభుత్వం

ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ. కోటి 36 లక్షలు

ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్



ప్రజాపక్ష/ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు ఈ చిరకాల స్వప్నం సాకారం దిశగా ప్రజా ప్రభుత్వం సహకారంతో అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందిస్తోంది ప్రభుత్వం. మొదటి దఫాలో ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో రూ. కోటికి పైగా మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఈ కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. మొదటి విడతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తున్నది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే రూ.లక్ష, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 2,200 మంది అరెస్టు: ఐసిఇ రికార్డు



**వాషింగ్టన్:** అమెరికాలో వలసవాదుల వేటలో భాగంగా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారులు ఒకే రోజులో 2,200 మందిని అరెస్టు చేశారు. ఇది ఐసిఇ చరిత్రలోనే ఒక రికార్డు. ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నియోమ్ ఇటీవలే ఐసిఇ అధికారులకు కీలకాదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రోజుకు 3వేల మంది వలసదారులను అరెస్టు చేయాలని చెప్పారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఐసిఇ అధికారులు ఆల్టర్‌నేటివ్ టు డిటెన్షన్ (ఎటిడి) ప్రోగ్రామ్ కింద నమోదు చేసుకొన్న వారిని టార్గెట్ చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఎటిడిలో నమోదైన వలసదారులను ఐసీఈ కార్యాలయానికి రావా లని అధికారులు సందేశాలు పంపిస్తున్నా రు. అలా సందేహాలు అందిన వారు తమ వద్దకు రాగానే అరెస్టు చేస్తున్నారు. బేడీలు వేసి కార్లలో తరలిస్తున్నారు. అలా రాని వాళ్లు డిపోర్టేషన్‌కు గురవుతున్నారు.

## వారు మాకొద్దు..
### 12 దేశాల వారికి రానివ్వద్దని ట్రంప్ నిర్ణయం



**వాషింగ్టన్:** సంచలన నిర్ణయాలు తీసుకుంటూ తరచు వార్తల్లోకి ఎక్కుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించారు. తమ దేశంలోకి రావడానికి వీల్లేదంటూ 12 దేశాల ప్రజలపై నిషేధం విధించారు. కొలరాడోలో యూదు సమూహంపై ఒక వ్యక్తి దాడికి దిగిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అయితే, అధికారికంగా మాత్రం ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అమెరికా నిషేధించిన దేశాలు వరుసగా, అఫ్ఘానిస్థాన్, ఇరాన్, యెమెన్, మయన్మార్, చాడ్, కాంగో రిపబ్లిక్, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్. అదే విధంగా బురిండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్కమెనిస్థాన్, వెనిజులా దేశాలపై పాక్షిక నిషేధం విధించినట్టు వైట్‌హౌస్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం జూన్ 9వ తేదీ, సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. కాగా, ఈ నిర్ణయాన్ని దేశ భద్రత, అమెరికా పౌరుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తీసుకున్నట్టు ట్రంప్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో చాలా మంది ఉంటున్నారని, అలాంటి వారి కారణంగానే హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. 2017లో ఐరోపాలో చోటు చేసుకున్న ఘటనలు అమెరికాలో జరగడానికి వీల్లేదని ట్రంప్ స్పష్టం చేశారు. కొన్ని దేశాలను సురక్షితమైనవిగా చెప్పలేమని, అలాంటి దేశాల నుంచి బహిరంగ వలసలను అనుమతించేది లేదని పేర్కొన్నారు. కాగా, ట్రంప్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం కొత్తేమీకాదు. 2017లో ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్ దేశాలపై ఆయన ఇలాంటి నిషేధమే విధించారు. గత ఏడాది, మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నప్పుడు, తన ఎన్నికల ప్రణాళికలో నిషేధానికి సంబంధించిన వాగ్దానం చేశారు. తాను ఎన్నికైతే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా, యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని అధికారికంగా అమలు పరుస్తూ, ఉత్తర్వులపై సంతకం చేశారు.

## అమెరికాది అదే తీరు..
### గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ ఒప్పంద తీర్మానాన్ని వీటో చేసిన అగ్రరాజ్యం



**ఐక్యరాజ్య సమితి:** గాజా స్ట్రిప్‌పై అమెరికా వైఖరి మరోసారి బైటపడింది. అక్కడ శాశ్వతంగా కాల్పుల విరమణను అమలుకావాలని, ప్రజలకు మానవతాసాయం అందాలని పేర్కొంటూ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్) ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. ఒకవైపు గాజాలో శాంతి కోసం ప్రయత్నిస్తున్నామని, హమాస్, ఇజ్రాయెల్ మధ్య చర్చలను ప్రోత్సహిస్తూ, కీలక పాత్ర పోషిస్తున్నామని ప్రకటించుకుంటున్న అమెరికా, తీరా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు యూటర్న్ తీసుకుంది. ఇజ్రాయెల్‌కు మేలు చేసే అంశాలు లేవంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. గాజాలోని సుమారు 21 మంది ప్రజలు ఆకలితో.. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్నారని, వారికి తక్షణ సాయం అవసరమని భద్రతా మండలి అభిప్రాయపడింది. తాత్కాలిక ప్రకటనలు, ఒప్పందాలు కాకుండా, శాశ్వతంగా కాల్పుల విరమణ అమలు కావలని పేర్కొంటూ తీర్మానాన్ని సిద్ధం చేసింది. గాజా ప్రజలకు మానవతా సాయాన్ని అందించడానికి ఇజ్రాయెల్ చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 14 దేశాలు ఓటు వేయగా, అమెరికా వీటో చేసింది. మెజారిటీ సంబంధం లేకుండా, ఒక తీర్మానాన్ని కొట్టివేయడానికి ఉపయోగించే వీటో అస్త్రాన్ని గాజా విషయంలో అమెరికా ప్రయోగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికాకు సన్నిహితంగా ఉండే బ్రిటన్ కూడా వీటోను వ్యతిరేకించడం విశేషం. బ్రిటన్ దౌత్యాధికారి బార్బరా ఉడ్‌వార్డ్ సైతం ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను ప్రశ్నించారు. గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను విస్తృతపరుస్తున్నదని అన్నారు. కనీసావసరాల సప్లయిని సైతం అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ విధానాలను ఎవరూ ఆహ్వానించరని స్పష్టం చేశారు. పాకిస్తాన్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహమ్మద్ మాట్లాడుతూ అమెరికా చర్య ఒక హింసాత్మక విధానానికి స్వాగతం పలుకుతున్న వైనాన్ని స్పష్టం చేస్తున్నదని, రాబోయే తరాలు దీనిని గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. ఒక వర్గాన్ని లేదా ఒక ప్రాంత ప్రజలను ఏరివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఇలావుంటే, వలచ్చేవారం జరిగే ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గాజా అంశాన్ని లేవనెత్తుతామని పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ తెలిపారు. 193 సభ్య దేశాలున్న జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఏదిఏమైనా గాజా స్ట్రిప్‌లో బతుకుపోరాటం చేస్తున్న లక్షలాది మంది ప్రజలు, ప్రత్యేకించి పాలస్తీనియన్లకు సాయం కూడా అందకుం డా ఇజ్రాయెల్ సైనిక పహారా పెంచడం, దాడులు చేయడంపై పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, హమాస్ గాజా విడిచి పెట్టి వెళ్లాలని, అదే విధంగా ఇప్పటికీ హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ పౌరులను తక్షణమే విడుదల చేయాలని లేనందున, సెక్యూరిటీ కౌన్సిల్ తీర్మానాన్ని వీటో చేసినట్టు అమెరికా వాదిస్తున్నది.

### చైనా ఆగ్రహం..



ఇజ్రాయెల్ ఇప్పటికే అన్ని హద్దులను దాటేసిందని, గాజాలోని ప్రజలకు కనీస అవసరాలు కూడా చేరకుండా అడ్డుకుంటున్నదని యుఎన్‌లో చైనా రాయబారి ఫూ కాంగ్ విమర్శించారు. అంతర్జాతీయ నియమాలను, ఐక్య రాజ్య సమితి నిబంధనలను కూడా ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదని అన్నారు. ఒక దేశం అండగా నిలవడంతో, ఇజ్రాయెల్ సాగిస్తున్న దమనకాండను ఎవరూ కనీసం ప్రశ్నించడం కూడా లేదంటూ పరోక్షంగా అమెరికాపై విమర్శలు గుప్పించారు. మానవతా సాయంపై ఆంక్షలు ఎత్తివేయడం, గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం డిమాండ్ చేస్తూ ఐరాస భద్రతా మండలి ముసాయిదా తీర్మానాన్ని అమెరికా వీటో చేయడాన్ని తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. గాజా ప్రజల ప్రధాన డిమాండ్లు ప్రతిబింబించే... అంతర్జాతీయ సమాజం గొంతు ప్రతిధ్వనించే ఈ తీర్మానాన్ని వీటో చేయడం ద్వారా గాజా ప్రజల చిరు ఆశలను అమెరికా మళ్లీ చంపేసిందని వ్యాఖ్యానించారు. క్రూరంగా రెండు మిలియన్ల మందికిపైగా ప్రజలను అంధకారంలోకి నెట్టివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాజాలో ఘర్షణను ముగించడంలో భద్రతా మండలి అసమర్థత మరోమారు బహిర్గతమైందని, ఇజ్రాయిల్‌కు కవచంగా అమెరికా ఉందన్నారు. భద్రతా మండలి శాశ్వత సభ్యదేశంగా అమెరికా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ మానవతా చట్టంలోని అన్ని రెడ్ లైన్‌లను దాటేశాయని, భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఉల్లంఘించాయని ఫూ కాంగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అగ్రరాజ్యం అండదండలతో దానిని నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇటువంటి ద్వంద్వ వైఖరి, లక్షిత చర్యలను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గాజాలో శాంతి నెలకొల్పేందుకు, మానవతా విపత్తును నియంత్రించేందుకు, 'టూ స్టేట్' అమలు చేసేందుకు, సమగ్రంగా న్యాయం చేకూరేందుకు, పలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అంతర్జాతీయ సమాజంతో కలిసి పని చేసేందుకు చైనా సిద్ధమని ఫూ కాంగ్ ప్రకటించారు.

### అమెరికాకు నెతన్యాహు కృతజ్ఞతలు



తన వీటో అధికారాన్ని అమెరికా వినియోగించడంతో అగ్రరాజ్యానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఎక్స్ మాధ్యమంగా కృతజ్ఞతలు తెలిపారు. 'మా మధ్య పొద్దు పొడిచేందుకు ప్రసక్తే లేదని మా శత్రువులకు మరోమారు స్పష్టం చేసినందుకుగాను అమెరికాకు, డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు' అని ఆయన పేర్కొన్నారు. గాజా జైళ్లలో 58 మంది అమాయకులను బందీగా ఉంచిన హమాస్ ఉగ్రవాదుల వినాశనానికి ఇదొక్కటే మార్గం. తక్షణమే, బేషరతుగా బందీలను విడుదల చేయాలని నాగరిక ప్రపంచం డిమాండ్ చేయాలి' అని నెతన్యాహు ట్వీట్ చేశారు.

## రష్యాకు బేషరతుగా మద్దతిస్తాం: కిమ్



**ప్యాంగ్యాంగ్:** తమ మద్దతు ఎప్పుడూ రష్యాకు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రకటించారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఉత్తర కొరియా పర్యటనలో భాగంగా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో కిమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు బేషరతుగా సంపూర్ణ మద్దతును కిమ్ మరోసారి ప్రకటించారు. ఇద్దరు నాయకులు వ్యూహాత్మక భాగస్వామ్యం తదితర కీలకాంశాలపై చర్చించారు. కర్స్క్ ప్రాంతం పునర్నిర్మాణంపైనా మాట్లాడుకున్నారు. రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తోన్న పోరాటంలో అండగా ఉంటామని కిమ్ వెల్లడించారు.

## ఇండోనేషియాలో పెరుగుతున్న డ్రగ్స్ కేసులు
### భారతీయులు సహా పలువురు విదేశీయుల అరెస్టు



**జకార్తా:** ఇండోనేషియాలో, ముఖ్యంగా బాలీ ద్వీపంలో, ఇటీవల మాదక ద్రవ్యాల సరఫరా కేసులు పెరుగుతున్నాయి. భారత్‌సహా పలువురు విదేశీయులు మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్టు కావడం, మరణ శిక్ష ఎదుర్కోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. మాదక ద్రవ్యాల నిబంధనలను ఇండోనేషియా అత్యంత కఠినంగా అమలు పరుస్తున్నది. నేరస్థులపై కేసులు పెడుతున్నది. నేరం రుజువైతే, కోర్టులు మరణ శిక్ష విధించే అవకాశాలు కూడా ఉన్నాయి. కాగా, అరెస్టయిన వారిలో కొంత మంది భారతీయులు కూడా ఉన్నారు. లాస్ ఏంజెల్స్ నుండి బాలీకి వచ్చిన హరిశ్ వి. అనే భారతీయుడు, న్గురా రాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మాదకద్రవ్యాలతో కూడిన డఫెల్ బ్యాగ్‌తో పట్టుబడ్డాడు. ముత్తుకుమారన్, సెల్వదురై దినకరణ్, గోవిందసామి విమల్కందన్ అనే ముగ్గురు తమిళనాడు వాసులు, 2024 జూలైలో 106 కిలోల క్రిస్టల్ మెత్‌ను సింగపూర్‌ఫ్లాగ్డ్ వాహనం లెజెండ్ అక్వేరియస్ ద్వారా ఇండోనేషియాలోకి అక్రమంగా తరలించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రాసిక్యూటర్లు వారికి మరణ శిక్ష విధించాలని కోరుతున్నారు, అయితే వారి న్యాయవాదులు వారు నిర్దోషులని, నౌకా కెప్టెన్ బాధ్యత వహించాలనిఅంటున్నారు. 43 ఏళ్ల ఆస్ట్రేలియా పౌరుడు లామారా ఆచీహ 1.7 కిలోల కొకైన్‌ను బాలీలోకి అక్రమంగా తరలించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతను 2025 మే 22న అరెస్టయ్యాడు. ఇండోనేషియా మాదకద్రవ్య నిబంధనల ప్రకారం, అతనికి 20 సం వత్సరాల జైలు శిక్ష లేదా మరణ శిక్ష విధించే అవకాశం ఉంది. ముగ్గురు బ్రిటిష్ పౌరులు జోనాథన్ కొల్లియర్, లిసా స్టాకర్, ఫినియస్ ఫ్లోట్ 2025 ఫిబ్రవరిలో బాలీ విమానాశ్రయంలో 1 కిలోల కొకైన్‌ను డెజర్ట్ మిక్స్ ప్యాకెట్లలో దాచి ప ట్టుబడ్డారు. వారి కేసు డెన్పాసార్ జిల్లా కోర్టులో విచారణలో ఉంది. మొత్తం మీద ఇండోనేషియాలో ప్రస్తుతం సుమారు 530 మంది, అందులో 96 మంది విదేశీయులు, మాదకద్రవ్యాల కేసుల్లో మరణ శిక్ష ఎదుర్కొంటున్నారు. ఇండోనేషియా యొక్క కఠినమైన మాదకద్రవ్య నిబంధనలు మరియు శిక్షలు, విదేశీయులకు కూడా సమానంగా వర్తిస్తాయి.

## హైదరాబాద్‌లోనే
(మొదటి పేజీ తరువాయి)

రఫేల్ యుద్ధ విమానాలకు సంబంధించిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టిఎఎస్‌ఎల్‌లో తయారు చేయడానికి అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నాయి. రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్ దేశం వెలుపల తయారు కావడం ఇదే తొలిసారి కానున్నది. విమానయాన రంగంలో భారతదేశం గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుందనడానికి తాజాగా కుదిరిన ఈ కీలక ఒప్పందమే ఒక చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ భాగస్వామ్యం కింద టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ పోరాట జెట్ కీలక భాగాన్ని ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్‌లో ఒక 'కట్టింగ్‌ఎడ్జ్ ప్రొడక్షన్ ఫెసిలిటీ'ని నెలకొల్పనున్నది. మొదటి విమాన చట్రాలు 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లింగ్ లైన్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను తయారుచేయడానికి టిఎఎస్ లిమిటెడ్ సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలో టిఎఎస్ లిమిటెడ్ నెలకు రెండు విమానచట్రాలను అందించనున్నది. 'భారత్‌లో మా ఉత్పత్తులను బలోపేతం చేయటంలో ఇది ఒక నిర్ణయాత్మక అడుగుగానే భావిస్తున్నాం. భారత రక్షణ రంగంలో మా సేవలను విస్తరిస్తున్నందుకు మేం భారత్‌కు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత ఉపకరిస్తుంది. నాణ్యమైన సేవలు అందించేందుకు, సైనిక అవసరాలను తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతుంది' అని డస్సాల్ట్ ఏవియేషన్ చైర్మన్, సిఇఒ ఎరిక్ ట్రాపియర్ అన్నారు. ఈ ఒప్పంద ం భారత రక్షణ రంగ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సిఎండి సుకరన్ సింగ్ సంతోషం వ్యక్తంచేశారు.భారత వైమానిక వ్యవస్థ అభివృద్ధిని, పురోగతిని ఈ కీలక ఒప్పందం ప్రతిబింబిస్తుందన్నారు.

## ఆర్థిక ఒత్తిడి
(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ సంవత్సరానికి 4 శాతం పెరిగి 3,48, 847 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో స్కూటర్ అమ్మకాలు 5,48, 370 యూనిట్లుగా ఉన్నాయి. ఇది 2024 ఏప్రిల్‌లో 5,81,277 యూనిట్ల నుంచి 6 శాతం తగ్గింది. మోటార్ సైకిల్ పంపిణీలు 23 శాతం తగ్గాయి. ఏప్రిల్‌లో గత సంవత్సరంతో పోలిస్తే 8,71,666 యూనిట్లు. గత నెలలో మోపెడ్ హోల్‌సేల్స్ 38,748 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది 8 శాతం తగ్గి 41,924 యూనిట్లు. అదే విధంగా 2025 మొదటి త్రైమాసికానికి సంబంధించిన సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఇండియా మొబైల్ హ్యాండ్‌సెట్ మార్కెట్ సమీక్ష నివేదిక ప్రకారం భారత దేశంలో స్మార్ట్‌ఫోన్ రవాణా 7 శాతం తగ్గింది. 'సంఘటనల మెరుపు గురించి కాదు... రోజువారీ జీవిత వాస్తవికత గురించి ప్రశ్నలు అడిగే పరిస్థితిని అర్థం చేసుకునే, బాధ్యతాయుతంగా స్పందించే రాజకీయాలు మనకు అవసరం' అని రాహుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఎంపిక చేసిన కొంతమంది పెట్టుబడిదారుల కోసం కాకుండా ప్రతి భారతీయుడి కోసం పనిచేసే ఆర్థిక వ్యవస్థ మనకు అవసరం' అని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ జపాన్‌ను అధిగమించిందని ప్రభుత్వం పేర్కొన్న సమయంలో ఆయన వ్యాఖ్యలు వచ్చాయి.

**అధికార రాకీయాలకు చిహ్నంగా నితీశ్ ప్రభుత్వం**

బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అత్యాచార బాధితురాలి తల్లికి చికిత్స చేసినందుకు వైద్యుడిని దారుణంగా కొట్టిన ఘటనకు సంబంధించి ప్రభుత్వాన్ని విమర్శించారు. నేరం, నిరుద్యోగం, వలసలు రాష్ట్ర పాలకవర్గానికి నిజమైన గుర్తింపుగా మారాయని ఎద్దేవా చేశారు. బీహార్‌లోని జెడి(యు)–బిజెపి ప్రభుత్వం అధికార రాజకీయాలకు చిహ్నంగా మారిందనిష ఈ అన్యాయ చక్రాన్ని విచ్ఛిన్నం చేసి రాష్ట్రాన్ని భద్రత, ఆత్మగౌరవం, ఉన్నత మార్గంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు.

గయలో అత్యాచార బాధితురాలి ఇంటికి వెళ్లిన డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను అత్యాచార నిందితుడు చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టినట్లు చూపించే వీడియోను బీహార్ కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన తర్వాత రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. 20 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ, నితీష్ జీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బీహార్‌కు భద్రత, గౌరవం లేదా అభివృద్ధిని అందించలేకపోయిందని రాహుల్ మండిపడ్డారు. 'నేరం, నిరుద్యోగం, వలసలు ఇది నితీష్–బిజెపి ప్రభుత్వానికి నిజమైన గుర్తింపుగా మారిందని, ప్రజలను నిస్సహాయులను చేస్తూ అధికారాన్ని చేపట్టడమే వారి ఎజెండా అని ఆయన ఆరోపించారు. నితీష్ ప్రభుత్వం న్యాయం కోసం కాకుండా అధికార రాజకీయాలకు చిహ్నంగా మారిందని ఎద్దేవా చేశారు. ఇక చాలు.. ఈ అన్యాయ చక్రాన్ని విచ్ఛిన్నం చేసి బిహార్‌ను భద్రత, ఆత్మగౌరవం, ఉన్నతమార్గంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## హైడ్రాకు అనుమతి
(మొదటి పేజీ తరువాయి)

అలిశెట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ ఇటీవల విచారించింది. హైడ్రా తరపు అడ్వకేట్ కె. పవన్‌కుమార్ వాదిస్తూ, బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఆక్రమణదారులు చెరువులో అక్రమంగా డంపింగ్ చేస్తూ చెరువును కబ్జా చేస్తున్నారన్నారు. ఎ.సుధాకర్‌రెడ్డి మరో ఆరుగురు బాగ్‌అంబర్‌పేటలోని 7 ఎకరాల భూమిపై హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ జడ్జి పిటిషన్ కొట్టివేశారన్నారు. తిరిగి అప్పీలు దాఖలు చేయగా హక్కులకు సంబంధించిన వివాదాలను హైకోర్టు తేల్చదని, సివిల్ కోర్టులో తేల్చుకోవాలని, అవసరమైతే ఇంజంక్షన్ ఉత్తర్వులు తెచ్చుకోవాలని డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిపై ప్రైవేటు వ్యక్తులు సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి ఇంజంక్షన్ దరఖాస్తు తేలేదాకా యథాతథస్థితి కొనసాగించాలంటూ మే 7న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం వస్తోందని, ఇప్పుడు పనులు పూర్తిచేయకపోతే పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, మధ్యంతర ఉత్తర్వులను సవరించని పక్షంలో పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం స్టేటస్ కో కొనసాగించాలని, అయితే వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురవుతాయన్న హైడ్రా వాదనను పరిగణనలోకి తీసుకుని ముంపు నివారణ పనులు చేపట్టడానికి అనుమతిస్తూ గత ఉత్తర్వులను సవరించింది.

## చినాబ్ వంతెన నేడు జాతికి అంకితం
(మొదటి పేజీ తరువాయి)

నిఘా కోసం డ్రోన్‌లు, అధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. అలాగే సరిహద్దులో కూడా భద్రతను మరింత పటిష్టం చేశారు. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి అయిన చినాబ్ ఉక్కు వంతెన నదికి 359 మీటర్ల ఎత్తులో ఉంటుంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన ఈ వంతెన నిర్మాణానికి కేంద్రం రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. దీంతో భారత రైల్వే నెట్ వర్కుతో జమ్మూ కశ్మీర్ పూర్తిగా అనుసంధానం కానుంది.

## సుధాకర్ మృతి
(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 186 మంది బస్తర్ డివిజన్‌లోని హతమయ్యారు. ఇందులో బీజాపూర్, బస్తర్, కాంకేర్, కొండగావ్, నారాయణ్పూర్, సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. గత ఏడాది జనవరి నుండి ప్రభుత్వ లెక్కల ప్రకారం బస్తర్ డివిడన్‌లో ఇప్పటి వరకు 403 మంది కంటే ఎక్కువమంది వివిధ క్యాడర్లకు చెందిన మావోయిస్టులు వేర్వేరు ఎన్కౌంటర్లలో మృతి చెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**11 మండలాల్లో మోడల్ హౌస్‌లు**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం, గదులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుగా జిల్లాలోని ఆయా చోట్ల మోడల్ హౌస్ లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 11 మండలాల్లో మోడల్ నిర్మాణాలను మొదలు పెట్టారు గృహ నిర్మాణ శాఖా అధికారులు. ఆయా ఇండ్లు తుదిదశకు చేరుకున్నాయి. రూ. కోటి 36 లక్షలకు పైగా సాయం మంజూరు

జిల్లాకు మొదటి విడుత కింద 1061 ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి అయింది. వీటిలో బేస్మెట్ లెవెల్ లో 105, రూఫ్ లెవెల్ లో 31లో ఉన్నాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కుంటున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్..**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7828 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్ధిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గం లోని బోయినపల్లి మండలంలో ఫేజ్1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గం లోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్1,2లో 805 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఇటీవల కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను అభినందించారు.

### రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో ..

చాలా ఏండ్లుగా సొంత ఇల్లు కట్టుకోవాలి అనేది చూస్తున్న. మాకు రేకుల ఇల్లు ఉండేది. ఇల్లు కట్టుకునే పరిస్థితి లేక ఆగినం. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో నేను ఇల్లు కట్టుకుంటున్న. బేస్మెంట్ కట్టిన రూ. లక్ష రూపా యలు నా బ్యాంక్ ఖాతాలో పడ్డయి. సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు.

**కత్తెర లక్ష్మి , 8వ వార్డ్ పెద్దూర్, సిరిసిల్ల మున్సిపాలిటీ**

### రెండు లక్షలు పడ్డయి..

నా గూనల ఇల్లు కూలింది. మస్తు ఇబ్బంది పడ్డం. శీనన్నను కలిసి ఇల్లు అడిగినం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించిండు. ముగ్గు పోసి.. కట్టుకుంటున్న. బేస్ మీట్ అయి, గోడలు లేసినయి. నా బ్యాంక్ అకౌంట్ల రెండు లక్షల రూపాయలు పడ్డయి. నా ఇల్లు కట్టుకునేందుకు సాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు.

**ద్యావ సూర్యమ్మ, వెంకటాంపల్లి, వేములవాడ మండలం**

### పైరవీ అవసరం లేదు..

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరి పైరవీ అవసరం లేదు. నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమవుతుంది. వీటి కోసం ఎవరినీ సంప్రదించవద్దు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు పూర్తి సహకారం అందిస్తాము. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకుని రానున్న దసరా దీపావళి పండుగలను నూతన గృహాలలో జరుపుకోవాలని లబ్ధిదారులను కోరుతున్నాను.

**– సందీప్ కుమార్ ఝా, కలెక్టర్ రాజన్న సిరిసిల్ల**

### ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ఇటీవల పర్యటనలో జిల్లాకు అదనంగా 1750 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. దీంతో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశంవచ్చింది.

**–ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

## పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా పార్టీ శ్రేణులు
### టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీకి, ప్రభుత్వానికి నాయకులు, కార్యకర్తలు వారధిగా పనిచేయాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో వరంగల్, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి కడియం కావ్య, ఎంఎల్‌సి, ఎంఎల్ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కమిటీల ఆలస్యంతో కార్యకర్తల్లో నైరాశ్యం చెందిన మాట వాస్తవమన్నారు. త్వరలోనే అర్హతల ప్రకారం పదవులకు ఎంపిక చేస్తామని తెలిపారు. 17 నెలల పాలనలో ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేలపై ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. మీనాక్షి నటరాజన్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. చురుకైన నాయకులను పరిశీలకులతో గుర్తించి, తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకేళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలతో అనుసంధానంగా పని చేయాలని సూచించారు. సీనియర్, జూనియర్‌లతో సమన్వయంతో పని చేయాలన్నారు. కుల సర్వే, ఎస్‌సి వర్గీకరణ, సన్న బియ్యం, భూ భారతి పట్ల ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా పథకాల అమలు జరుగుతుందని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## మాగంటి గోపినాథ్‌కు గుండెపోటు
### ఎఐజి ఆసుపత్రిలో చికిత్స

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ఎంఎల్ఎ మాగంటి గోపినాథ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. సకాలంలో కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రథమ చికిత్స అనంతరం ఆయన్ని ఐసియు వార్డుకు తరలించారు. ఇక్కడ ఆయన్ని 48 గంటల పాటు అబ్జర్వేషన్‌లో పెట్టామని వైద్యులు ప్రకటించారు. అయితే ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం చికిత్సకు స్పందిస్తున్నారని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఆయన అనారోగ్యంపై వస్తున్న వందతులను వారు కొట్టిపారేశారు. గోపీనాథ్‌కు ఐసీయూలో 48 గంటల అబ్జర్వేషన్ కొనసాగుతోందని, ఆయన చనిపోయారంటూ వస్తున్న వార్తలు అసత్యం అన్నారు. దయచేసి అలాంటి వదంతులను ప్రచారం చేయవద్దని మీడియా మిత్రులను వారు కోరారు. మరోవైపు గోపీనాథ్ అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న బిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ తదితరులు ఆసుపత్రికి చేరుకొని గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అమెరికాలో ఉన్న కెటిఆర్ కూడా గోపీనాథ్ ఆరోగ్యంపై ఆరా తీశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మ్యుటేషన్‌కు డబ్బులు డిమాండ్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబికి చిక్కిన బిల్‌కలెక్టర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవన్‌కుమార్‌లు రూ.20వేలు లంచం తీసుకుంటు రెడ్ హ్యాండెడ్‌గా గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి ఆనంద్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ తూంకుంటకు చెందిన సదరు ఇంటి యజమాని శామీర్‌పేటలో రెండు ఇండ్లను కొనుగోలు చేశాడు. ఆ ఇండ్లకు సంబంధించి మ్యూటేషన్ చేయించడానికి సంవత్సరం నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవన్‌కుమార్‌లు బాధితుడి ఇంటికి వెళ్లి మీ ఇంటి మ్యూటేషన్ పెండింగ్‌లో ఉన్నాయని రూ.20వేలు లంచం ఇస్తే మ్యూటేషన్ చేస్తామని ఇంటి యజమానికి చెప్పారు. విసుగుచెందిన యజమాని ఎసిబి అధికారులకు పిర్యాదు చేయడంతో రూ.20వేలు లంచం తీసుకుంటుండగా శ్రవన్‌కుమార్‌ను ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరం

### సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యిద్ అజీజ్ పాషా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. పెరిగిన గ్లోబల్ వార్మింగ్‌లో ప్రపంచంలోనే భారత దేశం రెండవ స్థానంలో, అందులో దక్షిణ భారత దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, ఇది ప్రజల జీవితాలు జీవనోపాధికి హాని కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్), ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్క్ వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ అజీజ్ పాషా, ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ప్రభాకర్, నాయకులు ఎ.విజయలక్ష్మి, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ప్రబలమైన పారిశ్రామికీకరణ, ప్రభుత్వాల తిరోగమన విధానాలు పర్యావరణానికి భారీ ముప్పును కలిగిస్తున్నాయన్నారు. దేశంలో 2019 నుండి 2022 వరకు 5.8 మిలియన్ చెట్లు నరికివేయగా, ఉపగ్రహ సర్వేలో 11 శాతం పూర్తిగా పెరిగిన చెట్లు నరికివేశారని తేలిందని తెలిపారు. దక్షిణ భారత దేశంలోని తెలంగాణలో అత్యధికంగా 2014 నుండి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ సంక్షోభం, క్షీణిస్తున్న గాలి నాణ్యత, అటవీ నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం ప్రజల జీవితాలను ప్రమాదంలో పడవేస్తున్నాయని, ఇది గ్లోబల్ వార్మింగ్‌కు నిదర్శనమన్నారు. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇది నీటి వనరులను, వ్యవసాయం, ప్రజల ఆరోగ్యాలపై ప్రభావితం చూపిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం 1997 క్యోటో ప్రోటోకాల్, 2015 పారిస్, సిఒపి19, బాకు వంటి అంతర్జాతీయ ఒప్పందాలను ఖచ్చితంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ ప్రకృతి దృశ్యానికి ప్రాణం పోసే పర్యావరణపరంగా సున్నితమైన కంచగచ్చిబౌలి అడవిని తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం వేలం వేయడానికి అక్కడ ఉన్నసహజ గడ్డి, చెట్లను నరకడం, వన్యప్రాణులకు హాని కలిగించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో కంచాగచ్చిబౌలి అడవి భూములు రక్షించబడ్డాయని చెప్పారు. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఇంటి నిర్మాణానికి అనుమతి పొందే ముందు రెండు చెట్లను నాటాలనే ముందస్తు షరతును బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్ అమలు చేస్తుందని, దీనిని జిహెచ్‌ఎంసి, ఇతర మునిసిపాలిటీలను అమలు చేయాలని సయ్యద్ అజీజ్‌పాషా విజ్ఞప్తి చేశారు. రేఖల గోపాల్ మాట్లాడుతూ ఊహించలేని వేడి తరంగాలు, వరదలు, తుఫానులు తీవ్రతరం అవుతుండడం, గ్లోబల్ వార్మింగ్ మొత్తం ప్రపంచానికి అతిపెద్ద ప్రమాద సంకేతమన్నారు. మన జీవితాలకు అనూహ్యమైన నష్టాన్ని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను ఒక్కసారి వాడకానికి నో చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కడారి ప్రభాకర్ మాట్లాడుతూ అంటార్కిటికా పచ్చని భూముల వద్ద హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నందున, ప్రస్తుత పర్యావరణాన్ని మెరుగుపరచడానికి బహుముఖ విధానం అవసరమని అన్నారు. మునీర్ పటేల్ మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజా అవగాహన ప్రచారం, సమాజ భాగస్వామ్యాన్ని అవసరమని తెలిపారు.

### ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా..

# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించరా?

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి దుయ్యబట్టారు. రాజీవ్‌గాంధీ హయాంలో సుపరిపాలన కోసం 73, 74వ రాజ్యాంగ సవరణలో ఉన్నవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను జాప్యం చేయడం సరికాదని, వెంటనే నిర్వహించాలని, గ్రామపంచాయతీ పెండింగ్ నిధులు విడుదల చేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు. గురువారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ మట్లాడారు.
కేంద్రంలోని బిజెపి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ విరుద్ధ పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. మోదీ నియంతృత్వ పోకడతో ఉత్తరాది రాష్ట్రాలకు పెద్దపీట వేస్తూ దక్షిణాదిపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెంచుకునేందుకే కులగణన అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు సీట్లు తగ్గించి అన్యాయం చేస్తారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మనువాద సిద్ధాంతం పాటించే ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వంపై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకు సిద్ధమయ్యామన్నారు.
పాకిస్తాన్ ఉగ్రవాదులపై కగార్ ఆపరేషన్ పేరిట యుద్ధం చేసి చర్చలు జరిపారు, కానీ మావోయిస్టులతో చర్చలు జరిపి పరిష్కరించడంలేదన్నారు. మావోయిస్టులను అంతం చేయాలని మోడీ, అమిత్ షా కంకణం కట్టుకున్నారన్నారు. ప్రశ్నించే గొంతు ఉండకూడదని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. నియంతృత్వ పాలనతో బానిసలుగా ఉండే పరిస్థితి నెలకొందన్నారు. మావోయిస్టు పార్టీని అంతం చేయడం సాధ్యం కాదన్నారు. మావోయిస్టులది సామాజిక ఆర్థిక సమస్య అని, శాంతియుతంగా మోదీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అభివృద్ధిలో మాత్రం దక్షిణాదిపై నిర్లక్ష్యం చూపెడతారన్నారు. పక్షపాతం చూపెడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అణచివేస్తామంటే కుదరదన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పైడిపల్లి రాజు, బండ రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

### ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేసి

# రైతులను వెంటనే విడుదల చేయాలి

### సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గద్వాల జిల్లా రాజోలిమండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ కంపెనీ నిర్మాణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు, ఇంటి స్థలాలు ఉండడం వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారన్నారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయతీ అనుమతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జెసిబిలు, టిప్పర్లు, కంటైనర్లతో పాటు, బయటి నుండి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, దీన్ని వ్యతిరేకించిన రైతులు, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే రిమాండ్ చేసినవారిని విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేయడంతోపాటు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. అదేవిధంగా ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరిగినా తమ భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్న నేపథ్యంలో రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి

### పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి కార్మిక సంఘాల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశాఖ స్టీల్ ప్లాంటులో గత 35 ఏళ్లుగా పనిచేస్తున్న 5541 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే పనిలోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి చైర్మన్ డి.ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. విధుల్లో నుంచి తొలగించిన 5514 మంది కాంట్రాక్టు కార్మికులు గత 35 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారిని విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ప్రతినిధుల బృందం గురువారం హైదరాబాద్‌లో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీని కలిసి వినతిపత్రం అందజేశారు. 5541మంది కాంట్రాక్టు కార్మికులు పర్మినెంటు ఉద్యోగులతో సమానంగా అన్ని పనులను చేస్తూ విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ, కార్మికశాఖ టెక్స్‌టైల్, స్టీల్ డెవలప్‌మెంట్ చైర్మన్, సభ్యుల బృందానికి ఆదినారాయణ, ఎస్.బాల్‌రాజులు వివరించారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధులలోకి తీసుకోవడంతోపాటు విశాఖ స్టీల్‌ప్లాంటులో జరుగుతున్న అక్రమ తొలగింపులను వెంటనే ఉపసంహరించుకొని వారినందరినీ పర్మినెంటు చేయాలని వారు కోరారు. దీంతో హైలెవెల్ కమిటీలో చర్చించి న్యాయం చేస్తామని పార్లమెంట్ సభ్యుల స్టాండింగ్ కమిటీ చైర్మన్ సభ్యులు హామీ ఇచ్చారు.
పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులను కలిసిన వారిలో ఎస్.బాల్‌రాజ్, డి.ఆదినారాయణ (ఎఐటియుసి), వెంకటేష్ (సిఐటియు), విజయ్‌కుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), రెబ్బా రామారావు(హెచ్‌ఎంఎస్) తదితర నాయకులు ఉన్నారు.

# బనకచర్ల తెలంగాణ కాదు

### కృష్ణా, గుంటూరు జిల్లాలూ వ్యతిరేకిస్తున్నాయి

### డాక్టర్ కె.నారాయణ



**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనవసరంగా బనకచర్ల అనే కొత్త ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చి, అటు తెలంగాణలో, ఇటు ఆంధ్రలోని కృష్ణా, గుంటూరు జిల్లాలతో వివాదాలు తీసుకువస్తున్నాడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఎపిలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసి, బనకచర్లను ఎందుకు చేపడతున్నారని ప్రశ్నించారు. వాటిని వదిలేసి బనకచర్లను చేపడితే సమస్య జటిలమవుతుందని, ఈలోగా చంద్రబాబు ప్రభుత్వానికి మిగిలి ఉన్న నాలుగేళ్ళు గడిచిపోతాయని ఎద్దేవా చేశారు. తిరుపతిలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు పేరుతో లేని కొత్త సమస్యను తీసుకువచ్చాడని, దీనికి వ్యతిరేకంగా ఇప్పటికే తెలంగాణ ప్రజలు ఆందోళన చేస్తున్నారని, కృష్ణా, గుంటూరు జిల్లాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఆ ప్రాజెక్టు చేపడితే గోదావరి నీళ్ళను మొత్తంగా తీసుకెళ్తే, కర్నాటక పేచీ పెట్టే అవకాశం ఉందని, మాకు నీరు తగ్గే ప్రమాదం ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అసలు బనకచర్ల ఆవశ్యకతనే లేదని, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా, గాలేరునగరిని వదిలేసి కొత్త సమస్యలు ఎందుకు తెచ్చిపెడుతున్నారని నిలదీశారు.

# దన్వాడ రైతులను వెంటనే విడుదల చేయండి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ బౌన్సర్లతో పాటు పోలీసులు కూడా రైతులపై విచక్షణారహితంగా దాడిచేయడం అమానుషమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే సిఎం రేవంత్‌రెడ్డి, తన జిల్లాలో ఘటన జరిగి 24గంటలు అవుతున్నప్పటికీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 12 గ్రామాల రైతులను పోలీసులు కొట్టి, 40 మందిపై కేసులు నమోదు చేసి, 12 మందిని రిమాండ్‌కు తరలించడం దుర్మార్గమని హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన పెద్ద ధన్వాడకు చెందిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను కొట్టించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానిపైన, బౌన్సర్లపైన ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ రైతులోకం తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేద రైతుల కడుపుకొట్టి బడా పారిశ్రామికవేత్తలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడం సిఎం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. 2013భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ, భూములను బలవంతంగా సేకరించే బాధ్యతను సిఎం తన భుజాన వేసుకోవడంతో రైతులపై తరచుగా ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని ఆరోపించారు.


# సిఐడి చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నేర పరిశోధక విభాగం (సిఐడి) చీఫ్‌గా ఐపిఎస్ 1996 బ్యాచ్‌కు చెందిన అదనపు డిజిపి చారుసిన్హా గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలోనే లక్డీకాపూల్‌లోని డిజిపి ప్రధాన కార్యాలయంలో ఉన్న సిఐడి కార్యాలయంలో చారుసిన్హా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)లో ఏడు సంవత్సరాల విశిష్ట సేవల తర్వాత చారుసిన్హా తెలంగాణకు తిరిగివచ్చారు. ఆమె బీహార్, జమ్మూకశ్మీర్లో పనిచేశారు. చారుసిన్హా మహిళా భద్రత, షీ టీం, భరోసా కేంద్రం అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తారు. సిఐడి చీఫ్‌గా ఇంత కాలం పనిచేసిన శిఖాగోయల్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# ఈనెల 9న బిసి కమిషన్ బహిరంగ విచారణ షురూ

### తొలగించిన 26 కులాల విషయమై సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తొలగించబడిన 26 కులాల విషయంలో బిసి కమిషన్ ఈ నెల 9,10,11 తేదీలలో బహిరంగ విచారణ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై బిసి కమిషన్ కార్యాలయంలో గురువారం బిసి కమిషన్ సమావేశమైంది. వివిధ అంశాల పట్ల కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల వివరాల సేకరణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గడువులోగా సమాచారం సమర్పించనటువంటి వివిధ శాఖల కార్యదర్శులతో కమిషన్ సమీక్షా సమావేశం నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. సుప్రీం కోర్ట్‌కు కమిషన్ నివేదిక సమర్పించాల్సిన అవసరం ఉన్నందున తొలగించిన కులాల విషయంలో కులగణనలో నమోదైన జనాభా సామాజిక, ఆర్థిక, విద్య, వెనుకబాటుతనం వివరాలను అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. నిజామాబాద్ జిల్లా తాళ్ళ రాంపూర్ గ్రామంలో గతనెల వెలుగులోకి వచ్చిన బిసిల గ్రామ బహిష్కరణ అంశంలో నిజామాబాద్ కలెక్టర్ సమర్పించిన నివేదికను పరిశీలించి జిల్లా యంత్రాంగం స్పందించిన తీరును కమిషన్ ప్రశంసించింది. కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చవలసిన నలభై కులాల విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయాదేవి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# విజయవంతంగా గ్రామగ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ

### 35 వేల మంది అభ్యుదయ రైతులకు 2500 క్వింటాళ్ల విత్తనాలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 2వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అన్ని రెవిన్యూ గ్రామాల్లో ఎంపిక చేయబడిన 35,000 మంది అభ్యుదయ రైతులకు 2500 క్వింటాళ్ల నాణ్యమైన మూల విత్తనాన్ని పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. వరిలో 20,000, జొన్నలో 1,522, కందిలో 4,568, పెసరలో 8,910 విత్తన కిట్లను రైతాంగానికి అందించడం జరిగిందని, నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 2,192 కిట్లను, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లాలో అత్యల్పంగా 379 విత్తన కిట్లను పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నాణ్యమైన విత్తనాన్ని అందుకున్న రైతులు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి వచ్చిన దిగుబడిని గ్రామంలోని ఇతర రైతులకు పంపిణీ చేయడం ద్వారా రానున్న రెండు మూడేళ్లలో ప్రతీ గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించగలదని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి రైతు ప్రయోజనకరమైన వినూత్న కార్యక్రమాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు మరిన్ని చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతితో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి అభినందించారు.

# మంత్రి కొండా సురేఖకు అస్వస్థత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంకు హాజరయ్యే క్రమంలో తన చాంబర్‌లో బిజిబిజీగా ఉన్న సమయంలో కొండా సురేఖ అస్వస్థతకు గురై స్పృహతప్పి పడిపోయారు. ఈ విషయం గమనించిన సిబ్బంది హుటాహుటిన వైద్యులను రప్పించి వైద్యం అందించారు. ఎటువంటి ఆందోళనా అక్కర్లేదని వైద్యులు స్పష్టం చేశారు. విరామం లేకుండా గత కొద్ది రోజులుగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలకు హాజరుకావడం, గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాదు పిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాంలో పాల్గొనడం... అటు తర్వాత సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరు అయ్యేందుకు అవసరమైన డేటాను అధికారుల నుంచి సేకరిస్తున్న నేపథ్యంలో సకాలంలో ఆహారం తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ సచివాలయంలో స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారు. అనంతరం అక్కడే వైద్యులు ప్రథమ చికిత్సను మంత్రికి అందించారు. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.. సిఎం రేవంత్ రెడ్డి మంత్రి కొండాసురేఖ వద్దకు వచ్చి పరామర్శించారు.
కొద్ది సేపు మంత్రి వద్దనే ఉండి ఆమె యోగక్షేమాలు వైద్యులను అడిగి తెలుసుకోగా... ఒకటి, రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు ముఖ్యమంత్రికి చెప్పారు. కాగా, ఆరోగ్యంపట్ల జాగ్రత్త తీసుకోవాలని, ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకోవాలని మంత్రి సురేఖకు సిఎం సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రి సురేఖ విశ్రాంతి తీసుకునేందుకు తన హైదరాబాద్ నివాసానికి వెళ్ళారు. ఈ విషయం మీద తన వరంగల్ ఈస్ట్ నియోజకవర్గవాసులు, జిల్లాకు చెందిన వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సురేఖ ఉద్ఘాటించారు. గత కొన్నిరోజులు బిజీబిజీ షెడ్యూల్ నేపథ్యంలో ఆహారం సకాలంలో తీసుకోకపోవడంతోనే ఇబ్బంది తలెత్తిందని సురేఖ చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల సందర్భంగా తన ఆరోగ్య నిమిత్తం వాకబు చేసిన మిత్రులు, సోదరులందరికీ మంత్రి సురేఖ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### ఏడాదిలో వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలకు

# సొంత భవనాలు నిర్మిస్తాం

### బాలికల రక్షణ కోసం స్నేహ కమిటీలు

### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది వేయి అంగన్‌వాడి కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరుగుతున్న మేధోమథన సదస్సు ముగింపు సభలో మంత్రి మాట్లాడారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్‌వాడి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్‌వాడి సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను, హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువు అవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వాళ్లకు శ్రీరామరక్షలాగా ఉంటాయని వివరించారు.
అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారన్నారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డలను చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో వదిలేసి వెళుతున్నారని, చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నివారించేందుకు వీలున్నచోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా, ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని తెలిపారు.
బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను మంత్రి కోరారు. మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో త్వరలోనే ఒక సలహా కమిటీ నియమిస్తామని, ఆ కమిటీ సలహాలు, సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగిన మేధోమథన సదస్సులో మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు ప్రాణం పోసిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామన్నారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సర్కిల్-2, ఉప్పల్.
NIT No. 06/EEC-3/UPL/GHMC/2025-26 టెండర్ ప్రకటన తేది: 04.06.2025
**పని పేరు:** 1 పని కొరకు జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, ఉప్పల్, వార్డు నం.10 మరియు చిల్కానగర్, వార్డు నం.7లో కావేరి నగర్ కల్వర్ట్ వద్ద చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు. **అంచనా విలువ:** రూ.7.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 12.06.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎల్.నాగేందర్, ఇఇ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నం.2, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 3161-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025

**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ**
No. 07/T2/DEE/DSE/SEHnk/2025-2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 30.05.2025
హనుమకొండ జిల్లా, హనుమకొండ సర్కిల్‌లో (1) పని మరియు వరంగల్ జిల్లాలో (2) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 02.06.2025న సా.4.00గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పైన తెలిపిన పనులకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 09.06.2025న మ.3.30గం.ల లోపు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్ :: హనుమకొండ.
DIPR R.O. No. : 3204-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.
లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 05.06.2025
ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:11.06.2025 బుధవారము రోజున మ. 2.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04.07.2025 నుండి 03.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.
ఇట్లు, సిరికొండ నవీన్ కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 3148-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 06 జూన్

# జనగణన జాప్యపు ఎత్తుగడలు

ఎట్టకేలకు దేశవ్యాప్త జనగణన(సెన్సెస్)కు మోదీ ప్రభుత్వం సిద్ధపడింది. జనగణనతో పాటు స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా కులగణనను కూడా 2027 మార్చి 1వ తేదీ నుంచి (మంచు కురిసే జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో మాత్రం ఆరు నెలలు ముందుగానే) రెండు దశలుగా చేపట్టనున్నట్లు బుధవారం నాడు హోం మంత్రిత్వ శాఖ ప్రకటనను విడుదల చేసింది. దీనికి సంబంధించి ఈ నెల 16న సవివర నోటిఫికేషన్ వెలువడుతుందని చూచాయిగా తెలియపరిచింది. ఐదేళ్ళుగా జనగణనను వాయిదా వేస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం, దానిని మరింత సాగదీస్తూ నోటిఫికేషన్ వెలువడిన దాదాపు రెండేళ్ళకు జనగణన ప్రక్రియను చేపట్టనుండడం విచిత్రం. ఇన్నేళ్ళ ఆలస్యానికి కొవిడ్ – 19ను సాకుగా చూపించారు. అయితే, కొవిడ్ విశ్వరూపం ప్రదర్శించిన చైనా, యుకె, అమెరికా తదితర దేశాలలోనే యథాప్రకారం దశాబ్ది జనాభా లెక్కలు పూర్తయ్యాయి. మన దగ్గర అనేక మార్లు ఎన్నికలను కూడా నిర్వహించుకున్నాం. 2021లో జనగణనను వాయిదా వేసుకునే నాటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకున్నట్లయితే, తాజాగా ఆ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళేందుకు మరో 23 నెలలు ఆలస్యమెందుకు? ప్రస్తుత జనగణనతో దేశభవిష్యత్తు, నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్, ప్రజాస్వామ్యం వ్యవస్థలో బిసిల హెచ్చు ప్రాతినిధ్యం, తదితర అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. ఎందుకంటే, మహిళలకు పార్లమెంటు, అసెంబ్లీలో మూడో వంతు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లు 2023 సెప్టెంబర్‌లోనే పార్లమెంటులో ఆమోదం పొందినప్పటికీ, అమలుకు తదుపరి నియోజకవర్గాల పునర్విభజనతో లంకె పెట్టింది మోదీ ప్రభుత్వం. ప్రస్తుత నియోజకవర్గాలు 2026 నాటికి కాలం చెల్లి, కొత్త పునర్విభజన రాజ్యాంగ ఆదేశం. ఇక్కడే మరో తిరకాసు దాగి ఉంది. నియోజకవర్గాల పునర్విభజన చట్టం 2002 ప్రకారం 2026 తదుపరి జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ ప్రవచిత కుటుంబ నియంత్రణ పాటించినందుకు జనాభా తగ్గిపోయిన దక్షిణ భారతం పునర్విభజనలో లోక్‌సభ స్థానాలు గణనీయంగా కోల్పోనుందనే ఆందోళన ఉధృతమైంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కులగణన చేపట్టాలని, బిసిలకు చట్టసభల్లో సమాన వాటా కల్పించాలనే, విపక్షాల డిమాండ్ ఊపందుకుంది. నాడు ఆ డిమాండ్‌ను తిరస్కరించిన మోదీ ప్రభుత్వం చివరకు ప్రతిపక్షాల ఒత్తిడికి తలొగ్గి కులగణన చేపట్టేందుకు అంగీకరించింది. ఈ వివరాలతో చట్టసభల్లో బిసిల భాగస్వామ్యంపై కూడా చర్చ జరగనుంది. కాబట్టి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన, దక్షిణాది సీట్ల సంఖ్య, బిసిలకు చట్టసభల్లో వాటా వంటి అంశాలు మనువాద ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ద్వయానికి సుతారమూ ఇష్టం లేనివి. ఇవన్నీ తాజా జనాభా లెక్కలతో ముడి పడి ఉండడంతో, సాధ్యమైనంత మేరకు ఆ ప్రక్రియను జాప్యం చేసేందుకే మోదీ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. అందుకే ప్రకటన వచ్చిన తదెనకి 23 మాసాలు ఆలస్యంగా జనగణను ప్రారంభించడం, అది పూర్తయ్యి లెక్కలు బైటికి వచ్చేందుకు 2028–29 వరకు సమయాన్ని దొలుపుకుంటూ పోయడమే ఏలికల ప్రథమపద సోపానంగా సాగుతున్నది. ఈ డెడ్‌లైన్‌లు కూడా చివరికి వచ్చేసరికి మరింత పెరిగే అవకాశమూ లేకపోలేదు. ప్రస్తుత జనగణననే 2031లో చేపట్టాల్సిన జనగణనలో కలిపే యత్నాన్ని కొట్టిపారేయలేము. అలా చేస్తే, ఒక దశాబ్ది జనాభా లెక్కలు గల్లంతైనట్లే. బిజెపికి మరో ఇష్టమైన అంశం 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' కూడా జనగణన,తదనంతరం నియోజకవర్గాల పునర్విభజనకు అనుబంధంగా ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన బిల్లును జెపిసికి పంపారు.జనగణన జాప్యం వెనుక బిజెపి వ్యూహం ఇప్పటికీ బైట పడలేదు. అయితే, ఈ ప్రక్రియ ద్వారా మైనారిటీల జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుందనే కథనాన్ని సృష్టించి, దేశంలో మరింత విభజన తీసుకురావడం, అలాగే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యాన్ని తీసుకురావడం వంటి ప్రతిపాదనలు సంఘపరివార్ మనసు దొంతరలలో దాగి ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. అకస్మాత్తుగా జనగణన, కులగణనను ముందుకు తీసుకురావడం వెనుక త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికలు ముఖ్య కారణం. గతంలో తాము వ్యతిరేకించిన కులగణన ఇప్పుడు బిజెపికి ఏకుమేకుగా మారడంతో, తామే దానిని ముందుకు తీసుకెళ్తున్న చాంపియన్‌లుగా ఏమార్చేందుకే ఈ టక్కుటమారా విద్యలు. కానీ, మోదీ ప్రభుత్వ జాప్యపు మాయాజాలం తెలుసుకోలేని అమాయకులేమి కాదు ఈ దేశ ప్రజలు.

# విద్యారంగంలో రేవంత్ సరికొత్త ఆలోచనలు!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

'దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని మేం విశ్వసించాం. మెరుగైన విద్య వ్యవస్థ ఏర్పాటుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని కమిషన్‌ను ఆదేశించాం. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీ స్కూల్ విధానం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నాం. ప్రభుత్వ గురుకులాలు, హాస్టల్స్‌లో మెస్ చార్జీల సమస్యను పరిష్కరించాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా డైట్ చార్జీలను 40శాతం, కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో చదువుకునేలా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. తొలి దశలో రూ.11,600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టాం. రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకోసం 30 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో చెప్పారు. 'కేవలం ప్రజలకు విద్య అందించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించలేకపోవచ్చు. విద్య ఒక వ్యక్తి ఆదాయాన్ని పెంచకపోయినా, ఖచ్చితంగా అతన్ని వేరే మనిషిగా మలుస్తుంది. పేదరిక సమస్యను పరిష్కరించడంలో విద్య పోషించే పాత్రపై నేను సూక్ష్మంగా అధ్యయనం చేశా. ప్రజాస్వామ్యానికి విద్య కీలకం. ఇది ప్రజలకు సమాజంలోని వనరులను పూర్తిగా అందుబాటులోకి తెస్తుంది.వారిని వివిధ సామాజిక కార్యకలాపాల్లో పూర్తి భాగస్వాములను చేస్తుంది.' అని నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ ఒక సందర్భంలో చెప్పారు. ఇటీవల ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం రేవంత్ ఇచ్చిన ఆహ్వానం మేరకు అభిజిత్ బెనర్జీ 'తెలంగాణ రైజింగ్ విజన్' బోర్డులో చేరేందుకు అంగీకరించారు.

తెలంగాణ ప్రభుత్వ వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, గొప్ప మౌలిక సదుపాయాల నిర్మాణం, అన్ని వర్గాల సంక్షేమం అనే దార్శనికతను 'తెలంగాణ రైజింగ్'గా సిఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పట్టణాభివృద్ధి, ఆర్థికవృద్ధి, ప్రజా ఆదాయాలను పెంచడం, ఆర్థిక క్రమశిక్షణ, పెద్ద ఎత్తున నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో అనేక వినూత్న ఆలోచనలపై అభిజిత్ బెనర్జీ చర్చించారు. తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సలహాదారులతో పాటు చేరవలసిందిగా ముఖ్యమంత్రి నుంచి వచ్చిన ఆహ్వానాన్ని నోబెల్ గ్రహీత కూడా అంగీకరించారని అధికారిక ప్రకటన వెలువడింది. భారీ స్థాయిలో ఉద్యోగ సృష్టి గురించి చర్చిస్తూ సాంప్రదాయ హస్త కళాకారులు ఆధునిక వ్యవస్థాపకులుగా మారేందుకు గాను ఆధునిక డిజైన్లు, ఆకర్షణ,మార్కెటింగ్ అవసరమని ముఖ్యమంత్రికి అభిజిత్ సూచించారు.సోషల్ మీడియా టెక్నాలజీ వినియోగంతో సాంప్రదాయ నైపుణ్యాలలో ప్రత్యేకమైన స్వల్పకాలిక కోర్సులను సృష్టించాల్సిన అవసరం గురించి కూడా కొన్ని సలహాలు ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో చేతిపనులు, కళలు, సృజనాత్మకతను ముఖ్యమైన భాగంగా చేర్చాలని ఆయన ముఖ్యమంత్రికి సూచించారు. రంగంలో ప్రమాణాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నిర్వహించి 10 వేల మంది టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసింది. యువతలో నైపుణ్యం కొరవడి వెనుకబడిపోతున్నందున, నైపుణ్యాన్ని పెంచే లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ని ఏర్పాటు చేస్తోంది.మూస పద్ధతిలో సాగుతున్న ఐటీఐలను సంస్కరిస్తూ కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి పలుకుతూ వాటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఎటిసిలను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

భారతదేశంలో 'కనీస ఆదాయ హామీ పథకం' అవసరమని అభిజిత్ బెనర్జీ అభిప్రాయపడుతున్నారు.పేదరికం భయంకరమైన పరిణామాలను కలిగిస్తుందని నోబెల్ గ్రహీత ఒక సందర్భంలో వివరించారు. జాతీయవాదం భారతదేశం వంటి దేశంలో పేదరికం వంటి ముఖ్యమైన సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తుందన్నది ఆయన వాదన.ఉచితాలు పేదలను సోమరులుగా మార్చుతాయన్న సిద్ధాంతాన్ని నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ తోసిపుచ్చారు. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆవిష్కరించే వరకు ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన,ఇతర సామాజిక,ఆర్థిక, ప్రభావవంతమైన చర్యలను లాభాపేక్షలేని సంస్థలకు,ప్రైవేట్ రంగానికి వదిలివేశాయని అభిజిత్ అంటున్నారు.' పేద ప్రజలు బాగున్నప్పుడు, వారు మరింత సంపదను ఉత్పత్తి చేయడంలో, మెరుగైన జీవితాలను గడపడంలో మరింత సృజనాత్మకంగా మారతారు. వారి పిల్లలను తమ గ్రామాలకు దూరంగా ఉన్న మెరుగైన పాఠశాలలకు పంపడం ద్వారా కూడా ఇది సాధ్యమే' అని ఆయన సూత్రీకరించారు. క్రీడాకారులను తయారు చేయడం, ఒలింపిక్స్ క్రీడలు లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీలను రేవంత్ ప్రభుత్వం ప్రారంభించబోతున్నది. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించిన సంగతి తెలిసిందే.

'విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆ రంగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉన్నది. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యవస్థలో అవసరమైన ప్రక్షాళన చేయడం సాధ్యపడుతుంది. 2021 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో పేర్కొన్న గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని ప్రదర్శించలేని వారి సంఖ్య పెరుగుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య తగ్గుతోంది'' అని విద్యా రంగంపై గత మార్చిలో శాసనమండలిలో జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2026లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అందుబాటులోకి రానున్నాయి. బడ్జెట్‌లో 7 శాతంపైగా నిధులు విద్యాశాఖకు కేటాయించినా విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో గుర్తు చేస్తున్నారు.ప్రజాప్రభుత్వం విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు,అధికారులు ప్రభుత్వ గురుకులాలు,పాఠశాలలను వారంలో రెండు రోజులు సందర్శించాలని సిఎం సూచించినా ఆచరణలో పెట్టిన వారు చాలా తక్కువ.

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో కీలక ముందడుగు వేసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మించే లక్ష్యంతో తాజాగా 20 పాఠశాలలను మంజూరు చేసింది.ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ. 4,000 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసింది. పాఠశాలలు నిర్మించనున్న నియోజకవర్గాలు ఆలేరు, అశ్వరావుపేట, బాన్సువాడ, భద్రాచలం, భువనగిరి, దేవరకొండ, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్, పాలకుర్తి, పరిగి, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, శేరిలింగంపల్లి, వరంగల్ పశ్చిమ, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వర్ధన్నపేట.






గురుకుల పాఠశాలలతో పాటు తెలంగాణలో ప్రయోగాత్మకంగా రెండు మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో మండలానికి రెండు చొప్పున మొత్తం 100 టిపిఎస్‌లను నెలకొల్పాలని ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సు చేసింది.ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా మంచాల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరులను పైలట్ మండలాలుగా ఎంపిక చేశారు. సిఎంగా బాధ్యత లు స్వీకరించిన మరుక్షణం నుంచే విద్యావ్యవస్థ బలోపేతానికి రేవంత్‌రెడ్డి నడుం బిగించారు.వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు వీలుగా రూ.667.25 కోట్లను కేటాయించారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో నాలుగుసార్లు మాత్రమే టెట్ నిర్వహించి, ఒకే ఒక్క డిఎస్ సి, అదీ కేవలం 8వేల పోస్టులతో సరిపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదిలోపే 11,062 ఉపాధ్యాయుల నియామకం పూర్తి చే సింది. ఎక్కువ మంది డిఎస్‌సికి హాజరయ్యేందుకు వీలుగా టెట్‌ను ముందుగానే నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పా ఠశాలల్లో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిన ఫలితంగా ఇప్పుడు రాష్ట్రంలో 99 శాతం పాఠశాల ల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు, నాణ్యమైన బోధన ఆశించుదాం!.

# అభివృద్ధికి ఇదో ఆదర్శ గ్రామం



పులి రాజు
9908383567

'గ్రామాలే దేశాని =కి పట్టు గొమ్మలు' అని మహాత్మాగాంధీ అన్నారు. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండ టం మౌలిక వసతులు కల్పన ద్వారా గ్రామాల త్వ రగా అభివృద్ధి సాధిస్తాయి. ఈ గ్రామానికి మూడు వైపుల నుండి రెండు లైన్ల రోడ్లు రోడ్లకు ఇరువైపులా చెట్లతో గ్రామంలోకి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉం టుంది. గత 8 సంవత్సరాలుగా నా పరిశోధనలో ఈ గ్రామం అన్ని రంగాలలో స్వయం సమృద్ధి సాధించి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఆ గ్రామం మత సామరస్యాలకు పుట్టినిల్లు. ఆ ఊరు పేరు తునికి ఖల్సా, మండలం వర్గల్, జిల్లా సిద్దిపేట. 1950 మే 21 వరకు ఈ గ్రామాన్ని తునికి అనే పేరుతో పిలిచేవారు.ఈ గ్రామ జనాభా సుమారు 5000, ఓటర్ల సంఖ్య సరిగ్గా 2400. ఇక్కడ కుటుంబాల సంఖ్య: 930





సామాజిక వర్గాల వారిగా కుటుంబాలు. ఎస్‌టి: 05, ఎస్‌సి: 230, బిసి : 630, ఒసి: 65 (ముస్లిం మైనార్టీ: 40) ఈ గ్రామ రెవెన్యూ రికార్డు ప్రకారం భూమి విస్తీర్ణం 4,192 ఎకరాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3300 ఎకరాల భూమి ఉంది. ఒక కుమ్మరి సామాజిక వర్గం తప్ప అన్ని కులాల వారు, అన్ని మతాలవారు ఉన్నారు. ఇది స్థూలంగా ఆ గ్రామ స్వరూపం.

ఈ ప్రాంతంలో తునికి ఆకు (బీడీలు చేసే ఆకు) ఎక్కువగా లభించడంతో తునికి అనే పేరు వచ్చినట్లు చెబుతారు. ఖల్సా అనగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కలిగి ఉన్న భూములని అర్థం. ఈ గ్రామంలో ఇప్పటికి దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. (ఖల్సా అంటే స్వచ్ఛమైనది.) 1950 మే 22 నుండి ఈ గ్రామాన్ని తునికి ఖల్సాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ గ్రామం చుట్టుపక్కల తునికి పేరుతో తునికిమక్త, తునికి బొల్లారం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామం నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుకు 20 కిలోమీటర్ల దూరంలో రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అన్ని రకాల రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఇక్కడి వ్యవసాయ భూములు స్థానికులకు 1113 ఎకరాలు, స్థానికేతరులకు 1203 ఎకరాలు ఉన్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534. భూమిలేని కుటుంబాల సంఖ్య 396. సామాజిక వర్గాలుగా వారీగా భూమి ఉన్న కుటుంబాల వివరాలు ఎస్‌టి : నిల్, ఎస్‌సి: 135, బిసి: 363, ఒసి:36, మైనార్టీ: 25 ఇక్కడి ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడికి వంటి మామిడి కూరగాయలు మార్కెట్ దగ్గర ఉండడంతో ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తారు. ఇక్కడి ప్రధాన పంటలు కూరగాయలు, ఆకుకూరలు, వరి ఆలుగడ్డ ఎక్కువగా పండిస్తారు. ప్రధాన సాగునీటి వసతి బోర్లు , చెరువు కుంటలు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ఎక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. కూరగాయలు పండించడంతో ఇక్కడ రైతు, రైతు కూలీలకు నిత్యం పని దొరుకుతుంది. రైతులకు, రైతు కూలీలకు చేతిలో ఎప్పుడూ డబ్బులు ఉంటాయి. సుమారు 32 జతల ఎడ్లు, 46 ట్రాక్టర్లు, 19 ట్రాలీ ఆటోలు, 5 ప్యాసింజర్ ఆటోలు, 21 కార్లు, దాదాపు ప్రతి ఇంటికి ఒక సైకిల్ మోటార్ ఉన్నాయి. చాలామందికి పాలిచ్చే బర్రెలు ఉన్నాయి. ఇంత పెద్ద గ్రామంలో ఒక హోటల్, ఒక స్వీట్ షాప్, ఐదు బెల్ట్ షాపులు మాత్రమే ఉన్నాయి. యువత కూడా వ్యవసాయ పనులు, రకరకాల కంపెనీలలో ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం మూలంగా ఇక్కడ ఆరోగ్యకరమైన మంచి వాతావరణం ఉంది. ఇక్కడి యువత చెడు అలవాట్లకు చాలా దూరంగా ఉన్నారు. తక్కువ మంది ప్రభుత్వం ఉద్యోగులు ఉన్నారు. రెండు కుటుంబాలు మినహా దాదాపు అన్ని కుటుంబాలు వారి వారి స్తోమతకు తగ్గట్టుగా అవసరాలు తీర్చుకునే స్థితిలో ఉన్నారు. ఇక్కడ పంచాయితీలు చాలా తక్కువ, చిన్న,చిన్న పంచాయతీలు కూడా గ్రామ పరిధిలో పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్ వరకు ఈ గ్రామస్తులు పోరు అంటే అతిశయోక్తి కాదు. రాజకీయాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల వరకే, ఎన్నికల తెల్లారి చాలా ఆత్మీయంగా కలిసి ఉంటారు.

ఈ గ్రామం వర్గల్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామ పంచాయతీలో 12 వార్డులు ఉన్నాయి. గ్రామ పంచాయతీలో తొమ్మిది మంది సిబ్బంది ఒక ట్రాక్టర్ పనిచేస్తారు. గ్రామం ఎప్పుడు పరిశుభ్రంగా ఉంటుంది. ఐదు వాటర్ ట్యాంకులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ, వంట గ్యాస్ కనెక్షన్ ఉంది. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. ఇక్కడ ఎక్కువగా ఆర్‌సిసి ఇండ్లు ఉన్నాయి. ఈ ఊరు మాంసం విక్రయాలకు పేరుగాంచింది. గ్రామంలోని ప్రతి వీధికి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. సుమారు 80 శాతం అక్షరాస్యత సాధించింది. పార్కులో తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు, జాతీయ జెండా ఉంది. గ్రామంలో చాలామంది జాతీయ నాయకుల విగ్రహాలు ఉన్నాయి.

ఈ గ్రామంలో నూతన పంచాయతీ భవనం, జాతీయ బ్యాంకు, కరెంటు సబ్ స్టేషన్, స్మశాన వాటిక, హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి కేంద్రం, ప్రైవేట్ పాఠశాల,రైతు వేదిక, గ్రామ దేవతలు, అన్ని కులాలకు చెందిన పెద్ద పెద్ద దేవుడి గుళ్ళు, మసీదు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదో ఒక కులంవారు వారి వారి కులదేవతలకు పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు. ఊరు నిండా సిమెంట్ రోడ్లు. గత ప్రభుత్వంలో 98 డబుల్ బెడ్ రూమ్ లు కట్టి అర్హులకు అందజేశారు. ఒక ప్రభుత్వ నర్సరీ రెండు ప్రైవేట్ నర్సరీలు, ఇంటర్నేషనల్ సీడ్ కంపెనీ ఈ కంపెనీలో గ్రామస్తులు సుమారు 100 మంది పనిచేస్తారు. ఒక స్పిన్నింగ్ మిల్, రైస్ మిల్ ఉన్నాయి. సోలార్ పవర్ ప్లాంట్ ఉంది. స్థానికేతరుల భూములలో మామిడి తోటలు, ఫామ్ హౌస్‌లు ఉన్నాయి.ఇక్కడ 15 చెరువు,కుంటలు ఉన్నాయి. ఇక్కడి తపాల్ ఖాన్ చెరువు కిందనే హల్దీ వాగు పుట్టి 90కిలోమీటర్ల ప్రవహించి మంజీరా నదిలో కలుస్తుంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాలు రైతు బంధు/ రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ , ఆసరా/చేయూత పెన్షన్లు లాంటి పథకాలతో పాటు వృద్ధాప్య పెన్షన్లు 179, వితంతు పెన్షన్లు 184, వికలాంగుల పెన్షన్లు 36, బీడీ వర్కర్స్ పెన్షన్ 18, ఒంటరి మహిళల పెన్షన్లు 9 మొత్తం 426 మందికి పెన్షన్ వస్తుంది. అటు వ్యవసాయము ఇటు కంపెనీలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల మూలంగా ప్రజల చేతిలో డబ్బులు ఆడుతున్నాయి. ఇక్కడ రెండు కుటుంబాలు మాత్రమే పేదరికంలో ఉన్నాయి. గత 8 సంవత్సరాలుగా నా పరిశోధనలో ఈ గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురికాకుండా ఉంది. గత పది సంవత్సరాలుగా ఒక రైతు, ఇద్దరు రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గ్రామంలో ప్రస్తుతం ఒక ఎకరా భూమి ధర ఒక కోటి పైన పలుకుతుంది. పనిలో, సమిష్టి నిర్ణయాలలో, గ్రామాభివృద్ధిలో ఈ గ్రామం మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

# బడిబాటకు వేళాయె...

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ బడులలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, ఉన్నతోన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు ఉన్నారని ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులను సర్కార్ బడులలో చేర్పించడానికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ బడులలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతుందని, కంప్యూటర్‌లు, ఐపిబి ద్వారా డిజిటల్ సాంకేతిక పద్ధతులలో ఉత్తమమైన విద్యను బోధిస్తున్నట్లు అటు తల్లి దండ్రులకు, ఇటు విద్యార్థులకు తెలియజేస్తూ 2025–26 విద్యా సంవత్సరంలో సర్కార్ బడులలో ఎన్‌రోల్మెంట్ పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సర్కార్ బడులకు, ప్రైవేటు బడులకు వ్యత్యాసం తెలియజేస్తూ బ్యానర్లు, కరపత్రికలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వినూత్న పద్ధతిలో విద్యార్థులను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సర్కార్ బడులలో ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు ఇస్తున్నారని, ఉచితంగా ఫీజు లేకుండా నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని, ఉచితంగా యూనిఫాం ఇస్తున్నామని,ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయ సదుపాయం, సైన్స్ ల్యాబ్, సోషల్ తెలంగాణ రాష్ట్ర, భారత దేశ, ప్రపంచ పటాలు ఉన్నాయని, విద్యార్థులకు చదువుతో పాటు ఆటలలో పాటలలో తీర్చిదిద్దడానికి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌లు ఉన్నారని ప్రచారం చేస్తున్నారు.

### ముందుగానే చేరిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు 2025–26 సంవత్సరానికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు వేసవి సెలవుల్లో ప్రభుత్వ బడులకు చేరిపోయాయి. పాఠశాలలు వేసవి సెలవులు ముగిసి పునః ప్రారంభం జూన్ 12వ తేదీన అందరూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.



### వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో పనిచేస్తున్న ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు, ప్రధాన ఉపాధ్యాయులకు, ఎంఇఒలకు, డిఇఒలకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది.( ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందించడానికి, ఎన్‌రోల్మెంట్ పెంచడానికి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి డిజిటల్, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలకు అనుగుణంగా ప్రభుత్వ బడులలో ఆనందదాయకంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి ఉపాధ్యాయులు ఏ విధంగా తోడ్పాటు అందించాలనే విషయాలను శిక్షణ కార్యక్రమాల్లో బోధించడం జరిగింది.

### ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శాఖలకు మంత్రులను కేటాయించి విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. విద్యాశాఖకు విద్యా శాఖ కమిషన్ ఏర్పాటు చేసి విద్యా శాఖ కమిషన్ చైర్మన్‌ను, సభ్యులను ఏర్పాటు చేసి విద్యా రంగ సమస్యలపై రిపోర్ట్ తయారు చేయించి అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు.

### ప్రభుత్వ బడులకు కొత్త రూపు

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట తీర్చిదిద్దారు. పురాతన భవనాలలో నడిచే ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలకు మరమ్మతులు చేయడం, నూతన భవనాలను ఏర్పాటు చేయడం, తరగతి గదులను అదనంగా ఏర్పాటు చేయడం, కరెంట్,నీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల భవనాలకు పెయింటింగ్ వేయడం లాంటివి చేసి కొత్త రూపు వచ్చేటట్లు తీర్చి దిద్దారు.

### 2025–26 విద్యా సంవత్సరం నుంచే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లు

గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కులాల పరంగా,మతాల పరంగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. రేవంత్ సర్కార్ కులాల పరంగా, మతాల పరంగా కాకుండా అందరూ విద్యార్థులు ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి 202526 విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తుంది. గతంలో రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తూ ఇంటి యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటరో అంటూ బిక్కు బిక్కు మంటూ చదువుకునే వారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వంత భవనాలను ఏర్పాటు చేస్తున్నది.

### కామన్ విద్యా విధానం ఉండాలి


తెలంగాణ రాష్ట్రంలో కామన్ విద్యా విధానం ఉండాలని అనేక మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు కోరుతున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మోడల్ స్కూల్‌లు, ఎయిడెడ్ స్కూల్ లు, స్పోర్ట్స్ స్కూల్‌లు, రెసిడెన్షియల్ స్కూల్‌లు, నవోదయ స్కూల్‌లు, పబ్లిక్ స్కూల్‌లు, మైనారిటీ స్కూల్‌లు, క్రిష్టియన్ మైనారిటీస్ స్కూల్‌లు అంటూ వేరు వేరుగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ అధికారులు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు కలిపి కామన్ స్కూల్ విధానంను అమలు చేస్తే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### సర్కార్ బడులలో వేసవి శిక్షణ శిబిరాలు

విద్యార్థులకు వేసవి సెలవుల్లో సమయం వృధా కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించింది.ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్, ఆటలు, పాటలలో ప్రత్యేకంగా శిక్షణను ఏర్పాటు చేసి విద్యార్థులను అనేక రంగాల్లో తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6వ తేదీ నుంచి 19 వరకు బడిబాట పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం, బదిలీలు చేయడం, ఉపాధ్యాయులు లేని చోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి జిల్లా కలెక్టర్‌లకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అధికారాలు ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలలో చదివే విద్యార్థులకు తప్పని సరిగా తెలుగును అభ్యసించాలనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.విద్యా సంవత్సరం పునః ప్రారంభం కంటే ముందే అన్ని ఏర్పాట్లు చేయడం వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు సర్కార్ బడులలో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం ఏర్పడుతుంది.

డాక్టర్॥ ఎస్.విజయ భాస్కర్,
9290826988

నేటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట సందర్భంగా...



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## డేంజర్ బెల్స్..

### 564 మందికి పాజిటివ్.. 5 నెలల చిన్నారి సహా ఏడుగురు మృతి

**న్యూఢిల్లీ :**కొన్ని రోజులుగా భారత్‌లో కరోనా వైరస్ విజృంభిస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా గత 24 గంటల్లో 500కిపైగా కేసులు వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ ఏడాది కరోనాబారిన పడిన వారి సంఖ్య5 వేలకు చేరువైంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం8గంటల వరకూ కొత్తగా 564 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాజా కేసులతో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా బారిన పడిన వారి సంఖ్య 4,866కి పెరిగింది. అత్యధికంగా కేరళలో 1,487 కేసులు వెలుగు చూడగా.. ఢిల్లీలో 562, పశ్చిమబెంగాల్‌లో 538, మహారాష్ట్రలో 526, గుజరాత్‌లో 508, కర్ణాటకలో 436, తమిళనాడులో 213 కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో ఏడు మరణాలు సంభవించాయి. ఢిల్లీలో 5 నెలల చిన్నారిసహా ఇద్దరు మరణించారు. కర్ణాటకలో ఇద్దరు, మహారాష్ట్రలో ముగ్గురు కొవిడ్ ప్రాణాలు కోల్పోయారు.ఈ ఏడాది ఇప్పటివరకూ కరోనా కారణంగా మరణించినవారి సంఖ్య 51కి పెరిగింది.



భగవాన్ మహావీర్ వనస్థలిపార్క్‌లో మొక్క నాటిన ప్రధాని

పర్యావరణ సవాళ్లు ఎదుర్కొనేందుకు

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

## 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన మోదీ

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇక్కడి భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో ఒక మొక్కను నాటారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (ఒక చెట్టు అమ్మతో సమానం) ప్రచార కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతం చేశారు. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు 700 కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల్లో 'తిరిగి అడవులను' పెంచడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్'పోస్ట్‌లో మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీలను కవర్‌చేసే ఈ గ్రహం మీద అత్యంత పురాతనమై న పర్వత శ్రేణి ఆరావళి అన్నారు. గత కొన్ని సంవత్సరాలు గా ఈ శ్రేణికి సంబంధించిన అనేక పర్యావరణ సవాళ్లు తెరపైకి వచ్చాయని, వాటిని ఎదుర్కొనేందుకు తన ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఈ శ్రేణితో అనుసంధానించబడిన ప్రాం తాలను పునరుజ్జీవింపజేయడంపై మేం దృష్టి పెట్టాం. దీనికోసం స్థాన పరిపాలనా యంత్రాంగాలతో కలిసి పనిచేస్తాం. నీటిపారుదల వ్యవస్థలను మెరుపరుస్తాం.దుమ్ము తుపానులను అరికడతాం. థార్ ఎడారి తూర్పువైపు విస్తరణలను నిలువరించడమే కాకుండా మరికొన్నింటిపై దృష్టి పెడతాం' అని ఆయనవెల్లడించారు.'ఆరావళి శ్రేణి, అవతలపక్క అదనంగా సాంప్రదాయంగా నాటే పద్ధతులను అనుసరిస్తూనే మేం నూతన పద్ధతులను ప్రోత్సహిస్తాం. ప్రత్యేకించి అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాలలో ఎక్కడైతే స్థల పరిమితులుంటాయో మేరీ లైఫ్ పోర్టల్‌పై పర్యవేక్షించేలా ప్లాంటేషన్ కార్యకలాపాలకు జియోట్యాగ్‌ను అనుసంధానిస్తాం' అని ప్రధాని మోదీ తెలిపారు.ఇది ఢిల్లీ ప్రజల జీవన సౌలభ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందన్నారు. ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ అనేది 29జిల్లాలు, మూడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం చుట్టూ 5కి.మీ బఫర్ ఏరియాలో పచ్చదనాన్ని వ్యాపింపజేయడానికి ప్రధానంగా చొరవ చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం చెప్పింది. 2.5నుంచి 3బిలియన్ల అదనపు కార్బన్ సింక్‌ను సృష్టించాలన్న భారత దేశ వాతావరణ లక్ష్యాన్ని సాధించడానికి, కార్బన్‌డయాక్సైడ్‌కు సమానమైన స్థాయిలో 2030 నాటికి 26మిలియన్ హెక్టార్ల భూమిని పునరుద్ధరించడానికి దోహదపడుతుందని తెలిపింది. ఈ ప్రాజెక్ట్ అడవుల పెంపకం, రీఫారెస్టింగ్, నీటి పునరుద్ధరణద్వారా ఆరావళి శ్రేణి జీవవైవిధ్యాన్ని పెంచుతుంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో నేల సంతానోత్పత్తిని, నీటి లభ్యతను మెరుగుపర్చడంలో సహాయపడుతుందని ప్రభు త్వం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ స్థానిక సమాజాలకు ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పించడానికి ఉపకరిస్తుందనిప్రభుత్వం తెలియజేసింది.ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆరావళి శ్రేణిలో భాగంగా ఉన్న 29 జిల్లాలలో దాదాపు 1,000 నర్సరీలను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు చెప్పారు. మొత్తం క్షీణించిన ప్రాంతం రాజస్థాన్‌లో 81శాతం, గుజరాత్‌లో 15.8శాతం, హర్యానాలో1.7శాతం,ఢిల్లీలో 1.6శాతం ఉన్నది.

# ఫ్రీ టికెట్లు... గేట్ల మూసివేత!



## తొక్కిసలాటకు ఇవే కారణాలు

**బెంగళూరు:**సుదీర్ఘనిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పు సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవం కొన్ని గంటలకే ఆవిరైంది. తమ ఆరాధ్య క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటెత్తడంతో జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన వెనక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఉచిత పాస్‌లంటూ వదంతులు... స్టేడియం వద్ద గేట్ల మూసివేతతో నెలకొన్న గందరగోళం... అధిక రద్దీతో తోపులాటతో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35 వేల మంది మాత్రమే. కానీ, బుధవారం సాయంత్రం అక్కడికి దాదాపు మూడు లక్షల మంది అభిమానులు చేరుకున్నారు. ఈ స్టేడియంలో మొత్తం 21 స్టాండ్‌లు, 13 గేట్లు ఉన్నాయి. ఇందులో 9, 10వ నంబరు గేట్లను రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు రిజర్వ్ చేశారు. 5, 6, 7 గేట్ల నుంచి అభిమానులకు ప్రవేశం కల్పించారు. ఇందులో 7వ నంబర్ గేట్ నుంచి చూస్తే చిన్నస్వామి స్టేడియం ప్రధాన ప్రవేశం నుంచి లోపలికి వచ్చే వ్యూ కనిపిస్తుంది.మెయిన్‌ఎంట్రెన్స్‌నుంచేఆర్సీబీ జట్టు మైదానంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల ఏడో నంబరు గేట్ వద్దకు అభిమానులు పోటెత్తారు. పాస్‌లు ఉన్నవారు మాత్రమే స్టేడియం లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంది. కానీ, చాలామంది పాస్‌లు లేకుండానే అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో ఏడో నంబరు గేట్ వద్ద ఉచిత టికెట్లు పంచుతున్నారన్న ప్రచారం మొదలైంది. వాటిని తీసుకునేందుకు అభిమానులు పరుగులు తీశారు. టికెట్ల కోసం ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ గేట్ వద్దే అత్యధిక నష్టం సంభవించింది. స్టేడియం వద్ద రద్దీని నియంత్రించేందుకు 5 వేల మంది పోలీసులను మోహరించారు. కానీ, అంచనాలకు మించి అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం కష్టతరమైంది. గేట్లు కూడా చిన్నవిగా ఉండటంతో వారు లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. 'స్టేడియం గేట్లు చిన్నగా ఉన్నాయి. అభిమానులు కిక్కిరిసిపోవడంతో కొన్ని చోట్ల గేట్లు విరిగిపోయాయి. రద్దీ ఎక్కువగా ఉండటం వల్లే ఈ ఘటన సంభవించిందని అనుకుంటున్నాం' అని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. పాస్‌లు ఉన్నప్పటికీ తమను లోపలికి రానియ్యకుండా గేట్లు మూసివేశారంటూ కొంతమంది అభిమానులు ఆరోపించారు.మరోవైపు, బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు పరేడ్ ఉంటుందని ఆర్సీబీ జట్టు ముందే ప్రకటించింది. అయితే, అభిమానుల రాకను ముందే అంచనా వేసిన పోలీసులు ర్యాలీకి అనుమతినివ్వలేదు. ఆర్సీబీ జట్టు పరేడ్ ఉండదని, కేవలం స్టేడియంలో సన్మాన కార్యక్రమానికి మాత్రమే అనుమతి ఉందనిబెంగళూరుట్రాఫిక్‌పోలీసులు ఉదయం 11.56 గంటలకు ప్రకటించారు. మధ్యాహ్నం ఆర్సీబీ మేనేజ్‌మెంట్ మరో ప్రకటన చేసింది. పరేడ్ నిర్వహిస్తామని, అభిమానులు మార్గదర్శకాలు పాటించాలని కోరింది. అభిమానుల్లో గందరగోళం నెలకొంది. పరేడ్ ఉంటుందో లేదో తెలియక ఎక్కువ మంది నేరుగా మైదానం లోపలికి వెళ్లేందుకే ఉత్సాహం చూపించారు. కొంతమంది టికెట్లు లేకుండానే గేట్లు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకుని పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

# దేశం...పార్టీ రెండూ సమానమే : సల్మాన్ ఖుర్షీద్



**న్యూఢిల్లీ:** అటు దేశం పట్ల, ఇటు పార్టీ పట్ల తనకు సమాన భక్తిభావం ఉందని కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ గురువారం అన్నారు. విదేశాలలో దౌత్య కార్యక్రమంలో కేంద్రానికి అనుకూలంగా చేసిన వ్యాఖ్యలపై తన సహచరులతో సహా మరి కొంతమంది విమర్శించిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశభక్తి అంటే ఏమిటో అర్థం కాని వారికి నేను ఒక సందేశం పంపాలనుకుంటున్నాను. 'నాకు దేశం... పార్టీ పట్ల భక్తి ఒకటే' అని ఐదు దేశాల బహుళ పార్టీల ప్రతినిధి బందం పర్యటన నుంచి తిరిగి వచ్చిన మాజీ విదేశాంగ మంత్రి గురువారం ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే నిర్ణయంపై బీజేపీ నేతత్వంలోని కేంద్రాన్ని ప్రశంసించిన కొన్ని రోజుల తర్వాత ఆయన వ్యాఖ్యలు వచ్చాయి. 'భారత రాజకీయాల అంశంవిదేశాలలో మా చర్చల్లో రాలేదు. మేమందరం ఒకే గొంతుకగా మాట్లాడాము. పర్యటన అంతటా నేను పార్టీ అధిష్ఠానంతో నిరంతరం సంప్రదించాను' అని అన్నారు. 'దేశీయ కథనాలు మా లక్ష్యాన్ని ప్రభావితం చేయనివ్వలేదు. మేము భారతదేశ ప్రతినిధులుగా అక్కడ ఉన్నాము' అని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ గురించి మిత్రదేశాలకు వివరించడానికి తమ దౌత్య కార్యక్రమాల సమయంలో 'బీజేపీ సూపర్ ప్రతినిధిలా' వ్యవహరించారంటూ ఉదిత్ రాజ్ సహా పార్టీ నాయకుల నుంచి ఖుర్షీద్, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ విమర్శలు ఎదుర్కొన్నారు. స్వదేశంలో ప్రజలు రాజకీయ విధేయతలను లెక్కించడం 'బాధాకరం' అని ఖుర్షీద్ అన్నారు. 'దేశభక్తి కలిగి ఉండటం అంత కష్టమా' అని ప్రశ్నించారు. జనతాదళ్ (యునైటెడ్) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతత్వంలోని ప్రతినిధి బృందంలో ఖుర్షీద్ ఉన్నారు. ఇండోనేషియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్, మలేషియాను. సందర్శించారు. ప్రపంచ పర్యటన ఉద్దేశం, లక్ష్యం గణనీయంగా సాధించడం జరిగిందని ఖుర్షీద్ అన్నారు. 'మా మూడు రోజుల మలేషియా పర్యటన తర్వాత పాకిస్థాన్ నిరాశపరిచిన పత్రికా ప్రకటనను విడుదల చేసింది' అని ఆయన తెలిపారు. 'ఇస్లామిక్ సహకార సంస్థ (ఐవోసీ) లో బలమైన సభ్యత్వం ఉన్నందున మలేషియా కొన్ని ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ మలేషియా ప్రధాన మంత్రి నుంచి మాకు దఢమైన మద్దతు లేఖ అందింది. భారతదేశానికి మద్దతు ఇవ్వడంలో ఎటువంటి సంకోచం కనిపించలేదు' అని ఆయన అన్నారు. ఏ దేశం నుంచి అయినా దఢమైన నిబద్ధతలను ఆశించలేమని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. 'కానీ ప్రతిస్పందన గురించి మీకు సాధారణ అవగాహన లభిస్తుంది. మాకు లభించిన మద్దతు అత్యద్భుతంగా ఉంది. ముందుకు సాగుతున్నప్పుడు ఐవోసీ భావోద్వేగంలో మార్పు వస్తుందని నేను నమ్ముతున్నాను' అని ఆయన అన్నారు. భారత దేశం ఎటువంటి అణు ఘర్షణను కోరుకోవడం లేదని తెలిపారు.

## కోర్టు లాకప్‌లో దారుణం..

### ఖైదీని చంపిన మరో ఖైదీ..

**న్యూఢిల్లీ :**పగలు, ప్రతీకారాల కారణంగా చరిత్రలో మారణహోమాలు ఎన్నో జరిగాయి. 21వ శాతాబ్ధంలోనూ పగలు ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. కొంతమంది కఠిన శిక్షలకు కూడా ఏ మాత్రం భయపడ్డం లేదు. తాజాగా, ఓ ఖైదీ మరో ఖైదీ ప్రాణాలు తీశాడు. అది కూడా కోర్టు లాకప్‌లో ప్రత్యర్థి పీక కాలితో తొక్కి మరీ చంపేశాడు. ఈ సంఘటన ఢిల్లీలో గురువారం చోటుచేసుకుంది. ఈ దారుణ సంఘటనకు సంబంధించి ఢిల్లీ పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన జితేందర్, అమన్‌లకు మధ్య గత కొన్నేళ్ల నుంచి వివాదాలు నడుస్తున్నాయి. 2024లో జితేందర్, అతడి సోదరుడిపై అమన్ దాడి చేశాడు. ఇద్దర్నీ కత్తితో పొడిచాడు. ఆ ఇద్దరూ ఆ కత్తి దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ఇక, అప్పటినుంచి జితేందర్.. అమన్‌పై పగ పెంచుకున్నాడు. అమన్‌పై పగ సాధించడానికి ప్లాన్లు వేస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం జితేందర్, అమన్‌లు ఓ కేసులో జైలు పాలయ్యారు. గురువారం ఢిల్లీ పోలీసులు కొంతమంది అండర్‌ట్రయిల్ ఖైదీలను సాకేత్ కోర్టుకు తీసుకువచ్చారు. వారిలో జితేందర్, అమన్‌లు కూడా ఉన్నారు. ఆ ఖైదీలందరినీ సాకేత్ కోర్టు లాకప్‌లో ఉంచారు. సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్న జితేందర్ కోర్టు లాకప్‌లో అమన్‌పై దాడికి దిగాడు. జితేందర్‌కు జైదేవ్ అనే మరో వ్యక్తి కూడా సాయం చేశాడు. జితేందర్, జైదేవ్‌లు కలిసి అమన్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. ఆ తర్వాత జితేందర్ తన కాలితో అమన్ పీక నొక్కి చంపేశాడు. అమన్ హత్యతో కోర్టులో ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

## ఉగ్ర పాక్‌కు ఆ బాధ్యతలా?

### భారత్‌కు మద్దతు ఇవ్వండి: ఖర్గే



**న్యూఢిల్లీ:** పాక్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సామాజిక మా ధ్యమం ఎక్స్‌లో ఆయన ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఇటీవల కాలంలో పాక్‌కు బెయిల్ ఔట్ ప్యాకేజీలు, రుణాలు లభించిన సొమ్ము సైన్యం, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై వెచ్చిస్తుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పోషించే పాక్‌ను... ఉగ్ర బాధిత దేశమైన భారత్‌తో పోల్చడం సరికాదన్నారు. పాకిస్థాన్‌ను ఐరాస భద్రతా మండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా చేయడం, తాలిబన్ శాంక్షన్ కమిటీకి 2025కు గాను అధ్యక్షత అప్పగించడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఇది పూర్తిగా దురదష్టం, అవగాహన రాహిత్యం, ఏమాత్రం ఆమోద యోగ్యం కానిదన్నారు. ఉగ్ర ఫైనాన్స్‌పై నిఘా కోసం పాకిస్థాన్‌ను ఆర్థిక కార్యదళం గ్రేలిస్ట్‌లో తిరిగి చేర్చాలన్న భారత్ డిమాండ్‌లోని సహేతుకతను గమనించాలన్నారు. ఇది కేవలం భారత్ కోసం కాదని, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాల కోసం అవసరమన్నారు. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే హతమయ్యాడన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేడా కూడా కౌంటర్ టెర్రరిజం కమిటీకి పాకిస్థాన్ నాయకత్వం వహించడాన్ని వ్యతిరేకించారు. 'జూన్ 4వ తేదీన తాలిబన్ ఆంక్షల కమిటీకి పాకిస్థాన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైంది. ఇది మన విదేశాంగ విధానం విషాద గాథ. ప్రపంచ దేశాలైనా ఎలా అనుమతించాయి' అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

కోటా పెంపుపై, కొత్త చట్టాలపై

# ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేయాలి

### ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ డిమాండ్



**న్యూఢిల్లీ :** సమాజంలోని బలహీన వర్గాలకు రిజర్వేషన్‌ను 85 శాతానికి పెంచడానికి కొత్త చట్టాలు తీసుకు వచ్చేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఆయన గురువారం బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న యాదవ్ సోషల్ మీడియాలో ఒక లేఖను పంచుకున్నారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ఉద్దేశపూర్వకంగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లను 75 శాతానికి పెంచినప్పుడు తేజస్వీ యాదవ్ డిప్యూటీ సిఎంగా ఉన్నారు. కొత్త చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి వెంటనే కేంద్రానికి పంపాలని ఆర్‌జెడి నాయకుడు సూచించారు. 2023లో ఆమోదించబడిన చట్టాలను పాట్నా హైకోర్టు పక్కన పెట్టిందని, కోటాల పెంపు అవసరాన్ని ఎత్తి చూపే 'శాస్త్రీయ అధ్యయనం' అనుసరించలేదని అభిప్రాయపడ్డారని ఆయన గుర్తు చేశారు. కులాల వారీగా నిర్వహించిన ప్రతిష్టాత్మక సర్వే ఆధారంగా కోటాల పెంపుదల జరిగింది. 1931 జనాభా లెక్కలతో పోలిస్తే దళితులు, వెనుకబడిన తరగతుల జనాభా శాతంలో పెరుగుదల ఈ సర్వేలో కనిపించింది. వివిధ సామాజిక వర్గాల గణన చివరిసారిగా జరిగినప్పుడు ఇది జరిగింది. తమిళనాడులో 69 శాతం కోటాలు అమలులో ఉన్నాయని యాదవ్ ఉదహరించారు. బిహార్ కూడా రిజర్వేషన్ చట్టాలను తొమ్మిదవ షెడ్యూల్‌లో ఉంచడం ద్వారా న్యాయపరమైన జోక్యం నుండి రక్షించుకోవచ్చని అన్నారు. కొత్త చట్టాల రూపకల్పన కోసం 'అఖిల పక్ష కమిటీ'ని ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత వీటిని ఆమోదించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్‌జెడి నాయకుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుని కేంద్రాన్ని పాలించే బిజెపి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆరోపించిన దృక్పథానికి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంనే నిందిస్తోందని కూడా ఆయన ఆరోపించారు.

## శర్మిష్ఠ పనోలీకి మధ్యంతర బెయిల్

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీ((22)కి మధ్యంతర బెయిల్ లభించింది. 'ఆపరేషన్ సిందూర్'పై సామాజిక మాధ్యమాల్లో తన భావాలు వెల్లడించే క్రమంలో ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆమెకు కలకత్తా హైకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో శర్మిష్ఠకు ఉపశమనం లభించినట్లయింది. మే 31న ఆమెను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. గత శనివారం న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా... ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. కోల్‌కతాలోని ఆనందపూర్ ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పూనె న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం ఆమెకు ఇన్‌స్టాలో 94 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలపై తనదైన శైలిలో వ్యాఖ్యలు జోడించి అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా శర్మిష్ఠ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరుగా పేరు సాధించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదాస్పదమై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తన పోస్టులు, రీల్స్ తొలగించి ఆమె క్షమాపణ కోరారు. శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్లు పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆమెను గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు.

## హెలికాప్టర్లలో 59 మంది పర్యాటకుల తరలింపు

**గ్యాంగ్‌క్:** భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉత్తర సిక్కిం నుంచి 59 మంది పర్యాటకులను గ్యాంగ్‌క్‌కు తీసుకువచ్చారు, వాతావరణం మెరుగుపడిన తర్వాత సహాయక చర్యలు తిరిగి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఉత్తర సిక్కింలోని లాచుంగ్‌లో దాదాపు వారం రోజులుగా చిక్కుకున్న 109 మంది పర్యాటకులలో వీరు ఉన్నారు. వాతావరణం మెరుగుపడిన తర్వాత తెల్లవారుజామున రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌క్ సమీపంలోని పాక్యాంగ్ విమానాశ్రయం నుంచి ఉత్తర సిక్కింలోని చాటెన్‌కు రెండు ఎం17వీ5 హెలికాప్టర్లు బయలుదేరాయి. 39 మంది పర్యాటకులు ఒక హెలికాప్టర్‌లో తిరిగి రాగా, 20 మంది మరొక హెలికాప్టర్‌లో వచ్చారని అధికారులు వివరించారు. వారిలో ఇద్దరు విదేశీయులు ఉన్నారని తెలిపారు. ఈ పర్యాటకులు పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి చేరుకోవడానికి సహాయం చేయడానికి సిక్కిం జాతీయ రవాణా (ఎస్ఎన్‌టీ) బస్సులు ఏర్పాటు చేసింది. సిలిగురికి సమీపంలోని బాగ్డోగ్రాకు విమానంలో ప్రయాణించాలనుకునే వారి కోసం పాక్యాంగ్ విమానాశ్రయంలో అదనపు హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచారు. రెండు హెలికాప్టర్లు ఎన్‌డీఆర్‌ఎఫ్, విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు అవసరమైన సేవలను పునరుద్ధరించడానికి ఈ ప్రాంతంలో పనిచేసే ఎయిర్‌టెల్ ఇంజనీర్లతో చాటెన్‌కు వెళ్లాయని వారు తెలిపారు. ఈ 109 మంది పర్యాటకులను వాయు మార్గంలో చాటెన్‌కు తీసుకువచ్చారని అన్నారు. పర్యాటకులను హోటళ్లలో, చాటెన్ సైనిక శిబిరంలో ఉంచినట్లు ఒక అధికారి తెలిపారు. ఉత్తర సిక్కింలో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం పాక్యోంగ్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ సేవలు నిలిపివేశారు. దీంతో తరలింపు ఆలస్యమయింది. ఆదివారం చాటెన్‌లోని సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు సైనిక సిబ్బంది మరణించగా, ఆరుగురు సైనికులు గల్లంతయ్యారు. మరికొందరు కూడా గాయపడ్డారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా గల్లంతయిన ఆరుగురు సిబ్బంది కోసం గాలింపు చర్యలకు ఆటంకం నెలకొందని అధికారి ఒకరు చెప్పారు. ముంషితాంగ్, చాటెన్ మధ్య ఉన్న తరణ్ చు నదిపై ఉన్న రెండు కీలక వంతెనలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొట్టుకుపోవడంతో లాచెన్ నుంచి చాటెన్‌కు వాహనాల రాకపోకలు తెగిపోవడంతో ఉత్తర సిక్కింలో కొనసాగుతున్న సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మూడు రోజుల క్రితం లాచుంగ్, చుంగ్‌తాంగ్ నుంచి 1,678 మంది పర్యాటకులను రక్షించగా, ఇద్దరు అమెరికన్ జాతీయులు సహా 33 మందిని బుధవారం విమానాల ద్వారా విజయవంతంగా తరలించారు.

# సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌పై నిషేధాజ్ఞలు



**భువనేశ్వర్:** బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న వేళ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌ను ఒడిశా, రాయగఢ్ జిల్లాలోకి అడుగు పెట్టనివ్వలేదు. ఆమె గురువారం ఉదయం అక్కడి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే, ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వులు అందాయి. ఈనెల 4వ తేదీ నుంచి రెండు నెలల పాటు పాట్కర్‌ను రాయగఢ్ జిల్లాలోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆ ఆదేశాలిచ్చారు. నర్మదా బచావో ఉద్యమకారిణితో పాటు మరో 20 మందికిపైగా కార్యకర్తలకు ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. ఈ కార్యకర్తలు జిల్లాకు వస్తే శాంతి భద్రతల సమస్యలు వస్తాయని, ప్రజాశాంతికి భంగం కలుగుతుందని, పరిపాలన వ్యవహారాలు సజావుగా సాగలేవని, అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని సహేతుకమైన ఆందోళనల దృష్ట్యా వారి ప్రవేశాన్ని నిషేధించినట్లు కలెక్టర్ పారుల్ పట్వారీ సంతకంతో ఉన్న ఉత్తర్వులు పేర్కొన్నాయి. కాగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మా మాటి మాలీ సురక్ష మంచ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు మేధా పాట్కర్ రాయగఢ్ చేరుకున్నారు. కానీ ఆమెను అడ్డుకోవడంతో అక్కడ నుంచి గంజాం జిల్లాలోని బెర్హంపూర్‌కు వెళతారని, అలాగే, శనివారం భువనేశ్వర్‌లో కార్యక్రమంలో పాల్గొంటారని పాట్కర్ సహచరుడు నరేంద్ర మహంతీ వెల్లడించారు. తాజా పరిణామంపై మేధా పాట్కర్ విలేకరులతో మాట్లాడుతూ 'నేను రావడంతో ప్రజలకు సమస్యలు వస్తాయనేందుకు నేనేమీ ఉగ్రవాదిని కాను. దేశ పౌరురాలిని. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. సుస్థిర ప్రగతినే డిమాండ్ చేస్తాం' అని అన్నారు. కాగా, మా మాటి మాలీ సురక్ష మంచ్ అధ్వర్యంలో రాయగఢ్, కోరాపుట్ జిల్లాల్లో బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలకు కేంద్రబిందువు రాయగఢ్ జిల్లాలోని కాశీపూర్‌లో 240 మంది పోలీసులను మోహరించినట్టు అధికారులు తెలిపారు.

# 'మేడమ్ ఎన్' ట్రాప్‌లో భారత ఇన్‌ఫ్లూయెన్సర్లు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ కింద పనిచేసే ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి పదవీ విరమణ చేశారు.షెహజాదకు ఐఎస్ఐతో బలమైన సంబంధా లున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'. హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్‌తో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతోఉన్నబలమైన సంబంధాలు వెల్లడిస్తున్నాయి. ఆమె సంస్థ భారత్‌లోని దిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని విచారించగా... షెహజాద పాత్ర వెలుగులోకి వచ్చింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్ సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, సైన్యం నుంచి ఆమెకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. భారత్‌లోని దాదాపు 3 వేల మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూదిల్లీలోని పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడి ఉంది. అక్కడి ఫస్ట్ సెక్రటరీ (వీసా) సుహైల్ కమర్, కౌన్సిలర్ (ట్రేడ్) ఉమర్ షేయర్‌తో మంచి సంబంధాలున్నాయి. ఆమె నుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా అధికారిగా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్ రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ లేదా స్పాన్సర్‌షిప్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసా వచ్చేసేది.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/దేవరకొండ** : దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన శెట్టిపల్లి బంగారి లక్ష్మమ్మ కూతురు పింకి నగేష్‌ల వివాహం గురువారం జరిగింది. ఈవివాహ వేదుకకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ, రైతు సంఘం నాయకులు ఉజ్జిని యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ దేవరకొండ మండల కార్యదర్శి దేపా సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## 2025లోనే కులగణన ప్రారంభించాలి

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రం 2027 మార్చిలో కులగణన షెడ్యూల్ ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ షెడ్యూల్‌ను సవరించి 2025 లోనే కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీకి బీసీల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. త్వరలో జరగబోయే తమిళనాడు, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి బీసీల కులగణన అంశాన్ని తీసుకొచ్చిందే కాని బీసీల ప్రయోజనాల కోసం కాదన్నారు. నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్ సవరించి 2025లోనే కులగణన చేపట్టాలన్నారు. ఆలస్యం చేయడం వల్ల విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట సుధాకర్, దొనేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

### ప్రొసీడింగ్ జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి

**ప్రజా పక్షం/నల్లగొండటౌన్:** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 ఫీజు రాయితీ ప్రొసీడింగ్‌ను జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి గురువారం జారీ చేశారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరుతూ డిఇఒ బొల్లారం బిక్షపతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించి జిల్లా విద్యాధికారి ప్రొసీడింగ్‌ను జారీ చేసిన సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ డిఇఓ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరం అన్నారు. దీనికి స్పందించిన డిఇఓ,అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు అందించడానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఏదైనా పాఠశాల యాజమాన్యం వినకపోతే,దానిని తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు టియుడబ్ల్యూజే ( ఐజేయు) నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె నాగయ్య, ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, వంగాల శ్రీనివాసరెడ్డి, దోటి శ్రీనివాస్, జిల్లా యాదయ్య, సుధాకర్, అంజయ్య, తెలగ మల్ల దశరథ, , సమద్, వెంకటేశ్వర్లు, అశోక్, రామకృష్ణ, కృష్ణ, రాంప్రసాద్, సత్యం, సోమ చంద్రశేఖర్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టు సెంట్రల్, ఎండ్ డివైజ్ యూనిట్లకు సర్వీసింగ్ పూర్తి

### ... త్వరలో క్రస్ట్ గెట్ల ట్రయల్ రన్



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ముందస్తుగా కృష్ణానదికి వరద వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కొద్ది రోజుల క్రితం ప్రాజెక్టు అధికారులు రేడియల్ క్రస్ట్ గేట్ల రబ్బర్ సీల్ మరమ్మతు పనులను పూర్తి చేసారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులుకాగా 546 అడుగుల వద్ద 26 రేడియల్ క్రస్ట్ గేట్లు అమర్చి ఉంటాయి. అయితే గురువారం గేట్లను ఎత్తేందుకు వినియోగించే మోటర్లకు సంబంధించిన స్టార్టర్లు, గేర్ బాక్సులు,తదితర యూనిట్లను పరిశీలించివిద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించారు ఆతరువాత 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్ చేసే సెంట్రల్ డివైజ్ యూనిట్, ఎండ్ డివైజ్ యూనిట్ లకు సంబంధించి సర్వీసింగ్, గ్రీజింగ్1 నుంచి 13 క్రస్ట్ గేట్లకు సంబంధించిన పనిని పూర్తి చేశారు.ఆ తర్వాత మిగతా యూనిట్లకు సంబంధించిన పనిని వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. మొత్తం సర్వీసింగ్ పని పూర్తయిన తర్వాత 26 రేడియల్ క్రస్ట్ గేట్లకుసంబంధించి ట్రైల్ రన్ నిర్వస్తామని తెలిపారు.

## నిరుపేదలకు నివాస స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు



### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరస్వామి డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణంలో ఎంతోమంది నిరుపేదలు నివాస స్థలాలు లేకుండా జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో సిపిఐ నల్లగొండ పట్టణ కమిటీ సమావేశం ముండ్ల ముత్యాలు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పట్టణంలో ఆసరా పింఛన్లు పొందే పోస్ట్ ఆఫీసుల వద్ద కనీసం టెంట్ త్రాగునీటి సౌకర్యం లేకపోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రతినెల ఆసరా పింఛన్ పంపిణీ సమయంలో టెంట్, తాగునీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వార్డులలో డ్రైనేజీ పేరిట తొవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఇట్టి సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి వి లెనిన్, ఎస్ కె మదార్, రామచందర్ రాజు, ఆర్ లక్ష్మయ్య, జె విజయ, పులిగిళ్ళ లక్ష్మి, ఎం పార్వతమ్మ, ఎండీ యూసుఫ్, కొండోజు విష్ణు వర్ధనా చారి, ఎం విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** సహజ వనరులను కాపాడుకోవడానికి, అవి కాలుష్యం బారిన పడకుండా ఉండటానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నేరడ గ్రామంలో గురువారం చిరు వ్యాపారులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై పాఠశాల ఉపాధ్యాయ బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల పంపిణీ కోసం వాడే ప్లాస్టిక్ కవర్ల వల్ల మానవాళి అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలున్నాయని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే గాలి, నీరు లాంటి సహజ వనరులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పెద్ది పద్మ, నమ్ముల ఆనందకుమార్, షమీమ్‌ఉన్నీసా బేగం, ఎస్ జ్యోతి, కె మౌనిక, జుబీదా, పి రమాదేవి, మాధవి, ఆసియా, కీర్తి పాల్గొన్నారు.



# నిజమైన లబ్ధిదారులకే పథకాలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి




**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రభుత్వం అందించే ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకే చెందాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి లబ్ధిదారులకు అందజేసి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో మునుగోడు నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ కట్టించిన దాఖలాలు లేవని విమర్శించారు. సొంతింటి కలను నిజం చేసేందుకు మా ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇల్లు అనేది ఇల్లు మాత్రమే కాదని, ఆత్మ గౌరవం పెంచే కార్యక్రమం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని, ఇందుకుగాను 200 మంది లబ్ధిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి జాబితాను పరిశీలించి జిల్లాస్థాయిలో వచ్చిన జాబితాను 5 ర్యాండం పరిశీలన చేసి లబ్ధిదారుల ను ఎంపిక చేశామన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, చండూర్ ఇంచార్జ్ ఆర్‌డిఓ రమణా రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్లు దోటి నారాయణ, వైస్ ఛైర్మన్ పాలు వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయం చేయొద్దు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిజమైన లబ్ధిదారులు కాకుండా రాజకీయ నాయకులకు ఇచ్చి రాజకీయం చేయొద్దని శాసనమండలి సభ్యులు నెలికంటి సత్యం అన్నారు. సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభు త్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషమని అన్నారు. నియోజకవర్గంలో సుమారు పది వేల మంది వరకు నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇల్లు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా ఫ్లోరైడ్ ప్రాంతమని ,సుమారు 1500 ఫీట్లు బోరు వేసినా నీరు పడని పరిస్థితి ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా డిండి,ఎస్ఎల్‌బిసీ, బ్రాహ్మణ వెల్లంల సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మునుగోడు సస్యశ్యామ లం అవుతుందన్నారు.క్షేత్ర స్థాయిలో మరోసారి పూర్తిగా పరిశీలించి అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. మునుగోడు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో కలిసి పనిచేస్తామని అన్నారు.



## ప్రజల పక్షాన సిపిఐ పోరాటం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల పక్షాన ఎల్లవేళలా సిపిఐ పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఈ నెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సమానత్వానికి మద్దతు పలుకుతూ,కార్పొరేట్ శక్తుల దోపిడీని వ్యతిరేకిస్తూ సిపిఐ కార్మికుల,కర్షకుల పక్షాన నిలుస్తుందన్నారు. విద్య,ఉపాధి,ఆరోగ్యం రంగాల్లో ప్రజలందరికీ సమానమైన అవకాశాలు ఉండాలని సిపిఐ కోరుకుంటుందన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు పాల్గొననున్నట్లు తెలియజేశారు. కార్యకర్తల,నాయకులు సకాలంలో మహాసభకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడి వెంకయ్య,సోమగాని కృష్ణ,జడ వెన్న,చక్రాల స్టాలిన్,మామిడి నర్సయ్య,చెన్నగాని సైదులు,యల్లావుల సురేందర్,చక్రాల వెంకటేశ్వర్లు,గొల్లగోపు వీరేశం,జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి మెరుగైన వైద్యం

### హెల్త్‌క్యాంపును పరిశీలించిన కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉండునని వారి ఆరోగ్య పరిరక్షణ కోసం మున్సిపాలిటి వారు హెల్త్‌క్యాంపు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటిలో పారిశుధ్య విభాగం సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు పరిశీలించి కార్మికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంపులో పరీక్షల అనంతరం ఎవరికి అయిన జబ్బు ఉన్నదని తేలితే వారిని ఆసుపత్రికి పంపించి మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అదేశించారు. వెంటనే ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ నేరుగా ఫోన్ చేసి మున్సిపల్ సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు.ట్రిట్‌మెంట్ విధానాన్ని దగ్గర ఉండి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి పి.రాంబాబు, కమిషనర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, డాక్టర్ మల్సూర్, డాక్టర్ ప్రవళిక, గౌస్ ఎన్ఎస్ఆర్ ప్రసాద్ యాదగిరి వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

### ధాన్యం కొనుగోలు పూర్తి : కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, సివిల్ సప్లై అధికారి, డియం, డిఆర్‌డిఏ పిడి, మెప్మా డిసివో, వ్యవసాయ అధికారులతో కలిసి కొనుగోలు పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐకెపి, మెప్మా సహకార సంఘాలు, మార్కెటింగ్‌లు లాంటి వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినందుకు అధికారులను అభినందించారు. ట్రక్ షీట్ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 48 గంటలలోనే రైతులకి డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే సీజన్ నాటికిప్రతి సెంటర్‌లో పాడి క్లీనర్స్ ఉండేలా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని డిఆర్‌డిఏ పిడి, డిసివో లను కలెక్టర్ అదేశించారు. ఈ సీజన్‌లో ఏమైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగితే వాటిని వచ్చే సీజన్ నాటికి పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. కేసులు నమోదైన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ మిల్లులపై రోజు వారి నివేదికలు తమకి సమర్పించాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అదేశాల ప్రకారం జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు కలిపి ఒకే సారి సన్నబియ్యం చివరికార్డు వరకు అందేలా జూన్ 30 వరకు కొనసాగుతుందని లబ్ధిదారులు ఒకేసారి రేషన్ షాపులకు ఎక్కువ సేపు నిల్చోవాల్సి వస్తుందని రోజు కొంతమంది వచ్చేలా చూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డిఆర్‌డిఏ పిడి వివి అప్పారావు, సివిల్ సప్లై డిఎం ప్రసాద్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి డిసివో పద్మ, మెప్మా పిడి రేణుక, వ్యవసాయ అధికారి ప్రణవి, సివిల్ సప్లై డిటిలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాలకు స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలకు సంబంధించి స్థలాన్ని గురువారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పరిశీలించారు. గత నెల మే 21న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిసాగర్ వద్ద స్థల పరిశీలనకు బీసీ గురుకుల పాఠశాలకు వచ్చినప్పుడు పాఠశాల యాజమాన్యం సాగర్ లో ఉన్న పాత బిఈడి కళాశాలను తమడిగ్రీ కళాశాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.అందుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి గురువారం పాత బిఈడి కళాశాల ప్రాంగణాన్ని, ఆ పక్కనే నిర్మించి వదిలేసిన భవన సముదాయం డిగ్రీ కళాశాలకు ఏమేరకు ఉపయోగపడుతుందో దగ్గరుండి పరిశీలించి డిగ్రీ కళాశాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం నుంచి నిధులు సమకూరిన తర్వాత ఒక నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు. ఆ తరువాత గురుకుల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తన సొంత ఖర్చులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎంపీ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో మాజీ జెడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగయ్య, వేణు,జయరాం, మద్దాల భాను, అబ్రహం, ముజీబ్ ఉంగరాల శీను పాల్గొన్నారు.

## రైతుల నడ్డి విరుస్తున్న నల్ల చట్టాలు

### రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల నడ్డి విరుస్తుందని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు నల్ల చట్టాలను కేంద్రం వెంటనే తొలగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ ఉంటే వారికి సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే వడ్లను రీసైక్లింగ్ చేసి అందులో కొంత పొడిని కూడా కలిపి కొత్త కొత్త కంపెనీల పేరుతో పది కేజీల బస్తాను రూ.1000 నుంచి రూ.1200 కు తిరిగి రైతులకు అమ్ముతున్నారని అన్నారు. కేంద్రం వరి ధాన్యానికి మొక్కుబడిగా క్వింటాకు రూ.60మాత్రమే పెంచి చేతులు దులుపుకుందే తప్పా రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. రైతులు ఒక ఎకరానికి రూ.40వేల పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తే ఐదు నెలల తరువాత తిరిగి చూసుకుంటే రోజువారి కూలీ కూడా రాని పరిస్థితి ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ధాన్యం రేటు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి బదులు భూభారతి తీసుకురావడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు ఎర్రబోతు పద్మ, బంటు బుచ్చయ్య, అంజన్నపెల్లి రామలింగం, బంటు రాజేశ్వరి, సైదా తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో 12 మందికి రిమాండ్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధిః** పచ్చని పొలాల్లో కాలుష్యం కంపెనీని వ్యతిరేకిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించ తలపెట్టిన స్థలంలో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేసి కంటైనర్ ను తగలబెట్టగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కంపెనీ ఏర్పాటు పై యాజమాన్యం చేస్తున్న మోసాలను తట్టుకోలేక కంపెనీ ఏర్పాటు చేయవద్దని ప్రశ్నించినందుకు ఇద్దరి పై దాడి చేసిన ఘటనను తీవ్రంగా పరిగణించిన బాధిత 12 గ్రామాల ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి నిర్మాణ స్థలంలో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన 12 మందిని రిమాండ్ కు తరలించారు. ఆందోళన చేసిన రైతులను ఖైదీల్లా. ఫాక్షనిస్టుల్లా పోలీస్ స్టేషన్ లో బంధించడం బాధాకరమని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. పెద్ద ధన్వాడలో రైతుల ఆందోళన నేపథ్యంలో రాజోలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 46 మందిని బుధవారం మానవపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీసుతో మాట్లాడి వాహనాల్లో ఉన్న వారిని కిందకు దింపించారు. పోలీసులు, పరిశ్రమకు చెందిన బౌన్సర్లు కొంతమందిని కొట్టడంతో గాయాల పాలయ్యారని ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. పరిశ్రమ వద్దని ప్రజలు మొరపెట్టుకున్నా. నిరహార దీక్షలు చేసినా పట్టించుకోకుండా రాత్రికి రాత్రి పనులు ప్రారంభించడం ఎంత వరకు సబబని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బాధిత రైతులకు రాజకీయ ప్రజా సంఘాల నా యకులు దొడ్డి వెంకట్ రాములు, ఆంజనేయు లు, వెంకటస్వామి , కుర్ర పుల్లయ్య, టవర్ మ క్బూల్, కార్తీక్ పరిశ్రమను తరలించేంత వరకు రైతులకు మద్దతుగా ఉంటామన్నారు. పరిశ్రమను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. సుమారు 36 మందిని ప్రత్యేక వాహనంలో స్వగ్రామాలకు పంపించారు. 12 మందికి రిమాండ్ విధించారు. మరికొందరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, రైతులను ఎంత వారించినా కర్రలు, పెట్రోలు, కారంపొడితో నిర్మాణస్థలిలో బీభత్సం సృష్టించారని, సమస్య ఎంత తీవ్రత ఉన్న చట్టాలను అనుసరించి శాంతి యుత వాతారణంలో పరిష్కరించుకోవాలన్నారు.

## మోదీ పాలన భేష్

### చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి** : భారత ప్రధాని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన అద్భుతంగా ఉందని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ ఏలే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో జిల్లా ముఖ్య నాయకుల వర్క్ షాప్ ఎస్ఆర్ మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం సంకల్పంతో సహకారం చేస్తూ శత్రు దేశం కవ్వింపు చర్యలతో దేశ ప్రజలను పొట్టన పెట్టుకుంటే ఆపరేషన్ సింధూర్‌తో మహిళ మేజర్లతో తగిన బుద్ధి చెప్పడం దేశంలోని ప్రజలందరినీ ఒక తాటిపై తీసుకొస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని పట్టణాలు, మండలాలలో కార్యశాలలు కార్యక్రమాలు డిజిటల్ పోటీ పరివర్తన, జిల్లాస్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్ మండల స్థాయి సంకల్ప సభ శక్తి కేంద్ర స్థాయి రచ్చబండ సాహిత్య పంపిణి యోగా శిక్షణ పర్యావరణ పరిరక్షణ ఇలాంటి వారం రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పట్నం కపిల్, జిల్లా కో కన్వీనర్ ఉడుత భాస్కర్, గుంట్ల సత్యం, పల్లా జితేందర్ రెడ్డి, గుర్రం ప్రవీణ్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, సిఎన్ రెడ్డి, వేముల అశోక్, పడమటి జగన్మోహన్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చందా మహేందర్ గుప్తా పాల్గొన్నారు.



## వెంకటేశ్వరుని సేవలో పాలకుర్తి ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని గురువారం వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపిక అందచేసి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, పర్యవేక్షణాధికారి కె.విజయకుమారి,ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షుడు ముల్పూరి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి సంరక్షించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్ లు తెలిపారు. గురువారం వన్ టౌన్ ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జానిమియా, పగడాల మల్లేష్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలోవర్షాలు రావాలన్న, అతివృష్టి, అనావృష్టి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే మొక్కలు నాటాలని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.న్యాలక్ష్యస్వచ్ఛందసం స్థ అధ్యక్షుడుసత్యనారాయణ,తదితరులుపాల్గొన్నారు.



## 18న నేలకొండపల్లిలో దివ్యాంగుల మహార్యాలీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**దేశ రక్షణ కోసం పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టిన త్రివిధ దళాలకు దివ్యాంగులు సెల్యూట్ చేస్తున్నామని తెలంగాణ దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పి.వీ. చలమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జేఏసీ సమావేశం ను నిర్వహించారు. తొలుత వీర జవాన్లకు సంతాపంను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన త్రివిధ దళాలకు దేశం అంతా రుణపడి ఉంటారని అన్నారు. వీర జవాన్ల సేవలు మరువలేనివి అన్నారు. దేశ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్న భారత ప్రభుత్వం కు తమ మద్దతు ను ప్రకటించారు. అదే విధంగా జవాన్ల కు అండగా దివ్యాంగుల జెఏసిఆధ్వర్యంలోఈ నెల 18న నేలకొండపల్లి లో మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పాలేరు డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తరలిరావాలని కోరారు.సమావేశంలో జెఏసి నాయకులు తదితరులు పాల్గొన్నా రు.

## చక్కటి పర్యావరణంతోనే మానవాళి మనుగడ: కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :**చక్కటి పర్యావరణంతోనే మానవాళి మనుగడ సాధ్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఉమెన్స్ కాలేజీ సమీపంలో ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఐఎంఏ హాల్లో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ బి రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ, కాలుష్య నియంత్రణ చట్టాలు పరిశ్రమలు, ప్రజలు పాటించాలని సూచించారు. ప్లాస్టింక్ రహిత సమాజాన్ని తయారు చేసుకున్న నాడే మానవ మనుగడ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించి నారా, గుడ్డ సంచులను వాడాలని కోరారు. సింగరేణి ఉమెన్స్ కాళాశాల అధ్యాపకురాలు పావని మాట్లాడుతూ పర్యావరణ పాముఖ్యతను వివరించారు. మందుగా నార సంచులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు ప్రభాకర్, శ్రీనివాస్ బాబు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రజలు పలువురు పాల్గొన్నారు.

## వీరబాబు కుటుంబానికి మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న చిమ్మపుడి గ్రామానికి చెందిన పరిమిశెట్టి వీరబాబును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం చిమ్మపుడి గ్రామానికి వెళ్లి వీరబాబు కుటుంబాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. వీరబాబు చిత్ర పటానికి పూల మాల వేసి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి ఎల్లవేళల అండగాఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసి రైతులను బలితీసుకుంటుందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా ఇస్తామని రైతులను మభ్యపెట్టి వారి చావుకు కారణమవుతుందన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక ఇంకెంత మంది రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వం చూడాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఆదుకోవాలని, రైతుబీమా, రైతుభరోసా, రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ఎంపిపి గుత్తా రవి, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, దొంతు సత్యనారాయణ, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంలో జాబ్ మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు నేడు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఆరు శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ ఖమ్మం నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సర్వీస్ మేనేజర్ సంబంధిత ఖాళీల ఉద్యోగాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఇంటర్, డిగ్రీ అర్హత గల పురు ష అభ్యర్థులు అర్హులని ఆమె తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మం, సూ ర్యాపేట జిల్లాల నందు ఉన్నాయని ఎంపికైన వారికి వేతనం రూ. 15వేల నుండి రూ.35వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 54 ఉద్యోగ ఖాళీల భర్తీకి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

## ఈనెల 17లోగా దరఖాస్తు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జూన్ 17లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు 3వ, 5వ, 8వ తరగతుల ప్రవేశాల కొరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి ఖమ్మం జిల్లాకు చెందిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో అర్హులైన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశం అందిస్తామని తెలిపారు. మూడవ తరగతి విద్యార్థులకు 29, ఐదవ తరగతి విద్యార్థులకు 14, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు 14సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. దరఖాస్తుల గడువు జూన్ 17తో ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి గల దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 20న ప్రాజెక్టు అధికారి అధ్యక్షతన ఐటిడిఏ భద్రాచలం ఆఫీస్ నందు తరగతుల వారీగా లాటరీ పద్ధతిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు ఉండాలని తెలిపారు. దరఖాస్తుకు కుల, నివాస ధృవీకరణ పత్రం, గతేడాది చదివిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జత చేయాలని ఐటిడిఏ పిఒ తెలిపారు. జూన్ 17న సాయంత్రం ఐదు గంటల లోపు ఉప సంచాలకులు గిరిజన సంక్షేమ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ ఖమ్మం నందు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## రెవెన్యూ సదస్సుల ద్వారా

# భూ సమస్యల పరిష్కారానికి కృషి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



**ప్రజాపక్షం/వైరా:**రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం వైరా మండలం పూసలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా మనకు వచ్చే భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి చట్టం పరిధి మేరకు కృషి చేయాలని కలెక్టర్ తహసీల్దార్‌కు సూచించారు. సాదాబైనామా దరఖాస్తులో భాగంగా లింక్ డాక్యుమెంట్ ఉండాలని, అదేవిధంగా సంబంధిత దరఖాస్తులు చట్ట ప్రకారం తప్పనిసరిగా నమోదు చేసి ఉండాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా ముందు క్షేత్రస్థాయిలో భూమి ఎవరి కబ్జాలో ఉందో పరిశీలిస్తామని అన్నారు. డెస్క్ వర్క్ ద్వారా పూర్తి చేసే దరఖాస్తులను వెంటనే పరిష్కరించి డిస్పోస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ హక్కుల్లో పేరు మార్పు, డబుల్ ఎంట్రీ తొలగింపు వంటి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఆర్ఎస్ఆర్ వంటి సమస్యలు క్షేత్రస్థాయిలో భూ సర్వే ద్వారా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. సాదాబైనామా దరఖాస్తులను హైకోర్టు తీర్పు ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు లైసెన్స్ సర్వేయర్లను ప్రభుత్వం అనుమతి ఇచ్చి శిక్షణ అందిస్తుందని మన జిల్లాలో 600 మందికి ప్రస్తుతం శిక్షణ అందుతుందని, త్వరలోనే గ్రామ కంట సర్వేలు నిర్వహిస్తామని అన్నారు. అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు అవుతాయని, వీటి ద్వారా త్వరలో భూమి లేని వారికి ఇంటి పట్టాలు పంపిణీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. భూ హక్కుల రికార్డులపై ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గతంలో కేవలం సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, భూభారతి చట్టం ప్రకారం తహసీల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టు వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. భూ వివాదాలు ఇక్కడ ఖర్చు లేకుండా పరిష్కారం అవుతాయని కలెక్టర్ తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలు మాత్రమే కాకుండా ఆయిల్‌పామ్ వంటి లాభసాటి పంటలను సాగు చేయాలని అన్నారు. కోతుల బెడద, వరద వంటి సమస్యలు ఉండవని, 4వ సంవత్సరం నుంచి రైతుకు మంచి ఆదాయం వస్తుందని, అప్పటి వరకు అంతర్ పంటల వలన ఆదాయం ఆర్జించవచ్చని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎక్కడైనా అనర్హులకు ఇళ్లు చేరితే స్థానికులు ఫిర్యాదు చేయాలని వెంటనే లిస్టు నుంచి పేరు తొలగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్.శేషురెడ్డి, రైతులు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఎంపి క్యాంపు కార్యాలయంలో సంబరాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి ఘన విజయం సాధించి ప్రజాసేవలో ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్‌శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. గురువారం ఖమ్మంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. జిల్లా చరిత్రలో ఎవరికి దక్కనంత అఖండ మెజార్టీతో రఘురాంరెడ్డి గెలిపొందారని ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు.తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి కొప్పుల చంద్రశేఖర్ తో పాటు 50 మంది రక్తదానం చేశారు. యూత్ కాంగ్రెస్ బాధ్యులు క్రాంతి, కిరణ్ ఆధ్వర్యంలో కాల్వొడ్డు నుంచి గట్టయ్య సెంటర్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు , పలు నియోజక వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్ల సంబరాలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఫార్మసిస్టులను ప్రభుత్వం ఫార్మసీ ఆఫీసర్లుగా హోదా కల్పించిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. గురువారం ఐ డిఒసి ప్రాంగణంలోని స్ఫూర్తి కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల అ సోసియేషన్ ఆధ్వర్యంలో ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రభుత్వం గుర్తించి గెజిట్ విడుదల చేసిన సందర్భంగా సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డి ఎంఅండ్‌హెచ్ఓ కళావతి బాయి హాజరై మాట్లాడుతూ ముందుగా ఫార్మసీ ఆఫీసర్లకు అభినందన లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, న ర్సింగ్ ఆఫీసర్లు లాగే ప్రముఖ పాత్ర వహిస్తుంది ఫార్మసీ ఆఫీసర్లే అన్నారు. రోగులతో ప్రేమ పూర్వకంగా మా ట్లాడుతూ వైద్యులు రాసిన మందులను ఇచ్చి వాటిని ఎలా వాడాలో వివరంగా చెప్పి రోగులను ఆరోగ్యవంతులుగా చేస్తున్నారన్నారు. గత ంలో కాంపౌండర్ ఆ తర్వాత ఫార్మసిస్టు గ్రేడ్ 1, గ్రేడ్ 2 అని, జిల్లాలో ప్రధాన మందుల స్టోర్‌లో ఉ ండేవారిని డిస్ట్రిక్ ఫార్మసీ సూపర్ వైజర్ అని పిలిచేవారని ఆమె తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం వా రిని ఫార్మసిస్టు గ్రేడ్ 1ను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా, గ్రేడ్2 ను ఫార్మసీ ఆఫీసర్‌గా జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్‌ను జిల్లా ఫార్మసీ ఆఫీసర్‌గా మార్చ డం అభినందనీయ మన్నారు.డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సైదులు, ప్రో గ్రాం అధికారులు చందు నాయక్, వెంకటరమణ, రామారావు, జిల్లా ఫార్మసీ ఆఫీసర్ (ఇంచార్జ్) మోహన్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్ , ఫార్మసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విపత్తు నివారణపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విపత్తు సమయంలో చేపట్టాల్సిన నివారణ చర్యలపై ఎస్‌బిఐటి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ అవెర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు జాతీయ విపత్తు నివారణ సంస్థ ఇన్‌స్పెక్టర్ గౌతమ్, జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ విపత్తు చెప్పి రాదని అది జరిగిన వెంటనే స్పందించేందుకు యువత ముందుండాలన్నారు. విపత్తు జరిగినప్పుడు నష్ట నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఎన్‌డిఆర్ఎఫ్ సేవలను కొనియాడారు. గతేడాది ఖమ్మంజిల్లా ఎదుర్కొన్న వరద ముంపులో జాతీయ బృందాలతో పాటు స్థానిక యువత అందించిన తోడ్పాటును గుర్తు చేసుకున్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సిపిఆర్, వైద్య విధానంపై విద్యార్థులకు శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. అగ్నిప్రమాదం, వరదలు, భూకంపం వంటి విపత్కర పరిస్థితుల్లో అవలంభించాల్సిన కనీస ప్రమాణాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఇటువంటి శిక్షణలు సామాన్య ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. తద్వారా నష్ట నివారణ తగ్గించవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గోడును పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు

### ఎత్తు పెంచి అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని సిపిఐ వినతి



**ప్రజాపక్షం/బోనకల్:** నాగపూర్ అమరావతి నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మాణం ఎత్తు పెంచాలని రైతులు వేడుకుంటున్నా అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. 5మీటర్ల ఎత్తు వరకు అండర్ పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఎన్ హెచ్ అధికారులు 3.5 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నేషనల్ హైవే ప్రాజెక్టు అధికారులకు సిపిఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కొంగర కృష్ణయ్య మాట్లాడుతూ తక్కువ ఎత్తులో అండర్ పాస్ నిర్మాణం చేపడితే పక్కనే ఉన్న చిన్నబీరవల్లి గ్రామానికి , వ్యవసాయ పనులకు నిమిత్తం భూ ములకు ట్రాక్టర్స్, డోజర్స్, హార్వెస్టర్ వెళ్లేందుకు వీలు కాదని, దీంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. చిన్నబీరవల్లి గ్రామం నుండి వ్యవసాయ భూములు నేషనల్ హైవేకు అవతల వైపు ఉన్నందున అండర్ పాస్ నిర్మాణం ఎత్తు 5మీటర్లు పెంచటం వల్ల వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా ఉంటుందని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి అండర్ పాస్ ఎత్తును పెంచి నిర్మాణ పనులు చేపట్టి రైతులకు, చిన్నబీరవల్లి గ్రామ ప్రజలకు ప్రయాణం చేసేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొంగర వెంకటేశ్వరరావు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## 11న సిపిఐ మండల మహాసభ

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి




**ప్రజాపక్షం/ములకలపల్లి:**సిపిఐ గ్రామ శాఖ మహాసభలు రే గులకుంట, నల్లమూడి గ్రామాల్లో వాడే చిన్న నగేశ్, కూరం దారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ పాల్గొని, మాట్లాడుతూ సిపిఐ పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని, ఇప్పటి వరకు దేశంలో ఏ పార్టీ 100 సంవత్సరాల చరిత్ర కలిగి లేదన్నారు. మన ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో అనేక భూ పోరాటాలు ప్రజా ఉద్యమాలు నిర్మించి పేద ప్రజలకు భూములు పంపిపెట్టి వ్యవసాయ కూలీలు రైతాంగ పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర ఎర్ర జెండా పార్టీ సిపిఐదని కొనియాడారు. జూన్ 11న ములకలపల్లి రాయల్ పంక్షన్ హాల్‌లో సిపిఐ మండల మహాసభ జరుగనున్నదని ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరు కానున్నారని తెలిపారు. రేగులకుంట సిపిఐ శాఖ కార్యదర్శిగా కూరం నగేశ్, సహాయ కార్యదర్శిగా కురం సత్యం, నల్లమూడి శాఖ కార్యదర్శిగా పడియర్ రంజిత్, సహాయ కార్యదర్శిగా లకావత్ బాలకృష్ణ 20 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈసభలో సిపిఐ పార్టీ ములకలపల్లి మండల కార్యదర్శి ఎండి యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు

### ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్. గురువారం పర్యావరణ పరిరక్షణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని వేశ్య కాంతల చెరువు కట్టపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ తో కలిసి సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.రాగమయి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని, పర్యావరణం బాగున్నప్పుడే మనము బాగుంటామన్నారు. సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు , రాజీవ్ నగర్ కాలనీ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న చూపు 'పత్తిసాగు' వైపు

కనీస మద్దతు ధర పెరగడంతో ఆశ * జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు * విత్తనాలపై నిఘా పెంచిన ప్రభుత్వం * నకిలీల ఆట కట్టించేందుకు రంగంలోకి టాస్క్ ఫోర్స్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**పత్తి సాగువైపు రైతన్నలు చూస్తున్నారు. గతం కంటే కనీసం మద్దతు ధరను ప్రభుత్వం పెంచడంతో రైతుల్లో పత్తి సాగు చేయాలనే ఆశలు చిగురిస్తున్నాయి. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అనుకూల వాతావరణం ఉందనే వార్తలు రావడంతో రైతులు పత్తిసాగుకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే భూముల్లో వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వాతవరణానికి సంబంధించి అనువైన విత్తనాలను కూడా ఎంపిక చేసుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. వ్యవసాయ అధికారులు సైతం భూ సార పరీక్షలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

**పత్తికి పెరిగిన ధర:** ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించింది. కొత్త మద్దతు ధర ప్రకారం పత్తి సాధారణ రకం క్వింటాకు రూ.7710 కాగా మేలు రకం క్వింటాకు రూ.8110 పెంచింది. గతంలో ఈ ధరలు, రూ.7121, రూ.7521 గా ఉంది. పత్తితో పాటు జొన్నలు, రాగి, శనగపప్పు, ఎ ర్ర కందిపప్పు, ఆవాలు తదితరాలకు కూడా కేంద్రం కనీసం మద్దతు ధర ప్రకటించింది. పత్తికి మంచి ధరే ఉండటంతో రైతులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**సుమారు 5 లక్షల ఎకరాలు:**ఈ ఖరీఫ్ సీజన్లో రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతాంగం కనీసం 5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసేదుకు సిద్ధపడుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షల 60వేల ఎకరాలు, ఖమ్మం జిలాల్లో సమారు 2 లక్షల 40 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంగా రెండు జిలాల్లకు కలిపి 10 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరమ్యే అవకాశం ఉండగా, ఇప్పటికే డీలర్ల వద్దకు స్టాకు చేరుకుంది. కాగా విత్తనాల కొరత ఎక్కడా రాకుండా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. కాగా గత ఏడాది కంటే కొద్దిగా విత్తనాల ధర పెరిగింది.

**నకిలీలపై నిఘా:**పత్తి వ్యవసాయం సీజనల్లో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు రాజ్యమేలే ఆవకాశం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్సు టీంలు రంగంలోనికి దిగాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో దుకాణాలను సైతం తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లోకి నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు కేటుగాళ్లు వచ్చే అవకాశం ఉందని, వారి మాయ మాటలకు మోసపోకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని పెద్ద ఎత్తున వ్యవసాయాధికారులు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లోకి విత్తనాలు అమ్ముతామంటూ వచ్చే వారి వివరాలు ఇవ్వాలని టాస్క్‌ఫోర్సు టీం ఇప్పటికే పలుమార్లు ప్రకటించింది. రైతులు నాణ్యమైన విత్తనాల కొనుగోలు చేసి మేలైన పంటలు పండించాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు

## స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు విదేశీ విద్య చదువుకోవాలనుకునే విద్యార్థులు చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకంకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మాచర్ల వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసిస్తూ ఉపకార వేతనం పొందడం కోసం అర్హత ఉన్న మైనారిటీల (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సి) విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో తేది: 01.01.2025 నుండి తేది: 31.07.2025 వరకు ప్రవేశం పొందిన విద్యార్థులు www.telangan aepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 01నుండి 30 వరకు సా: 5.00 లోపు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనరిటీల సంక్షేమ అధికారి కార్యాలయం జయశంకర్ భూపాలపల్లి లో సంప్రదించాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాపక్షం/హనుమకొండ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులు మొక్కలు నాటి నీళ్లు పోశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్‌పి సిఇఒ విద్యాలత, జిల్లా అధికారులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ కుమార్, లక్ష్మీ రమాకాంత్, చంద్రశేఖర్, రవీందర్ సింగ్, కలెక్టరేట్ పాలనాధికారి గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## పుణ్యక్షేత్రాలకు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు

### భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :పుణ్యక్షేత్రాల దర్శనం కోసం ఆర్టిసి టూర్ ప్యాకేజీలను ప్రజలు వినియోగించుకోవాలని భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందు కోరారు. గురువారం భూపాలపల్లి ఆర్టీసి డిపోలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఒక్క రోజులో భూపాలపల్లి నుండి కొమురవెల్లి, కొండ పోచమ్మ వేములవాడ, కొండా గట్టు, ధర్మపురి సందర్శించి రాత్రి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సు చేరుకుంటుందని, ఒక్కొక్కరికి రానూ ఫోను చార్జీలు రూ.680,ఒక్కరోజులో భూపాలపల్లి నుండి భద్రచలం, పర్ణశాల , మల్లూరు దేవాలయాలను సందర్శించి రాత్రి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సు చేరుకుంటుందని. ఒక్కొక్కరికి రానూ ఫోను చార్జీలు రూ.700 ఒక్క రోజులో భూపాలపల్లి నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సందర్శించి రాత్రి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సు చేరుకుంటుదని . ఒక్కొక్కరికి రానూ ఫోను చార్జీలు రూ.770, రెండు రోజులలో భూపాలపల్లి నుండి బీజపల్లి ఆంజనేయ స్వామి ఆలయం ఆలంపూర్ జోగులాలు దేవాలయాలను సందర్శించి మరుసటి రోజు రాత్రి భూపాలపల్లికి సూపర్ లగ్జరీ చేరుకుంటుదని ఒక్కొక్కరికి రా నూ పోనూ చార్జీలు రూ.1700, రెండు రోజులలో భూపాలపల్లి నుండి విజయవాడ కనక దుర్గా అమ్మవారి దేవాలయం, అన్నవరం శ్రీసత్యనారాయణ స్వామి సందర్శించుకొని మరుసటి రోజ రాత్రి భూపాలపల్లి కి సూపర్ లగ్జరీ చేరుకుంటుదని ఒక్కొక్కరికి రానూ...పోనూ చార్జీలు రూ. 2150,ఇలా ఐదు రూట్లలో పుణ్యక్షేత్రాలు బస్సులు నడపాలని నిర్ణయించాముని, ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే




ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం పై ఎస్‌హెచ్‌జీ లకు శిక్షణ, గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్దియా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా బృందాలకు (ఎస్‌హెచ్‌జీ) మొక్కలు నాటడంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్‌హెచ్‌జీ బృందాలు ఈ శిక్షణను సమర్థవంతం గా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఒలు రమేష్ లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ అనూహ సిఓలు శ్రీలత సుజాత మెప్మా ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

### ఓసిత్రీ ప్రాజెక్టు ఆఫీసర్ భిక్షమయ్య



ప్రజాపక్షం/గణపురం:మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కెటికె ఓసి త్రీ ప్రాజెక్టు ఆఫీసర్ భిక్షమయ్య అన్నారు. గురువారం ప్రపంచ పర్యావర ణ దినోత్సవం సందర్భంగా, గణపురం మండలంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కెటికె ఓసి3 ప్రాజెక్ట్ పరిధిలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ బిక్షమ య్య మట్లాడుతూ, పర్యావరణంలో మనం ఎదుర్కొంటున్న సమస్యలు (గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు , అడవిల నాశనం, పర్యవరణ కాలుష్యం గురించి వివరించారు. చెట్లు నాటండి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. నీటి వృథా చేయకుండా అపాలన్నారు. విద్యుద్వినియోగాన్ని సమర్థవంతంగా వినియో గించాలన్నారు. గ ప్రాజెక్ట్ మేనేజర్. శ్రీనివాస్ , కాలరీ మేనేజర్ రాంబాబు, ఓ సి ఆపరేషన్స్ మేనేజర్ మధుసూధన్, పర్యావరణ అధికారులు, ఉద్యోగులు, అధికారులు, సంక్షేమ అధికారులు సాయికృష్ణ , కిషోర్. యూనియన్ నాయకులు విజయేందర్, శంకర్, రాజేష్, కృష్ణా రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

## కెటికె 5 ఇంక్లైన్ మేనేజర్‌ను కలిసిన ఎఐటియుసి నాయకులు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :భూపాలపల్లి ఏరియా కెటికే 5 ఇంక్లైన్ గనికి నూతనంగా బదిలీపై వచ్చిన మేనేజర్ నారాయణను గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఫిట్ సెక్రెటరీ దోర్నాల తిరుపతి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్ప గుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.నారాయణమూర్తి, దామోదర చారి, కె.వి.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాస్, యు .కుమారస్వామి, ఎన్.సత్తి, కే.తిరుపతిరెడ్డి, వై.ప్రకాష్, పి.సమ్మిరెడ్డి, ఎంసుధాకర్ పి.భద్రయ్య సిహెచ్ రామచందర్, పి.రాజయ్య, ప్రవీణ్, వై.చందు, జె.సతీష్, రాజ్ కుమార తదితరులు పాల్గొన్నారు.

## మానవాళి మనుగడకు మొక్కలే ప్రాణాధారం

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మానవాళి మనుగడకు మొక్కలే ప్రాణమని, అందుకే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో మల్లిఖార్జున్ సూచించారు. గురువారం ఆలింపూర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలను నాటారు. అంతకుముందు గ్రామ రికార్డు పంచాయితిలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు మొక్కలను నాటి ఊరతంగా హరిత వనంగా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బాల్నే రేవతి గౌడ్,కారోబార్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ పాకాల రాజేశ్వర్, అంగన్వాడి టీచర్లు విజయ, వినోద, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో నేటి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై విద్యా, సంక్షేమ శాఖలు, డిఆర్‌డిఒ, పంచాయతీ, కార్మిక, మున్సిపల్, మెప్మా తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ''బడిబాట'' కార్యక్రమాన్ని జూన్ 6 నుండి 19వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు 6 నుండి 19వ తేదీ వరకు తయారు చేసిన షెడ్యూల్ ప్రకారం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇవన్నీ ప్రజలకు తెలియచెప్పి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలాలల్లో విద్యార్థుల నమోదు లు పెంచాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం జిల్లాలో మొత్తం450 పాఠశాలలు ఉండగా, అందులో 34 పాఠశాలల్లో విద్యార్థులు నమోదు కాలేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ద్వారా విద్యా బోధన జరుగుతుందని ప్రజల్లో అవగాహన కల్పించాలని వివరించారు. జూన్ 6వ తేదీన గ్రామసభలు నిర్వహించి, ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 7న ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపాలని, బడి ఈడు పి ల్ల ల వివరాలు సేకరించి గ్రామ విద్యా రిజిస్టర్‌లో నమోదులు చేయాలన్నారు. 8 నుండి 10 వరకు డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. 11న పాఠశాల నిర్వహణ కమిటీలు, గ్రామ సమాఖ్యలు, గ్రామ పెద్దలు తదితరులతో సమావేశం నిర్వహించి 6 నుండి 10 వ తేదీ వరకు జరిగిన కార్యక్రమాలు పరిశీలన చేయాలన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని తెలిపారు. జూన్ 12 విద్యా లయాలు ప్రారంభం అవుతున్న సందర్భంగా పండుగ వాతావరణంలో విద్యార్థుల ను ఆహ్వానం పలకాలని తెలిపారు. పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేపట్టి విద్యార్థులను అభినందించాలని సూచించారు. 13న సామూహిక అక్షర అభ్యాసం కార్యక్రమా లు నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. బాలసభలు నిర్వహించాలని తెలిపారు. 16న శాస్త్ర ప్రదర్శనలు, డ్రాయింగ్, కథల పోటీలుతో పాటు విద్యార్థులు కమ్యూనిటి స భ్యులు ప్లే కార్డ్స్, స్లొగన్స్ తో ప్రదర్శన చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఐ కెన్ రీడ్ లేదా ఐ కెన్ కౌంట్ వంటి గుర్తింపు బ్యాడ్జ్ ఇవ్వాలన్నారు. 17 న విద్య, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో నమోదు చేయాలని తెలిపారు. వి ద్యార్థుల హాజరు రిజిష్టర్ పక్కాగా నిర్వహించాల ని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటి సభ్యులు ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు కల్పించే సౌకర్యాలు వివరించాలన్నారు. బాలికలకు కల్పిస్తున్న స్పెషల్ డిఫన్సె కార్యక్రమాలు, బాలికల రక్షణకు కల్పిస్తున్న హ క్కులు, చట్టాలు తెలియ చేయాలని తెలిపారు. 18న పాఠశాలల్లో డిజిటల్ సౌకర్యాలు, చెట్లు పెంపకం, కిచెన్ గార్డెన్స్ నిర్వహణ చేయాలన్నారు. 19న ముగింపు రోజున స్పోర్ట్స్ డే చేయాలని, ఆటలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందచేయాలని తెలిపారు. ప్రభుత్వ బడులల్లో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిఇవి రాజేందర్, డిఆర్‌డిఒ బాలకృష్ణ, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ అధికారులు సునీత, రాజరత్నం, వైద్యశాఖ అధికారి డా॥ మధు సూదన్, కార్మిక శాఖ అధికారి వినోదా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మెప్మా పిడి రాజేశ్వరి, మండలవిద్యాశాఖఅధికారులుతదితరులుపాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు



ప్రజాపక్షం/హసన్ పర్తి : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు పాలనపరమైన ఇబ్బందులు కలగకుండా గురువారం హసన్ పర్తి మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ శాఖ పరిధిలోని ఉపాధి హామీ 20 లక్షల రూపాయల నిధులతో గ్రామ పంచాయతీ భవనానికి కొబ్బరికాయ కొట్టి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. గ్రామ మహిళామణులు కోలాటాలతో ఎమ్మెల్యే నాగరాజుకు ఘన స్వాగతం ఫలికారు. అనంతరం పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించాలని గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు లు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచామని గత 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదనీ, మళ్ళీ ఇందిరమ్మ ప్రభుత్వంలో వచ్చాకే అర్హులైన వారికి రేషన్ కార్డులను అందించామన్నారు. వర్ధన్నపేట నియోజవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించగా సుమారు ఇప్పటికే 1500కు పైగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం, రైతులకు ఆత్మీయ భరోసా మహిళలకు పెద్ద పీట వేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్న తరుణంలో ప్రతిపక్షాలు చేసే కుట్రలను తరిమికొడుతూ మన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం అని, ప్రజలందరూ బిఆర్‌ఎస్ బిజెపి నాయకుల మాయమాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, యూత్ నాయకులు మంద రాజు, జట్టి యుగేందర్, నితిన్ రెడ్డితో పాటు మండల గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలుఅధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు ఉద్యమమంలో రాజారెడ్డి 50 ఏళ్ల ప్రస్థానం




ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి కమ్యూనిస్టు ఉద్యమమంలో 50 ఏండ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సంరద్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆయనను శాలువాతో సత్కరించారు. సిహెచ్ రాజారెడ్డి 1975లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. జనగామ మాజీ ఎంఎల్‌ఎ ఏసిరెడ్డి నర్సింహారెడ్డికి కుడి భుజంగా ఉన్న ఆయన బలమైన కార్మిక పోరాటాలు చేశారు. 1985లో ఆయన జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నిత్యం ప్రజా పోరాటాల్లో ఉండే ఆయన 1975లో కమ్యూనిస్టు పార్టీలో చేరగా 2025లో కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో 50 ఏండ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా రాజారెడ్డిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మాణించాలి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, కావటి యాదగిరి, జువ్వారి రమేష్, మోటే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి దిక్సూచి జర్నలిజమే

### వృత్తి నైపుణ్యంపై క్లాస్ బోధించిన కెయు జర్నలిజం విభాగం అధ్యాపకుడు కంజర్ల నర్సింహరాములు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : సమాజానికి దిక్సూచి జర్నలిజమేనని జర్నలిజం వృత్తి ఏంతో బాధ్యతాయుతమైనదని కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజకీయ విశ్లేషకులు తిరునహరి శేషు అన్నారు. సీనియర్ జర్నలిస్టులు జక్కుల విజయ్ కుమార్, జన నిర్ణయం ఎడిటర్ దామెర రాజేందర్ కోఆర్డినేటర్లుగా నిర్వహించిన జర్నలిస్టుల శిక్షణా శిబిరం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ జరిగింది. ఈ సందర్భంగా తిరునహరి శేషు హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. పాలకులకు, ప్రజలకు వారధిగా పత్రికలు ఉండే క్రమంలో జర్నలిస్టులు బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. సమాజంలో మరుగనపడ్డ సమస్యలను, వివిధ అంశాలను వెలికితీయడంలో జర్నలిస్టు తమదైన శైలిలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. సోషల్ మీడియా ప్రభావం పేరుగుతున్న నేపథ్యంలో నేటితరం జర్నలిస్టులు మరింత అప్రమత్తంగా ఉండటంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు భవిష్యత్తులో కొనసాగించాలని అన్నారు. నిర్వాహకులను అభినందించారు. మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని కేయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నర్సింహరాములు అన్నారు. వార్తలు, స్టోరీలు, వార్తాసేకరణ, శీర్షికలు, లీడ్, సూపర్ లీడ్, వాక్యనిర్మాణం తదితర అంశాలపై ఈ క్లాసులో చర్చించారు. జర్నలిజం పరిణామా క్రమాన్ని వివరించారు. పత్రికా రంగంలో నాటికి నేటికి వచ్చిన మార్పులను, ఆ మార్పులకనుగుణంగా నేటితరం జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని బోధించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, వివిధ మండలాలు, ప్రాంతాల నుంచి నుంచి వర్కింగ్ జర్నలిస్టులు హాజరై శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటరత్నం, పి. సురేందర్, కిరణ్, స్వామిదాస్, ఆర్. శ్రీనివాస్, శంకర్, కె. వెంకన్న ,రాజేందర్, రవి కుమార్, సాయి, సందీప్, వెంకటేశ్వర్లు, గణేష్, మధు, నరేష్, యాకూబ్, కె. రాజేందర్, పి. శ్రీనివాస్, సుమన్, రాణా ప్రతాప్, తరుణ్ తేజ్, మోహన్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి తావులేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/జఫర్‌గడ్: అవినీతికి తావులేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మండల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే కడియం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీ హరి మాట్లాడుతూ నియోజకవర్గంలో 90శాతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని, ఎక్కడా అవినీతి లేకుండా లబ్దిదారుల ఎంపిక జరిగిందని ఇందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ, మండల నాయకులకు అభినందనలు తెలిపారు. గ్రామాలలో అందరి సమన్వయం చేసుకుని సమిష్టి నిర్ణయంతో లబ్దిదారుల ఎంపిక జరుగాలన్నారు. ఎక్కడా, ఎవరికి లంచం ఇవ్వొద్దని సూచించారు. ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారికి అవకాశాలు వస్తాయన్నారు. అందరినీ కలుపుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు. మనమందరం కలిసి నియోజకవర్గంలో, మండలంలో, గ్రామంలో పార్టీని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, పిఎసిఎస్ చైర్మన్ కరుణాకర్‌రావు, ఆర్‌డిఒ వెంకన్న, తహసీల్దార్ శంకరయ్య, ఎంపిడిఒ సుమన్, ఇతర అధికారులు, ప్ర జాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు, మహిళలు,పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం పేదలకు వరం

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భూ భారతి చట్టం పేదలకు వరం లాంటిదని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు ఈ చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. గురువాకం జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ఎంతో విశిష్టమైందని, అధికారులు చెప్పిన వివరాలు తెలుసుకొని వినియోగించుకోవాలన్నారు. ధరఖాస్తులు నింపడంలో పొరపాట్లు చేయరాదని, హెల్ప్ డెస్క్ ఉపయోగించుకోవాలని అధికారులు కూడా ముందుగా సంబందిత అధికారులతో మాట్లాడాలని, వారి సమ్యలు తెలుసుకొని వాటిని సులభంగా పరిష్కారం అయ్యేటట్లు చూడాలన్నారు. భూ భారతి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతుందని, అందుకు కావల్సిన పత్రాలను కూడా సమర్పించాలన్నారు. ఏమైనా సందేహాలు, అపోహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ డిఎస్ వెంకన్న, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


# పర్యావరణాన్ని పరిరక్షించాలి

### అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ కమీషనర్ రవీందర్‌తో కలిసి మున్సిపల్ కా ర్యాలయంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ హితం కోసం పాటుపడాలన్నారు. తమ పు ట్టిన రోజు, పెళ్లి రోజు, పండగలు, శుభకార్యాలయాల రోజు తప్పక మొక్కలు నాటడడం అలవాటు చేసుకోవాన్నారు. మున్సిపల్ కార్యాలయం సందర్శించి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో కార్యకలాపాలను సమీక్షించారు. నిర్ణీత సమయంలో పన్ను లు వసూళ్లు జరగాలని, నిరంతరం త్రాగునీటిని క్లోరినేషన్ చేస్తూ సరఫరా సజావుగా కొనసాగించాలన్నారు. మురుగు కాలువలను శుభ్రపర్చాలని, ముడికి వాడలకు ప్రాధ్యానత ఇస్తూ పారిశుద్యాన్ని మెరుగు పరుస్తూ బ్లీ చింగ్ చేయించాలన్నారు. ఎల్లలేళలా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వీదిలైట్లు లేనిచోట ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదు వస్తే రిజిష్టర్‌లో నమోదు చేయాలని, రిజిష్టర్‌ల నిర్వాహణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌తో పాటు పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులను గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. నగరంపల్లి గ్రామంలో 32 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ నగరంపల్లిలో మొత్తం 400 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హత కలిగి న కుటుంబానికి ఆశ్రయంతో కూడిన ఇంటిని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 20వ తేది వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ భూమికి సంబంధించిన సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ప్రతి దరఖాస్తు లెక్క పక్కాగా ఉండేలా రిజిస్టర్ లో నమోదులు చేయాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలను పూరెస్టు ఆఫ్ ది పూర్ లబ్ధిదారులను ఎంపిక చేసిఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని తెలిపారు. ఇందిర మ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మాణం చేపట్టాలన్నారు. కోట గుళ్ళు గణపేశ్వరాలయంలో రూ. 234 లక్షలు, గణపసముద్రంలో రూ.1128 లక్షలతో కాటేజీలు, బోటింగ్, రెస్టారెంట్ తో సహా వివిధ అభివృద్ధి పనుల కు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఒ భాస్కర్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ కన్నబోయిన కుమార్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ ఎంపిపి కాబట్టి రజిత రవీందర్, మాజీ వైస్ ఎంపిపి అశోక్, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, ఆప్షన్ మెంబర్ చోటేమియా సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం

# ఖరీఫ్‌కు సన్నాహాలు..



## సేంద్రీయ పద్ధతులు మేలు..

మట్టిలో పోషకాల వినియోగాన్ని మెరుగు పరిచే సాగు పద్ధతులు చేపట్టాలి. ముఖ్యం గా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ద్వారా మట్టిలో జీవక్రియలు, పోషకాల సమతుల్యత పెరుగుతుంది. అంతర పంటలు, మిశ్రమ పంటలు: ఒకే భూమిలో పలు రకాల పంటలు లేదా అంతర పంటలు సాగు చేయడం వల్ల మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యం గా వినియోగం అవుతాయి. పంట మార్పిడి: ఒకే పంటను పదే పదే సాగు చేయకుండా, వేర్వేరు పంటలను మార్పిడి చేయడం వల్ల మట్టిలోని పోషకాల వినియోగం సమతుల్యం అవుతుంది. పంట అవశేషాలను నేలపై మల్చింగ్ చేయడం ద్వారా మట్టిలో పోషకాలు పెరుగుతాయి. ఈ పద్ధతులు మట్టిలో పోషకాలను సమతుల్యం చేసి, మట్టిని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

ఒకే పంటను పదే పదే సాగు చేయకుండా, వేర్వేరు రకాల పంటలను మార్పిడి చేయడం ద్వారా మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యంగా వినియోగం అవుతాయి. సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు వాడటం: మట్టిలో జీవక్రియను, పోషకాల సమతుల్యతను మెరుగుపరుస్తుంది. అంతర పంటలు, మిశ్రమ పంటలు సాగు చేయడం: ఒకే భూమిలో పలు రకాల పంటలు లేదా అంతర పంటలు సాగు చేయడం వల్ల మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యంగా వినియోగం అవుతాయి. మట్టిని పరీక్షించుకోవడం: మట్టిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని, అవసరమైన ఎరువులు మాత్రమే వేసుకోవాలి. నీటి నిర్వహణ విషయంలో జాగ్రత్తలు అవసరం. అధిక నీరు లేదా నీటి కొరత వల్ల మట్టిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. తగినంత నీరు ఇవ్వాలి. ఈ జాగ్రత్తలు

దేశ వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ పంటకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. తొలకరి సీజన్‌లో నేల దున్నడం అన్నది రైతులు పొలం సిద్ధ చేసే అతి ముఖ్యమైన దశ. ఇప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, పంటల పెంపుదలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కాబట్టి, దున్నేటప్పుడు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందులో భూయాజమాన్యం మొదటి అడుగు. ఖరీఫ్ జూన్ నుంచి అక్టోబర్ మాసం వరకూ కొనసాగుతుండగా, అత్యధిక ప్రాంతాల్లో మే మాసం నుంచే భూయాజమాన్యం మొదలైంది. భూమి రకం (రేగడి, ఎర్రటి, నల్ల) అనుసరించి దున్నే పద్ధతులు మారతాయి. మట్టిలో తేమ శాతం, మిహెచ్ స్థాయి వంటి అంశాలను పరిశీలించాలి. గడ్డి, కలప, రాళ్ల వంటి అడ్డంకులను తొలగించాలి. వర్షం మొదలవగానే దున్నకుండా, మట్టిలో తేమ కొంత శాతం ఉన్నప్పుడు మాత్రమే దున్నాలి. చాలా తడిగా ఉండే మట్టిని దున్నితే మట్టి గడ్డలుగా మారి నష్టపరుస్తుంది. అదే విధంగా బాగా ఎండిపోయిన భూమిని దున్నితే మట్టిలో తేమ తగ్గుతుంది. కాబట్టి, దున్నే సమయంలో నేల తీరును జాగ్రత్తగా పరిశీలించాలి. వ్యవసాయ క్షేత్రాలను దున్నడానికి సరైన యంత్రాలు లేదా ఎద్దులు ఉపయోగించాలి. ట్రాక్టర్ వాడితే జాగ్రత్తగా నడిపించాలి. అవసరాన్ని మించి లోతుగా దున్నకూడదు. దున్నే పరికరాలు బాగుండేలా చూసుకోవాలి. సాధారణంగా 6–9 అంగుళాల లోతుగా



దున్నడం సాధారణంగా సరిపోతుంది. ఎక్కువ లోతుగా దున్నితే నేలలోని జీవకణాలు పాడవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముందుగా క్షేత్రం అంచుల దిశగా దున్నాలి. తరువాత అడ్డంగా లేదా చుట్టుకొలతగా దున్నడం మంచిది.. అప్పుడు నీటి ప్రవాహం సులభతరం అవుతుంది. దున్నే సమయంలోనే జీవామృతం లేదా సేంద్రీయ గోమయ మిశ్రమం చల్లాలి. ఎందుకంటే, ఈ చర్య వల్ల నేల ఉప్పెన స్థాయి తగ్గుతుంది. ఇది మట్టిలో సూక్ష్మ జీవుల పెరుగుదలకు దోహదం చేస్తుంది. నెమ్మదిగా గడ్డల్ని నలిపేలా దున్నాలి. నేల గడ్డలు చిన్నచిన్న ముక్కలుగా మారేలా చూసుకోవాలి. అవసరమైతే రెండోసారి దున్నాలి. పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి, మట్టికి సేంద్రీయ పురుగు మందులు మిశ్రమం చేయాలి. ఖరీఫ్ పంటలు వేసే సమయం దృష్టిలో పెట్టుకుని దున్నడం జరగాలి. ఆలస్యమైతే విత్తనాల నాటే సమయం పోతుంది. ఎక్కువ వర్షపాతం నమోదైన తర్వాత దున్నకూడదు. ఒకసారి బాగా తడిగా ఉన్న మట్టిని మరోసారి తడిగా ఉండగానే దున్నితే మట్టిపంటలు దెబ్బతింటాయి. ఈ జాగ్రత్తలన్నింటిని పాటిస్తే, భూమి ఆరోగ్యంగా ఉండి మంచి దిగుబడి సాధించవచ్చు.

## నీటి ఆదా..

డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్) పద్ధతిని పాటిస్తే నీరు ఆదా అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. డిఎస్ఆర్ పద్ధతిలో వరి విత్తనాలను నేరుగా పొలంలో నాటుతారు, నర్సరీలో నాటుల పెంపకం చేసి మళ్ళీ పొలంలో నాటే ప్రక్రియను నివారిస్తారు. ఈ పద్ధతి ద్వారా సాంప్రదాయ సాగుతో పోల్చితే 30 నుంచి 35 శాతం నీరు ఆదా అవుతుంది. ఎందుకంటే.. సాంప్రదాయ పద్ధతిలో నర్సరీ పెంపకానికి అదనపు నీరు అవసరమవుతుంది. డిఎస్ఆర్ పద్ధతిలో పొలాలు నీటిలో మునగవు. నేల తేమ సంరక్షణతో తక్కువ నీటితో పంట సాగు చేయవచ్చు. ఈ పద్ధతి భూగర్భజలాలు నిరంతరం తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితులలో నీటి కొరతకు శాశ్వత పరిష్కారంగా ఎదుగుతోంది. అయితే, ఈ పద్ధతిలో కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడం, అధిక ఉష్ణోగ్రతల వద్ద విత్తనాల అంకురోత్పత్తి తగ్గడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. డిఎస్ఆర్ విధానం వాతావరణంపై సానుకూల ప్రభావాలు చూపుతుంది. ఈ పద్ధతిలో నీటి వినియోగం తగ్గడం వల్ల భూగర్భజలాలు రక్షిణ సాధ్యమవుతుంది. అలాగే, పొలాలను పూర్తిగా నీటితో ముంచకపోవడం వల్ల మెథేన్ వాయువు ఉద్గారం (గ్రీన్‌హౌస్ వాయువు) తగ్గుతుంది. ఇది గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. నీటి ఆదా, తక్కువ ఉద్గారాలు కలిగి ఉండటం వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడంలో ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.



పోషకాల నిల్వ, వినియోగం, స్థిరత్వానికి సహాయపడుతుంది. తగిన నీటి నిర్వహణతో పొలంలో ఫసిలిటేటెడ్ పోషకాల నిల్వలు సాధ్యమే. నీరు సరైన పరిమాణంలో ఉంటే,

## పోషకాల సమతుల్యత కోసం జాగ్రత్తలు...

పాటిస్తే మట్టిలో పోషకాల సమతుల్యతను కాపాడుకోవచ్చు, పంట దిగుబడులు మెరుగుపడతాయి. తగినంత నీరు అందించటం వల్ల మట్టిలోని పోషకాలు మొక్కలకు సమర్థవంతంగా అందుతాయి. అధిక నీరు పోషకాలను మట్టిలో నుంచి కడిగి తీసుకెళ్లి పోషకాల లోపాన్ని కలిగించవచ్చు; తక్కువ నీరు వల్ల మొక్కలు పోషకాలను గ్రహించలేవు. నీటి నిర్వహణ ద్వారా మట్టిలో తేమ స్థాయి సమతుల్యం ఉండి, పోషకాలు మొక్కలకు అందుబాటులో ఉంటాయి. ఈ విధంగా, తగిన నీటి నిర్వహణ పంట



మట్టిలోని పోషకాలు మొక్కలకు సులభంగా అందుబాటులో ఉంటాయి, రూట్ అభివృద్ధి మెరుగవుతుంది, ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలు బాగా గ్రహించగలుగుతాయి. నీటి కొరత వల్ల లేదా అధిక నీరు వల్ల పోషకాల లభ్యత తగ్గిపోతుంది, అందువల్ల తగిన నీటి నిర్వహణ ద్వారా మట్టిలో పోషకాల నిల్వలు స్థిరంగా ఉండేలా చేయవచ్చు.

## ఆర్థిక వ్యవస్థకు కీలకం...

దేశంలో వ్యవసాయ భూమి, పంట ఉత్పత్తి, ఆధార పడిన జనాభా వంటి అంశాలపై అధికారిక గణాంకాలు సాధారణంగా ప్రభుత్వం, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఒ), ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) నివేదికలు వెల్లడిస్తాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, భారతదేశంలో వ్యవసాయం ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఎంతో కీలక భూమిక పోషిస్తున్నది. దేశంలో దాదాపు 60 శాతం భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. ప్రపంచంలో అత్యధిక వ్యవసాయ భూమి ఉన్న దేశాల జాబితాలో భారత్‌కు చోటు దక్కింది. అయితే, దేశ విస్తీర్ణంలో వ్యవసాయ యోగ్యమైన భూమి శాతం పరంగా పలు దేశాల కంటే వెనుకబడింది. కాగా, దేశ జనాభాలో దాదాపు 60 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. విస్తారమైన దేశం కాబట్టి, భారతదేశం ప్రపంచంలోనే ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఉత్పత్తి చేస్తుంది. హరిత విప్లవం, ఆధునిక



యంత్రాలు, మద్దతు ధరలు, పరపతి సౌకర్యాలు వంటివి వ్యవసాయ ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. కాగా, ఇటీవల కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు, దిగుబడికి సంబంధించి కొన్ని కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 1950 దశకాల నుంచి హరిత విప్లవం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన విత్తనాలు, యంత్రీకరణ వల్ల ఆహార ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఉదాహరణకు, వరి, గోధుమల అదనపు ఉత్పత్తి 5 కోట్ల టన్నుల నుండి 50 కోట్ల టన్నులకు చేరింది. కానీ, అమెరికా, చైనా వంటి దేశాలతో పోలిస్తే భారతదేశంలో దిగుబడి రేటు తక్కువగానే ఉంది. ఇది యాంత్రీకరణ, సాంకేతికత, నీటిపారుదల, భూమి నాణ్యత, ఛిన్నాభిన్న భూముల వల్ల ఎక్కువగా ఉంది. ప్రెసిషన్ వ్యవసాయం, డ్రోన్లు, స్మార్ట్ ట్రాక్టర్లు, ఐఓటి, కృత్రిమ మేధస్సు (ఎఐ) వంటి సాంకేతికతలు వ్యవసాయ ఉత్పాదకతను, నాణ్యతను పెంచుతున్నాయి. వాతావరణ మార్పు, కొరవడిన నీటి లభ్యత, భూమి క్షీణత వంటి సమస్యలు వల్ల సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులు, బీడు భూములు పునరుద్ధరణ, సరైన ఎరువులు, పురుగుమందుల వినియోగం ముఖ్యమైనవిగా మారాయి. దేశంలో చాలా మంది రైతులకు చిన్నచిన్న కమతాలు ఉండడం వల్ల ఉత్పాదకత, ఆదాయం తక్కువగా ఉంది. సంక్షిప్తంగా, భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం పరిమాణంలో పెరుగుతున్నాయిగానీ, దిగుబడి రేటు, సుస్థిరత్వం, సాంకేతిక మార్పులు, భూమి సమస్యలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

## సిపిఐ, గీత పనివారల సంఘం నేత

# పోగుల శ్రీనివాస్‌గౌడ్ మృతి



**కొరవి :** సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్యంతో మరణించారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం కొరవి మండలం రాజోలు గ్రామంలో గురువారం జరిగాయి. పోగుల శ్రీనివాస్ భౌతిక కాయానికి సిపిఐ మహబూబాబాద్ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు అజయ్ సారథిరెడ్డి , నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు నక్క నాగార్జున గౌడ్, గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు గౌడ్, ఖమ్మం జల్లా ఉపాధ్యక్షులు బంధం నాగేశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌గౌడ్ మృతికి బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా, హైదరాబాద్‌లోని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డిజి.సాయిలుగౌడ్, నాయకులు బి.నాగభూషణం, కెవిఎల్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్‌లు నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పోగుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.



## జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఈనెల 8న జరిగే సిపిఐ సూర్యాపేట జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో కామ్రేడ్ ధర్మబిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి సిపిఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. రైతు కూలీ కార్మిక సమస్యల పరిష్కారానికి సిపిఐ ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్, గన్న చంద్రశేఖర్‌లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు చామల అశోక్‌కుమార్, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, ఎండి పాషా, నిమ్మల ప్రభాకర్, పెంద్రకృష్ణ, దేశగాని హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆపరేషన్ కగార్’ నిలిపివేయాలి

### మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి
### వామపక్ష పార్టీల డిమాండ్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేయాలని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, బందు సాయిలు డిమాండ్ చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సిపిఐ, సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులతో చర్చలు జరిపిన ప్రభు త్వం అసమానతల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులను అతి కిరాతకంగా ఎన్‌కౌంటర్ పేరుతో చంపడం దుర్మార్గం అన్నారు. కేంద్రప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని మావోయిస్టులతో శాంతిచర్చలు జరిపి జన జీవన స్రవంతిలో కలిసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్రప్రభుత్వం అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే మావోయిస్టులను అంతం చేయాలని చూస్తుందన్నారు. ఆపరేషన్ కాగర్ పేరుతో మావోయిస్టులను అంతం చేయాలనే దురుద్దేశంతో బిజెపి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. మావోయిస్టులు దేశ పౌరులేనని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి వారిని చంపడం ఏం టని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో వామపక్ష నాయకులు సోతుకు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజు సతీష్, వెలిశెట్టి రాజయ్య నేరెళ్ల జోసెఫ్ మాతంగి రామచందర్, శేఖర్, పొన్నగంటి లావణ్య, గోమాత, శ్రావణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో సూపర్‌డెంట్ షఫియోద్దీన్‌కు ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు అవుతున్నా ఇంతవరకు ఉద్యోగులపై దృష్టి పెట్టలేదని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఎన్ఎహెచ్‌ఎం జిల్లా ఉపాధ్యక్షుడు ముస్తక్, సంగీత తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల వలయంలో సర్కారు బడులు

### విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి
### ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి : డిఇఒలకు ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. గురువారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు18 నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేయలేదని విమర్శించారు. జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కానునందున సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. విద్యార్థులను వంచించడంలో టిఆర్ఎస్ కాంగ్రెస్‌కు పెద్ద తేడా లేదని విమర్శించారు. రానున్నది వర్షాకాలమని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొన్ని బిల్డింగ్స్ శిధిలావస్థలో ఉన్నాయని, అలాంటి పాఠశాలల బిల్డింగ్స్‌ను గుర్తించి డిస్మెంటల్ చేసి నూతన భవనాలు నిర్మించాలన్నారు. తరగతులకు అనుగుణంగా టీచర్స్‌ను నియమించాలని, పాఠశాలలో పరిశుభ్రత కోసం స్కావెంజర్స్‌లను నియమించాలని, కొన్ని పాఠశాలలకు ప్రహరి గోడలు, కిటికీలకు జాలీలు, కరెంటు సదుపాయం, లేదా వాటర్ సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం లేని పాఠశాలలు కూడా జిల్లా కేంద్రంలో ఉన్నాయని తక్షణమే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సమస్యలు పరిష్కరించాలన్నారు.



హనుమకొండ..

**హనుమకొండ టౌన్ :** ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విద్యాశాఖ, ప్రభుత్వం విఫలమైందని ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో డిఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు బుర్ర రాజుకుమార్, కొండ చరణ్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం కోరారు. గురువారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

**కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఇఒ మొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, మచ్చ పవన్, సాయి, వినయ్ తదితరులున్నారు.



కరీంనగర్..



నిజామాబాద్..



వరంగల్..

## పేద ప్రజల పక్షాన పోరాటాలు

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి విలాస్



**ప్రజాపక్షం/బైంసా :** కార్మిక, రైతు, పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పేర్కొన్నారు. గురువారం సిపిఐ బైంసా మండల మహాసభ పెండారి ముత్యం అధ్యక్షత జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా విలాస్ హాజరై మాట్లాడుతూ కార్మిక వర్గం రైతు వర్గం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేసి అనేక హక్కులను సాధించడం జరిగిందన్నారు. దున్నే వాడిదే భూమి, బ్యాంకుల జాతీయ కరణ, రాజభరణాల రద్దు సిపిఐ ఆలోచన పరంగానే జరిగిందన్నారు. పనికిహారం పథకం, అటవీ హక్కుల చట్టం ఇన్ఫర్మేషన్ యాక్ట్ భవన నిర్మాణం సంక్షేమ చట్టం సిపిఐ పోరాటం వల్లే వచ్చాయన్నారు. సిపిఐ నిర్మల్ జిల్లా మహాసభలు జూలై6న నిర్మల్‌లో జరుగుతాయన్నారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు, చాడా వెండటరెడ్డి, కలవేని శంకర్ ముఖ్య అతిథులుగా హాజరు అవుతారన్నారు. అనంతరం మహాసభలో 13 మంది కౌన్సిల్, 7 గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. టి.ప్రకాష్ మండల కార్యదర్శి, పిముత్యం మండల సహాయ కార్యదర్శి, కోశాధికారిగా బాన్సదే శివాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వందన సమర్పణతో మహాసభ ముగిసింది.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

ప్రజాపక్షం/అల్లాదుర్గం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో భాగంగా మండలంలోని సీతా నగర్ గ్రామంలో గురువారం నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం నాగేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్న భూభారతి సదస్సులో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. భూభారతిలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ



సందర్భంగా సీతానగర్ గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య ఎంపీడీవో చంద్రశేఖర్ కార్యదర్శి అనిత ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలువాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. రుద్రూర్ మండలం రాణంపల్లి, సాలూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా ? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదుతో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని సంబంధిత రిజిస్ట్రర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్‌లను, రిజిస్ట్రర్లలో వివరాలు రాయాలని సూచనలు



చేశారు. సమస్యల వారిగా అర్జీలను విభజిస్తూ పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. జూన్ 20 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తును స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తు స్వీకరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారునికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు హితవు పలికారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని దీనిని దృష్టిలో పెట్టుకుని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహాతో, సంబంధిత రెవెన్యూ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## చెక్‌డ్యామ్ కూల్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



టిపిజెఎసి చైర్మన్ ఆరేపల్లి విజయ్ కుమార్..

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : వేసవి కాలంలో నిర్మల్ పట్టణంలో ఏర్పడే నీటి ఎద్దడి నివారణకు గాను సాకెర గ్రామ శివారులో ప్రభుత్వం చెక్ డ్యామ్ నిర్మాణం చేపటింది.ఈ చెక్ డ్యామ్ నిర్మాణం వలన ఎండాకాలం నిర్మల్ పట్టణంలో నీటి కరువు తీరడంతో పాటుగా సాకెర పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు పుష్కలంగా పెరిగాయి.అంతే కాకుండా పరిసరాల రైతులకు పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.ఇన్ని రకాలుగా ప్రజలకు ఉపయోగకంగా ఉండే ఇట్టి చెక్ డ్యామ్ ను అధికారులు అకారణంగా కూల్చి వేయడం క్షమించరాని నేరం అంటూ నిర్మల్ జిల్లా తెలంగాణ ప్రజా జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మన్ ఆరేపల్లి విజయ్ కుమార్ తెలిపారు. అధికారుల ప్రమేయం ఉన్నట్లైతే వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని,క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.సాకెర చెక్ డ్యామ్ పరిశీలనలో వీరితో పాటు మాస్ లైన్ నాయకులు రాజన్న, రామలక్ష్మ ణ్, బక్కన్న, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన సబ్ కలెక్టర్



ప్రజాపక్షం/ బోధన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహాతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి స్తే మానవ మనుగడకు స్వచ్ఛమైన గాలి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాలొన్నారు.

## రెవెన్యూ సదస్సులు జాయింట్ కలెక్టర్ నగేష్

ప్రజాపక్షం/రేగోడ్ : మండల లో జగ్యిరాల గ్రామంలో జరుగుతున్న రైతుల భూముల సమస్యలను పరిష్కరిండానికి భూభారతి రెవన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మెదక్ జాయింట్ కలెక్టర్ నగేష్ అన్నారు గురువారం రెవన్యూ సదస్సును పరిశీలించారు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దత్తారెడ్డి ఆర్ ఐ ఫీరోజ్ విజయలక్ష్మి సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన విద్యార్థులు 2025 26 సంవత్సరాలుగాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3,5,8 తరగతిలో ప్రవేశం కొరకు జూన్ తొమ్మిదో తారీఖు నుండి 17వ తారీఖు వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని గిరిజన శాఖ అధికారి అంబాజీ తెలిపారు.దరఖాస్తు చేసుకునేటప్పుడు కుల ధ్రువీకరణ పత్రము ఆదాయము బోనఫైడ్,ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండవలెనని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.ఈనెల 20వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటల నుండి నిర్మల్ సమీకృత జిల్లా కార్యాలయంలో ఎంపిక జరుగుతుందన్నారు.దరఖాస్తు చేసుకొని వారి ఆశిక్ ఆదాయం గ్రామీణ ప్రాంతం 1,50,000 పట్టణానికి చెందినవారు రెండు లక్షల రూపాయలకు మించి ఉండరాదని పూర్తి వివరాలకై గిరిజన అభివృద్ధి అధికారి నిర్మల్ కార్యాలయంలో సంప్రదించాలి అన్నారు.

## కూచిపూడి నృత్య కళాకారిణికి కలెక్టర్ అభినందనలు




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా చిలకలూరిపేట కళా నిలయంలో జరిగిన 40వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ సంగీత నాట్య కళారూపాల పోటీలలో పాల్గొని 10 సంవత్సరాల వయస్సు లోపు కూచిపూడి నృత్య విభాంలో 'తరంగం' నృత్య ప్రదర్శనకు గాను 'ప్రత్యేక జ్యూరీ నాట్య మయూరి అవార్డు' ఇందూరి జిల్లావాసి అయిన తేలి విభశ్రీ స్వంతం చేసుకుంది. నగరంలోని కరణం శ్రీనివాస్ నాట్య తరంగిణికి కళాశాలలో ప్రత్యేక నృత్యం అభ్యసించింది. తరంగం ప్లేటుపై నిలబడి తలై చెంబుతో 'కృష్ణం కలయ సఖి' నృత్యాన్ని చేస్తూ ప్రేక్షకులను అబ్బురపరుస్తూ కళా నిలయం చిలకలూరిపేటలో ప్రశంసలు పొందినది. చిన్నారి విభశ్రీ ఇటు శాస్త్రీయ నృత్యాన్ని పాశ్చాత్య నృత్యాన్ని రెండు కళల్ని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి...

ప్రజాపక్షం / బాన్సువాడ : పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని బాన్సువాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాన్సువాడ కోర్టు ఆవరణలో జడ్జి టిఎస్పి భార్గవి న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి హబీబ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఏజిపి లక్ష్మి నారాయణ మూర్తి, న్యాయవాదులు భూషణ్ రెడ్డి, దత్తాత్రేయ, ఆనంద్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాపక్షం/భైంసా : కుబీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ రైతులకు మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు.ఆయిల్ ఫామ్ నాటుకునే రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న రాహితీ(సబ్సిడీ) పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

సిపిఐ నాయకుడు చంద్రశేఖర్

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధమని, దానిని తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి ఐబి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మావోయిస్టులు తుపాకులు పక్కనపెట్టి శాంతి చర్చలకు వస్తామని, ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతున్నామని లేఖలు పంపినప్పటికీ, ప్రభుత్వం వారి విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని తెలిపారు. మావోయిస్టులు కోరుతున్న డిమాండ్లలో ఏవి సాధ్యమవుతాయి, ఏవి రాజ్యాంగబద్ధమైనవి, ఏవి రాజ్యాంగ విరుద్ధమైనవి అనే విషయాలపై నిజనిర్ధారణ కమిటీలు వేయకుండా ఆపరేషన్ కగార్ పేరుతో వారిని అణచివేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. గిరిజనులకు, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్ 5, 6కు సంబంధించిన ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని, అన్యాయం జరుగుతున్న పేదల పక్షాన నిలబడాలని మావోయిస్టులు కోరుతున్నారని గుర్తు చేశారు. మధ్య భారతదేశంలోని అటవీ సంపద మొత్తం ఆదివాసీలకు చెందాలని, కానీ ఆ సంపదను దోచుకోవడానికి వారిని అణచివేయడం దారుణమని మండిపడ్డారు. ఒక సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తితో ఎంక్వైరీ కమిషన్ వేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్



చేశారు. వారు తుపాకులు పక్కనపెట్టి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, రాజ్యాంగం చెప్పిన విధంగానే ముందుకు వెళ్తామని, లొంగిపోవడానికి కూడా సిద్ధమవుతున్నామని తెలుపుతున్న కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని దాటి వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి, శాంతియుత వాతావరణంలో సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు



కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రజాపక్షం/బోధన్ : రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేధికలుగా నిలువాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సాలూర మండల కేంద్రం, రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా..? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్‌లను, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేది వరకు అన్నీ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని అర్థమయ్యే రీతిలో తెలియచేయాలన్నారు. దరఖాస్తులను పదేపదే తిప్పించుకోకూడదన్నారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్ర స్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, రెవెన్యూ అధికారులు శశిభూషణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్కలు నాటిన ఎమ్మెల్యే హరీష్ బాబు

ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్' (ఒక మొక్క తల్లి పేరుతో) కార్యక్రమానికి సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు శ్రీకారం చుట్టారు. గురువారం కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో ఆయన తన మాతృమూర్తి, మాజీ ఎంఎల్ఏ పాల్వాయి రాజ్యలక్ష్మి తో కలిసి ఆకాశ మల్లె మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఈ వర్షాకాలం ప్రారంభంలో తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. భూమిపై ఉష్ణోగ్రతలను తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. మొక్కలు నాటడం కేవలం పచ్చదనాన్ని పెంచడమే కాకుండా, పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహనను కూడా పెంచుతుందని, తద్వారా పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు.



## మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఏలేటి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ పార్క్ లో స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### జిల్లా కేంద్రంలో నూతన ఆసుపత్రులను ప్రారంభించిన ఎమ్మెల్యే..

నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అరుణ్ రెడ్డి హాస్పిటల్, నవ్యక్లినిక్‌లను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,బీజేపి జిల్లా,పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...



అటవీశాఖ రేంజర్ విద్యాసాగర్

ప్రజాపక్షం/రామాయంపేట : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయాలని రామాయంపేట అటవీశాఖ రేంజర్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అక్కన్నపేటతొనిగండ్ల గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న పర్యాటక ఉద్యానవనంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రేంజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విదిగా మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అద్వర్యంలో సభ్యులు చేస్తున్న సేవానిరతిని కొనియాడారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్థుత తరుణంలో పర్యావరణ పరిరక్షణ కోసం యువతి, యువకులు ముందుకు వచ్చి మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ప్రదాన కార్యదర్శి సుబాష్ చంద్ర బోస్ మాట్లాడుతూ మనమందరం పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసినప్పుడు దానికంటు ఒక సార్థకత లబిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం పర్యావరణ దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మ న్‌యాదవ్ మాట్లాడుత సమాజంలో బాద్యత కలిగిన ప్రతి ఒక్కరు అడవుల రక్షణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అక్కన్నపేట అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ నిర్మూలణ, వన్యప్రాణుల సంరక్షణ, మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాదికారి డిజి శ్రీనివాసశర్మ, కామారెడ్డి జిల్లా రోటరి క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జయపాల్‌రెడ్డి, డిప్యూటి రేంజర్ గీత, అటవీశాఖ సిబ్బంది ఆశం కృష్ణ, లక్ష్మ ణ్, రామలీల, మహేష్, ప్రశాంత్, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామ్‌కుమార్‌తో పాటు విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## నియోజకవర్గాలలోని గ్రూప్ రాజకీయాలకు చెక్

ఎంపీ ధర్మపురి అరవింద్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంవత్సరానికి 70 లక్షలు కేటాయిస్తున్నందున జిల్లా పార్లమెంట్ పరిధిలో ఎంపీ ల్యాడ్స్ నిధుల విషయంలో ఇక నుంచి ఎంపీ ధర్మపురి అరవింద్ నిర్ణయమే ఫైనల్ కానుంది. ఎందుకంటే ఇటీవల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలే వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యేడాదికి 70 లక్షలు కేటాయిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ నియోజకవర్గాలలో పార్టీలో జరుగుతున్న గ్రూప్ రాజకీయాలతో ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల ప్రోసీడింగ్స్‌పై తన నిర్ణయాన్ని ఫైనల్ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎందుకంటే ప్రతిఅసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి స్థానిక అవసరాల నిమిత్తం నిధులను కేటాయించే పరిస్థితి ఉండేది. అయితే స్థానిక నాయకుల సిఫారసులకు ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గంలోని కీలకమైన ముఖ్య నాయకులు, మండలాల అధ్యక్షులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ముఖ్యమైన పనులకు నిధులు కేటాయిస్తూ ప్రోసీడింగ్ పత్రాలను ముఖ్య నాయకుల ద్వారా ఇచ్చే వారు ఈసారి కూడా మొదటగా అలాగే భవిష్యత్తులో తన ద్వారానే ప్రోసీడింగ్ పత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీలో గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లా పార్లమెంట్ పరిధిలో బీజేపీ బలోపేతం అవుతున్న తరుణంలో పార్టీలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఎంపీ ల్యాడ్ నిధుల కేటాయింపులు, వాటి ఖర్చు అభివృద్ధి నిధుల విషయం మొత్తం ఎంపీ అరవింద్ పర్యవేక్షణకు సిద్ధమైనట్లు అదేవిధంగా తన కార్యాలయ సిబ్బందికి సైతం ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను అదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమైన ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని,బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు.మలేరియా,డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా ప్రాధాన్యత గత ప్రాంతాల్లో డ్రెయిన్‌లు పూర్తిగా శుభ్రపరచాలని,నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని,పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలనీ ఆదేశించారు. అలాగే పాఠశాలలు,హాస్టళ్లు,అంగన్‌వాడీ కేంద్రాల పునః ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు బడి బాట కార్యక్రమం,చిన్న మరమ్మత్తులు,యూనిఫాం కట్టింపు,పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు.వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సిఈఓ గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి , అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గుంటి వేణు కుమారుడి వివాహ వేడుకకు కూనంనేని హాజరు



ప్రజాపక్షం/- రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్యదర్శి గుంటి వేణు కుమారుడి వివాహం గురువారం ఆవునూరు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ వేడుకలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు. వీరితో సిపిఐ రాష్ట్ర నాయకత్వం, పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఈవిఎం గోదాంను తనిఖీ

అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లా కేంద్రం కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ ఆర్డీవో కె.మహేశ్వర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్బంగా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎం గదుల వివిప్యాట్‌ల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పారీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ అలీ, టిడిపి ప్రతినిధి ఆగయ్య తదితరులున్నారు.

## శాలరీ ప్యాకేజీ కింద రూ.కోటి చెక్కు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పరందాములు కుటుంబానికి ఎస్బిఐ శాలరీ ప్యాకేజీ కింద కోటి రూపాయల ఇన్సరెన్స్ చెక్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అందేశారు. గత డిసెంబర్‌లో రోడ్డు ఫ్రమాదంలో మృతిచెందిన వర్కోలు పరందాములు కానిస్టేబుల్ స్టేట్ బ్యాంక్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద కోటీ రూపాయల చెక్కును పరందాములు కుటుంబ సభ్యులకు సిపి అనురాధ, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ మారుతిలు అందచేశారు. ఈసందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది వారి శాలరీ అకౌంట్‌ను పోలీసు శాలరీ ప్యాకేజీగా మార్చుకోవాలన్నారు. ఏదైన జరగరానిది జరిగితే కుటుంబం అర్థికంగా నిలదొక్కుకోవటానికి కొంత తోడ్పాటును అందిస్తుందన్నారు.జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది శాలరీ పోలీసు శాలరీ అకౌంట్‌లో మార్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చిన డబ్బులను పిల్లల భవిష్యత్తు చదువుల గురించి జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ 24 గంటలు విధులు నిర్వహించే పోలీస్ శాఖకు ఎస్‌బిఐ బ్యాంకు అండగా ఉంటుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్యాకేజీ శాలరీ కింద సంబధిత బ్రాంచ్‌కు వెళ్లినప్పుడు మూడు నెలల స్లీప్‌లు,ఆదార్‌కార్డు, పాన్ కార్డు, జిరాక్స్ కాపీలు తీసుకొని వెళ్లి అకౌంట్‌ను మారుచకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్బీ ఇన్స్‌పెక్టర్లు కిరణ్,శ్రీధర్, రిజర్స్ ఇన్స్‌పెక్టర్ ధరణి, ఎస్‌బిఐ రీజనల్ బ్యాంకు అధికారులు, సిబ్బంది, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/గోదావరిఖని:** ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి నేతృత్వంలో రామగుండం నగరపాలక సంస్థ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, ఎన్‌టిపిసి, ఆర్‌ఎఫ్‌సిఎల్, అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలు, జిపిపిపిజి స్వచ్ఛంధ సంస్థలతో కలిసి సంయుక్తంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి కోదండ రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని హాని చేసే ప్లాస్టిక్ వాడకూడదన్నారు. చెట్లను పెంచాలన్నారు. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బట్టతో చేసిన పర్యావరణ హిత సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బిక్షపతి, నగరపాలక డిప్యూటి కమిషనర్ నాయిని వెంకటస్వామి, సింగరేణి అధికారి డెనిల్‌కుమార్, వి.శుక్లా, ఎన్‌టిపిసి అధికారి కెవి.రావు, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 3 నెలల పసికందు మృతి



**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు జాతీయ రహదారిపై గురువారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో 3 నెల ల పసికందు మృతి చెందాడు. స్థానిక ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్ నుండి ఏర్టిగా కారులో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు హుజూరాబాద్ లో ఉన్న తమ బంధువుల పెళ్లికి బయలుదేరారు.మార్గ మధ్యంలో జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారి మార్గ మధ్యలో కొండగట్టు పంచముఖ ఆంజనేయ స్వామి గుడి దగ్గరల్లో ఉదయం 4 గంటలకు ఎదురుగా మామిడి కాయల లోడ్ తో కరీంనగర్ నుండి మహారాష్ట్ర వెళుతున్న డిసిఎం వాహనం ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో కారు లో ప్రయాణిస్తున్న 3 నెలల పసికందు మృతి చెందగా,మిగతా వారు తీవ్ర గాయాలవటంతో చికిత్సకోసం108 లో ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వారిలో నవ వరుడు ఉండడంతో జరగాల్సిన పెళ్లి ఆగిపోవడం తో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.సంఘటనలో కారు ముందు భాగం దెబ్బతిన్నాయి.పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పురుగు మందుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలి
ప్లాస్టిక్ వినియోగిస్తే తీవ్ర అనారోగ్యం
పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలి
కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి కాపాడుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం మానకొండూర్ మండలం లలితాపూర్ పంచాయతీ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరం ఉండాలని కోరారు. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంట చేతికి వచ్చిన తర్వాత వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలన్నారు. పురుగుల మందుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలన్నారు. పచ్చని భూమి, స్వచ్ఛమైన గాలి, అందరికీ మంచినీరు పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమన్నారు. ప్రకృతి రక్షణకు మొక్కలు నాటి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు.

**మాప్లిన్నాంగ్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి**

మొక్కలు నాటి పరిశుభ్రత పాటిస్తున్నందుకు మేఘాలయ రాష్ట్రంలోని మాప్లిన్నాంగ్ గ్రామం ఆసియా ఖండంలోనే పరిశుభ్రమైన గ్రామంగా నిలిచిందన్నారు. ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని పరిశుభ్రత పాటిస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం పర్యావరణ రక్షణ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి కిషన్ స్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రైతుల ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి**

భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన భూమి ధరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్‌డెస్క్, ధరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు తెలుసుకున్నారు. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి ధరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్య పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంధర్భంగా ఒక రైతు తన భూసమస్య గురించి చెప్పుకోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఇటీవల జరిగిన సిపిఐ జిల్లా మహాసభలో నూతనంగా సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పంజాల శ్రీనివాస్‌ను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి పరిచయం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను పంజాల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పంజాల శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే చురుకైన వాడని, విద్యార్థి, యువజన రంగాలలో పనిచేసి పార్టీలో జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రజాసమస్యలపై అధికారులను కలిసినప్పుడు స్పందించాలని కలెక్టర్‌ను వెంకట్‌రెడ్డి కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** విద్యార్థుల విద్య సామర్థ్యాల పెంపునకు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓ లు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం రోజున పెద్దపల్లి అమర్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర లో జరిగిన కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఎంఈఓల వర్క్‌షాప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12వ తారీకు నుండి విద్యా సంవత్సరం మొదలవుతుందని, కావున పాఠశాల ప్రారంభం నుండే విద్యార్థుల యొక్క అభ్యాసన సామర్థ్యాలను పెంచడంలో ప్రతి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హెడ్మాస్టర్, ఎంఈఓలు అందరూ కూడా వృత్యంత్ర శిక్షణ పొంది ఉన్నారని, కావున బోధన నైపుణ్యాలను మెరుగు పరుచుకొని ప్రతి విద్యార్థి యొక్క బోధన సామర్థ్యాలను పెంచాలని గత సంవత్సరం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్ అంత్య పరీక్షలో 69% అచీవ్మెంట్ పొందడం జరిగిందని, ఈసారి విద్యార్థులు ధారాళంగా చదవడంలో అర్థం చేసుకొని రాయడంలో మరియు గణిత సామర్థ్యాలను చాలా చక్కగా చేయడంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు మరియు ఎంఈఓ లు ప్రతినెల జరిగే కాంప్లెక్స్ సమావేశాలలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 85% అచీవ్మెంట్ ప్లానింగ్ చేసుకోవాలని దీనికి అన్ని విధాలుగా జిల్లా విద్యాశాఖ సహాయ సహకారాలు అందిస్తుందని, ప్రతినెల సందర్శించిన పాఠశాలలో సమీక్షలు నిర్వహించి ఎక్కడైతే సామర్థ్యాలు పెంచాలో అక్కడ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాధవి, ఏఎంఓ పిఎం షేక్ ,ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడివో వ్యవహారశైలిపై కలెక్టర్‌కు సిపిఐ శ్రేణుల ఫిర్యాదు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో ప్రవేశపెట్టిన మరో రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపికలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని చిగురుమామిడి మండల సిపిఐ శ్రేణులు గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. ఎంతో మంది అర్హులైన లబ్దిదారులు ధరఖాస్తు చేసుకున్నా ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఎంపికలు జరగలేదని, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు కలిసి ఎంపిడివో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. అసలు సిసలైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, అదే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం వర్తించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబానికి ఏ ఆసరా లేనటువంటి ధరఖాస్తుదారులను ఎంపిక చేయకుండా ఆర్థికంగా ఉన్న వారిని ఎంపిక చేయడం బాధాకరమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపిడివో వైఖరిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన లబ్దిదారులను గుర్తించి తగు న్యాయం చేసి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పిటిసి అందె స్వామి, సిపిఐ మండల శాఖ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ కలెక్టర్‌ను కోరారు.

## మూడు నెలల్లోగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు మూడు నెలల్లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన సిరిసిల్ల నియోజకవర్గంలోని ఆయా మండలాల లబ్ధిదారులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపేందుకు విచ్చేయగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ వీరితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. పేదలు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. మంజూరు పత్రాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. సిమెంట్, స్టీల్ ధరలు తగ్గించేలా ఏర్పాట్లు చేస్తుందని వివరించారు. నిర్మాణానికి డబ్బులు లేని మహిళా సంఘాల సభ్యులకు గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా పట్టణాల్లో మెప్మా ద్వారా రూ.లక్ష రుణం అందిస్తామని, అందిస్తామని తెలిపారు. త్వరితగతిన ఇండ్లు మొదలు పెట్టాలని సూచించారు. బేస్మెంట్, ఇతర దశలు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డ్ ఆఫీసర్లతో ఫోటో తీయించి, అప్లోడ్ చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌లు, మహిళలు పాల్గొన్నారు.

## అధిక దిగుబడినిచ్చే పంట రకాలను సాగు చేయాలి




**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** రైతులు పంట చేలు ప్రారంభదశలోనే వ్యవసాయ అధికారుల సలహాలు,సూచనలు పాటించాలని ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల, కిష్టసాగర్ గ్రామాలలో పర్యటించి రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంటలో అధిక దిగుబడి నిచ్చే రకాలైన, కెఎన్‌ఎమ్ 1638, ఆర్‌ఎన్‌ఆర్ 15048, జెఎల్‌జి 24423, కెఎన్ఎమ్ 118, ఆర్ఎన్ఆర్ 28361 సాగు చేయాలని తెలిపారు. వరి పంటను నష్టపరిచే కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణ యాజమాన్య పద్దతులను అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రసాయన ఎరువులతోపాటు పచ్చిరొట్టె పంటలైన జిలుగ, జనుము, జీవన ఎరువులైన పిఎస్‌బి వాడుతూ అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. ప్రకృతి సేంద్రియ వ్యవసాయంలో జీవామృతం తయారీ విధానం గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయంలో యంత్రాల ఉపయోగం వలన కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా. ప్రతాప్‌రెడ్డి, సిఆర్‌ఐడిఎ శాస్త్రవేత్త డా.పుష్పజాలి, ఎన్‌ఎఎఆర్‌ఎం శాస్త్రవేత్త డా.శివరాం,ఎఇఒ మీరా, రైతులు తదితరులు పాల్గోన్నారు.

## మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించాలి

ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేను కలిసిన ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ గురువారం ఢిల్లీలో ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో పాటు ప్రధాన కార్యదర్శి సి. వేణుగోపాల్‌ను తెలంగాణ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూల తీర్పు వెల్లడించిన వెంటనే దేశంలో మొట్టమొదటగా తెలంగాణ రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదని పేర్కొంటూ ఈ సందర్భంగా మాదిగ సామాజిక వర్గం పక్షాన కాంగ్రెస్ అధిష్టానానికి ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 32.33 లక్షల మాదిగ జనాభా ఉందని, ప్రస్తుతం 50లక్షలకు పెరిగిన నేఫథ్యంలో అతిపెద్ద వర్గంగా గుర్తించి మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు తప్పకుండా చోటు కల్పించాలని ఖర్గే, వేణుగోపాల్‌లకు విన్నవించారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగ వర్గానికి తప్పకుండా న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్లూరితో పాటు ఎమ్మెల్యేలు సామేల్, సత్యనారయణ,యాదయ్య పాల్గొన్నారు.

## విప్లవాల గడ్డపై 'రైతు మహోత్సవం'





**ప్రజాపక్షం/అక్కన్నపేట/హుస్నాబాద్ ప్రతినిధులు:** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి(నేటి) 8 వరకు సిద్దిపేట జిల్లా విప్లవాల కంచుకోట హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతు మహోత్సవాన్నీ నిర్వహించనున్నారని సిద్దిపేట జిల్లా పాలనాధికారి మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు.హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో స్థానిక మంత్రి పొన్నం నేతృత్వంలో జరిగే మహోత్సవాన్నీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారని అన్నారు. ఈ రైతు మహోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్, తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొననున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పాత్రికేయ ఆహ్వానలేఖలో వెల్లడించారు. రైతాంగాన్నీ చైతన్య పరిచే వేదికగా వ్యవసాయ పరిశ్రమలోని విభిన్న రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఔత్సాహికులకు రైతు మహోత్సవం ఎంతగానో దోహదపడుతుంది. మెట్ట ప్రాంత రైతాంగ వరప్రదాయిని గౌరవెల్లి ప్రాజెక్టుతో ఈ ప్రాంత అన్నదాతల కల సాకారమవ్వాలనే దిశగా మంత్రి పొన్నం ప్రణాళిక వేస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల సంక్షేమంలో మంత్రి పొన్నం ఈ ప్రాంత శాసనసభ్యుడిగా తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ప్రభుత్వం ఒక్కోలా రైతాంగానికి పథకాల మార్పు తీసుకువస్తూనే వినూత్న రీతిలో రైతుల సంక్షేమ దిశగా పాలన సంస్కరణలు తీసుకువస్తుంటాయి. దీనిలో భాగంగానే రాష్ట్రంలోనే మెట్ట ప్రాంత హుస్నాబాద్ నియోజకవర్గాన్నీ నాడు పోరాటాల గడ్డగా కమ్యునిస్టుల విప్లవాలతో మార్మోగిన ప్రాంతాన్నీ నేడు రైతుల ముంగిల్లో జల సిరుల కల్పవల్లిగా ఈ ప్రాంతానికి వన్నె తెచ్చిన గౌరవెల్లి రిజర్వాయర్‌ను ప్రజాపాలనలో నైనా మంత్రి పొన్నం ప్రభాకర్ పూర్తి చేయించి కరువు సీమను సస్యశామలం చేయిస్తారని ఈ ప్రాంత రైతాంగం విశ్వసిస్తున్నారు. ఈ రైతు మహోత్సవంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం,జిల్లా పాలనాధికారి మనుచౌదరి కోరారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామ పరిధిలోగల సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. గురువారం ఆమె అడ్మిషన్ ప్రక్రియ వివరాలు వెల్లడిస్తూ....2025 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దీనికి ఇంటర్మీడియట్ పాస్ అయిన మహిళా విద్యార్థులు డిగ్రీ కొర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. కళాశాలలో బిఎస్సిలో ఎంఎస్‌సిఎస్,ఎంపిసి,ఎంపిసిఎస్,బిజడ్‌సి,ఎంజెడ్‌సి కోర్సులు, బికాంలో సిఏ,జనరల్, బిఎలో హెచ్ఇపి కోర్సులలో అడ్మిషన్ పొందుటకు అవకాశం ఉందన్నారు. పదవ తరగతి,ఇంటర్మీడియట్ మెమో,5పాస్ పోర్ట్ సైజ్ పోటోలు,2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ,కుల ధృవీకరణ పత్రాలు,ఆధార్ జిరాక్స్,ఇంటర్మీడియట్ టిసి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# క్రీడ

## పంజాబ్ కింగ్స్ నుండి ఆ ఐదుగురు ఔట్..!




ఐపిఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. అసాధారణ ప్రదర్శనతో 11 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన పంజాబ్ కింగ్స్ తృటిలో టైటిల్‌ను చేజార్చుకుంది. ఆర్‌సీబీతో జరిగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఫైనల్లో ఓడినా.. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, ఓ మ్యాచ్ రద్దుతో 19 పాయింట్స్ సాధించి టాపర్‌గా నిలిచింది.11 ఏళ్ల తర్వాత పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరడంతో పాటు టాపర్‌గా నిలవడం, ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ.. రికీ పాంటింగ్ కోచింగ్.. కుర్రాళ్ల ఫియర్‌లెస్ గేమ్.. పంజాబ్‌కు విజయాలను అందించాయి. టాపర్‌గా నిలిచిన ఆర్‌సీబీ జట్టు కొన్నిలోపాలు ఉన్నాయి. వాటిని పంజాబ్ సరిదిద్దుకునే ప్రయత్నం చేయనుంది. ఈ క్రమంలోనే ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు ఓ ఐదుగురు ఆటగాళ్లను వదిలేయనుంది.

### 1. గ్లేన్ మ్యాక్స్‌వెల్



ఐపీఎల్ 2025 మెగా వేలంలో గ్లేన్ మ్యాక్స్‌వెల్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 4.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. 7 మ్యాచ్‌లు ఆడి 8 సగటుతో 48 పరుగులే చేసి తుది జట్టులో చోటు కోల్పోయాడు. బౌలింగ్‌లో 13 ఓవర్లు వేసి 8.46 ఎకానమీతో 4 వికెట్లు తీసాడు. బెంచ్‌పై ఖాళీగా కూర్చోలేక గాయం సాకుగా చూపించి సీజన్ మధ్యలోనే వెనుదిరిగాడు. పంజాబ్ కింగ్స్‌కు భారంగా మారిన మ్యాక్స్‌వెల్‌ను వదిలేసి అతని స్థానంలో మరో స్పిన్ ఆల్ రౌండర్‌ను ఆర్‌సీబీ తీసుకునే ఛాన్స్ ఉంది.

### 3. యశ్ ఠాకూర్




భారత అనామక బౌలర్ యశ్ ఠాకూర్‌ను రూ. 1.60 కోట్ల భారీ ధరకు పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేయగా.. అతను రెండు మ్యాచ్‌లు ఆడి 12.15 ఎకానమీతో ఒక్క వికెట్ మాత్రమే తీసాడు. అతను పంజాబ్ కింగ్స్ ప్లెయింగ్ ఎలెవన్ కాంబినేషన్‌లో సెట్ అవ్వలేదు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో పేసర్‌ను వేలంలో కొనుగోలు చేసే అవకాశం ఉంది.

### 4. మిచెల్ ఓవెన్



ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్‌ను రూ.3 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్.. ఒకే ఒక్క మ్యాచ్‌లు అవకాశం కల్పించింది. కానీ అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత పూర్తిగా పక్కనపెట్టేసంది. పంజాబ్‌కు మిచెల్ ఓవెన్ సేవలు అవసరం లేదు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో ఆటగాడిని తీసుకునే ఛాన్స్ ఉంది.

### 2. గ్జెవియర్ బార్ట్‌లెట్



ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ అయిన గ్జెవియర్ బార్ట్‌లెట్‌ను పంజాబ్ కింగ్ రూ. 80 లక్షలకు కొనుగోలు చేసింది. అతను 4 మ్యాచ్‌లు ఆడి 9.60 ఎకానమీతో 2 వికెట్లు మాత్రమే తీసాడు. మెరుగైన ప్రదర్శన చేయక పోవడంతో తుది జట్టులో చోటు కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి ఐపీఎల్ 2026 మినీ వేలంలో మరో పేసర్‌ను పంజాబ్ కింగ్స్ తీసుకునే ఛాన్స్ ఉంది.

### 5. లాకీ ఫెర్గూసన్



ఐపీఎల్ 2025 మెగా వేలంలో లాకీ ఫెర్గూసన్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 4 మ్యాచ్‌లు ఆడి 9.18 ఎకానమీతో 5 వికెట్లు పడగొట్టాడు. కానీ ఆ తర్వాత అతను గాయంతో జట్టుకు దూరమయ్యాడు. లాకీ ఫెర్గూసన్ మెరుగైన ప్రదర్శన చేసినా.. ఫిట్‌నెస్ సమస్యలతో అతన్ని వదిలేయాని పంజాబ్ కింగ్స్ భావిస్తోంది.

## ముందే హెచ్చరించిన గౌతమ్ గంభీర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) విజయోత్సవ సంబరాలు విషాదంగా ముగిసాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం బయట చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది అభిమానులు స్టేడియం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిలాసట జరిగింది. ఈ అనూహ్య ఘటనతో ఆర్‌సీబీ సంబరం చిన్నబోయింది. ఈ దురదృష్టకర ఘటన నేపథ్యంలో విజయోత్సవ వేడుకలను ఉద్దేశించి గతంలో గంభీర్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 11 ఏళ్ల క్రితమే విజయోత్సవ వేడుకలపై గంభీర్ హెచ్చరించాడు. ఇలాంటి విజయోత్సవ వేడుకలను నిర్వహించాల్సిన అవసరం లేదని, అలాంటి వేడుకల్లో తాను భాగమవ్వనని తెలిపాడు. ఐపిఎల్ 2014 సీజన్‌లో గౌతమ్ గంభీర్ సారథ్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచింది. ఈ విజయాన్ని కేకేఆర్ సెలబ్రేట్ చేసుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించింది. అయితే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో అభిమానులు ఈడెన్ గార్డెన్స్‌కు తరలివచ్చారు. అభిమానులను కట్టడి చేసేందుకు పోలీసులు లాఠీ చార్జీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకున్నా.. అభిమానులపై పోలీసులు లాఠి చార్జీ చేయడంపై గంభీర్ ఆవేదనకు గురయ్యాడు. ఈ ఘటనపై హిందూస్తాన్ టైమ్స్ దినపత్రికకు రాసిన కాలమ్‌లో విచారం వ్యక్తం చేశాడు. భవిష్యత్తులో ఇలాంటి వేడుకల్లో పాల్గొనని పేర్కొన్నాడు.' కేకేఆర్ సన్మాన కార్యక్రమంతో కోల్ కతా ప్రజలకు కలిగిన అసౌకర్యం పట్ల నేను నిరాశ



చెందాను. భారత క్రి కెట్ అభిమానులు.. ఈ ఆటకు అత్య ంత ముఖ్యమైన వాటా దారులు. కానీ వారిని సరిగ్గా ట్రీట్ చేయలేదు. అమాయకులపై లాఠీ ఛార్జ్ జరిగింది. దేవుడి దయతో కెకెఆర్ టీమ్ ఎన్నో ట్రో ఫీలు గెలుస్తుంది. కానీ నేను మాత్రం ఇలాంటి సన్మాన కార్యక్రమాలతో పాటు విజయోత్సవ వేడుకల్లో పాల్గొనను'అని గంభీర్ తన కాలమ్‌లో ప్రస్తా వించాడు. తాజాగా ఆర్‌సీబీ విజయోత్స వేడుకల్లో తొక్కిసలాట జరగడంతో గంభీర్‌కు సం బంధిం చిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. విజయోత్సవ వేడుకలను పూర్తిగా రద్దు చేయాలని నెటిజన్లు కోరుతున్నారు.

# రీల్

## జూన్ 13న వస్తున్న 'కట్టప్ప జడ్జిమెంట్'



అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కట్టప్ప జడ్జిమెంట్'. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధుసూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్ తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధీరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హరీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.

## రోషన్ కనకాల గుర్రపు స్వారీ



ప్రముఖ యాంకర్ సుమ , రాజీవ్ కనకాల నటి వారసుడు రోషన్ కనకాల తెలు తెరపై సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నాడు. బబ్లుగమ్ సినిమాతో హీరోగా పరిచయం అయిన రోషన్ తదుపరి సినిమా కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచి సినిమా రంగంలో పెరిగిన రోషన్ ఎలాగైనా హీరోగా ఇండస్ట్రీ లో నిలదొక్కుకోవాలని కసరత్తు చేస్తున్నాడు. మరి రోషన్ రాజీవ్ కనకాల వారసత్వాన్ని నిలబెడతాడో లేదో వేచి చూద్దాం.

## పళని మురుగన్ ఆలయంలో 'సూర్య' పూజలు



తమిళ, తెలుగు ప్రేక్షకులకు ఎంతో సుపరిచితుడు అయిన నటుడు 'సూర్య'. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. తాజాగా సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ లో సూర్య సినిమా చేస్తున్నారు. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈనెల 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో తమిళ నాడు లోని పళని మురుగన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. లక్కి భాస్కర్ సినిమా ఫేం వెంకి అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు



## 8న 'లక్ష్మీ నరసింహా' రీ రిలీజ్ బాలయ్య ఫ్యాన్స్ కోసం కొత్త సాంగ్

నందమూరి బాలకృష్ణ టైటిల్ పాత్రను పోషించిన 'లక్ష్మీ నరసింహా'. జయంత్ సి పరాన్జి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2004లో విడుదలై అప్పట్లో సూపర్ డూపర్ హిట్ అయింది. ఇప్పుడు బాలకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా 8వ తేదిన లక్ష్మి నరసింహ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా కోసం కొత్త పాటు యాడ్ చేస్తున్నారు.మందేసినోడు మహానుభావుడు అనే పాటను చంద్రబోస్ తో రాయించి ఈ సినిమాలో అదనపు ఆకర్షణగా పెట్టారు. ఈ పాటకు భీమ్స్ సంగీతం అందించారు. ఈ సినిమాలో యాడ్ చేసిన కొత్త పాటను ప్రసాద్ ల్యాబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత చంద్రబోస్, దర్శకుడు జయంత్ సి పరాన్జి, నిర్మాత బెల్లంకొండ సురేష్, ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్న మౌనిక తదితరులు పాల్గొన్నారు




## ఆహాలో దుల్కర్ 'ఒక యముడి ప్రేమకథ' స్ట్రీమింగ్

సీతారామం, కల్కి, లక్కీ భాస్కర్ వంటి వరుస హిట్ చిత్రాలతో దుల్కర్ సల్మాన్ ఒక స్ట్రెట్ తెలుగు హీరోగా మార్కెట్ సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న తెలుగు చిత్రాలు ఒక్కొక్కటీ వంద కోట్లకు పైగా బడ్జెట్‌తో నిర్మాణం లో ఉన్నాయి. ప్రస్తుతం దుల్కర్, రాణా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మిస్తున్న 'కాంతా', స్వప్న సినిమాస్ నిర్మాణంలో రూపొందుతున్న 'ఆకాశంలో ఒక తారా' అనే రెండు తెలుగు ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు. దుల్కర్ సల్మాన్ నటించిన మలయాళ బ్లాక్‌బస్టర్‌ను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. . 'ఒరు యమండన్ ప్రేమకథ' చిత్రం, 'ఒక యముడి ప్రేమకథ' పేరుతో ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాను తెలుగులో భవాని మీడియా విడుదల చేయనుంది.

## సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా పర్యావరణ దినోత్సవాలు

మొక్కలు నాటిన సిటిజి వ్యవస్థాక అధ్యక్షుడు శ్రీనివాస్, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు





ప్రజాపక్షం/శేరిలింగంపల్లి; ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లోగురువారం పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిటి ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సిటిజి) వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్, సరోజ, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావు సారథ్యంలో 'సేంద్రీయ పంటల ద్వారా పండించిందే తిందాం తినేదే పండిద్దాం' అనే నినాదంతో సిఆర్ ఫౌండేషన్‌లో మొక్కలను నాటారు. లక్ష్మ ణ ఫలం, ఫ్యాషన్ ఫ్రూట్స్ మొక్కలు, వివిధరకాల కూరగాయల మొక్కలు, పూల మొక్కలతో పాటు మిరియాలు, ఆల్ స్పైస్, బిర్యాని ఆకు, మునగ చెట్లు, తమలపాకు, కరివేపాకు, ఇన్సులెన్, మల్టీ విటమిన్ ఆయుర్వేద మొక్కలు నాటారు. అనంతరం సిటిజి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 70,000 మందికి పైగా సభ్యులతో పురోగమిస్తున్న సిటిజి గత ఐదు సంవత్సరాలుగా ప్రతీ పర్యావరణ దినోత్సవం నాడు వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని విస్తరించే వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పాలిక్లినిక్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్ కూనంనేని రజనీ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోసభట్ల కల్పన, మహిళా సమాఖ్య నాయకులు శ్రీమతి వశ్య పద్మ, జ్యోతి, పడాల నళిని, సభ్యులు లలిత, రాజేంద్రరావు, డాక్టర్ గోపిచంద్, వెలెవోలు సాంబశివరావు, సిటిజి గ్రూపు సభ్యులు రమా, స్వాతి, కుసుమ, ధనలక్ష్మి, అఖిలాండేశ్వరి, మాధవి, పావని, అనిత, రాధ, శారద, సౌజన్య, శ్రీలక్ష్మి, అనురాధ, శ్రావణి, శ్రీలత, పద్మజ వాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం..

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కాలుష్య రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం
హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్







ప్రజాపక్షం/హైదరాబాద్ : భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని కాపాడాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయిద్దీన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయని అన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో వచ్చే తరం ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే స్థాయికి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధులను బారినపడి మందులపై ఆధారపడుతున్నారన్నారు. కాలుష్యం పెరగకుండా హైదరాబాద్ మరో ఢిల్లీ కానీయకుండా, హైదరాబాద్ ప్రకృతికి మారు పేరుగా ఉండాలంటే ఇక్కడ మనం చెట్లు నాడాలని సూచించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే వారికి మొక్కలు నాటే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. మొక్కలు నానాటి ప్లాస్టిక్‌ను మన దైనందిన జీవితం నుండి దూరం చేయాలని కోరారు. మొక్కలు పెంచడం ఒక వ్యాపకంగా మార్చుకోవాలని, జన్మదినోత్సవాలు, ప్రత్యేక రోజులలో మొక్కలు నాటాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చెట్టు నీడతో పాటు ప్రకృతి సహజమైన ఆక్సిజన్‌ను అందిస్తుందని తెలిపారు. చెట్టు నీడ వెలకట్టలేనిదని, చెట్లు ప్రగతికి మెట్లన్నారు. ప్రతి ఒక్కరూ చెట్టును నాటి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. శుభ కార్యక్రమాల్లో కేక్‌లను కట్ చేసి హంగామా సృష్టించే బదులుగా మొక్కలు వినియోగించాలని సూచించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడే బదులు జూట్ బ్యాగులను వాడాలన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. గోల్కొండ ఆస్పత్రిలో ప్రతి రోజు 1200 నుండి 1500 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారన్నారు. ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించేందుకు రూ. 6 కోట్లు , యంత్రాల కొనుగోలు కోసం రూ.1.80 కోట్లను మంజూరు అయ్యాయన్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అదనంగా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పి. సురేష్, డిసిహెచ్ఎస్ సూర్య కుమారి, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, గోల్కోడ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

## 1.80 లక్షల అల్ఫాజోలం టాబ్లెట్స్ పట్టివేత..

ఇద్దరి అరెస్టు, గుజరాత్‌లో తయారీ,
కాన్పూర్ నుంచి హైదరాబాద్‌కు

ప్రజాపక్షం/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.9.5 లక్షల విలువైన 1.80 లక్షల అల్ఫాజోలం (మత్తు) టాబ్లెట్స్‌లను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టిఎఫ్ టీంలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి తెలిపారు. నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఖురేషి వెల్లడించారు. హైదరాబాద్ కు చెందిన పువ్వాడ లక్ష్మ ణ్, పొద్దుటూరుకు చెందిన కేతుపల్లి మునిశేఖర్‌లు కాన్పూర్‌లోని అజయ్‌త్రిపాటి వద్ద నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు రూ.9.5 లక్షల విలువైన 1.80 లక్షల అల్ఫాజోలం టాబ్లెట్లను తరలించారు.ఈ మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసింకు విశ్వసనీయ సమాచారం రావడంతో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులతో పాటు ఎస్‌టిఎఫ్‌లు అప్రమత్తమయ్యాయి. బేగంపేటలోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి నిందితులు అల్ఫాజోలం ట్యాబెట్లను తీసుకుని తరలిస్తుండగా ఇద్దరు ఎస్ఐలు డ్రగ్ కంట్రోల్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు అనిల్ రెడ్డి, గోవింద సింగర్‌తో పాటు ఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ నాగరాజు, రవి శ్రీనివాస్, సందీప్ రెడ్డి,కిషన్ ఫారుకి,సిబ్బంది కలిసి హయత్ నగర్ లోని ఆటో నగర్ లో డ్రగ్స్ ఉత్తరప్రదేశ్ నుంచి కొరియర్లో రావడంతో వీరందరూ కలిసి మూకుమ్మడిగా దాడి చేసి టాబ్లెట్లను రికవర్ చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిషేధిత అల్ఫాజోలం టాబ్లెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నుంచి తెప్పించి చాలామందికి ఎక్కువ ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారని ప్రో హిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి పేర్కొన్నారు. కల్తీకల్లుకు, మత్తు రావడానికి వినియోగించేటువంటి అల్ఫా జోలం టాబ్లెట్లను ప్రభుత్వం గతంలో నిషేధించింది. ఈ మేరకు కొందరు వ్యక్తులు ఇలాంటి అనుమతులు లేకుండా ట్యాబ్లెట్లను వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించి నాలుగు రూపాయలకు ఒక టాబ్లెట్ విలువ ఉన్నటువంటి టాబ్లెట్ను పది రూపాయల నుంచి 20 రూపాయలకు ఎలాంటి మందుల చిట్టి లేకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకున్నట్లు ఖురేషి వెల్లడించారు. ప్రధా న నిందితుడు కాన్పూర్‌కు చెందిన అజయ్‌త్రిపాటి పరారీలో ఉన్నారు. మీడి యా సమావేశంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వల రెడ్డి, రంగారెడ్డి ఎఎస్ జీవన్ కిరణ్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూముల రగడ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఘటిస్తున్నారు. గత ఐదు రోజులుగా నిత్యం అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. అటవీ అధికారులకు, పోడు రైతులకు జరుగుతున్న ఘర్షన ఉద్రిక్తతం కాకముందే ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.

**హరితహారం పేరుతో అణచివేత.. మహిళా రైతుల పోరాటం**

చింతలమానేపల్లి మండలంలోని డబ్బా, కొత్తగూడెం గ్రామ శివార్లలో రైతులు పత్తి సాగు చేస్తుండగా, అటవీ అధికారులు వారిని అడ్డుకున్నారు. దిందా, బండలేటి గ్రామ శివారు ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు వచ్చిన అధికారులను రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు పెద్ద సంఖ్యలో అడ్డుకున్నారు. తమ భూముల్లో ట్రాక్టర్లు పెడితే ప్రాణాలు అడ్డుపెడతామని హెచ్చరించారు. దీంతో చేసేదేమి లేక ఎఫ్ఎఓ సుశాంత్ సగం భూమిని సాగు చేసుకోమని, మిగిలిన సగంలో మొక్కలు నాటుతామని రైతులకు ప్రతిపాదించినా వారు నిరాకరించారు. 'మా ప్రాణమైనా పోయిన కానీ, మా భూమిని పంచుకోవడానికి వీలు లేదు!' అని రైతులు తెగేసి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. పెంచికల్‌పేట మండలంలోని జైహింద్‌పూర్ శివారులోనూ గత మూడు రోజుల క్రితం ఇలాంటి ఘర్షణలే జరిగాయి. మంత్రులు, అధికారులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారే తప్ప, దశాబ్దాల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు గాలికి, అభద్రతా భావంలో రైతులు

పోడు భూముల విషయంలో ప్రతి ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలు ఇస్తున్నా, అవి అమలు కావడం లేదు. 2006లో ఆర్ఓఎఫ్ఆర్. పట్టాలు పంపిణీ చేసినా, అది పూర్తిస్థాయి పరిష్కారం కాకపోవడంతో వేలాది మంది రైతులు ఇప్పటికీ అభద్రతా భావంతో జీవిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు 28,500 మంది పోడు రైతులు 95 వేల ఎకరాల వరకు పోడు వ్యవసాయం చేస్తున్నారని అనధికారిక లెక్కలు చెప్తున్నాయి. బండేపల్లి బీట్‌లో 800 ఎకరాలు, దిందా బీట్‌లో 700 ఎకరాలు సాగులో ఉన్నాయి. అటవీ అధికారుల లెక్కల ప్రకారం, చాలా మంది రైతులకు పదుల సంఖ్యలో ఎకరాలు సాగులో ఉండగా ఈ భూములపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూమిని ఒక్కసారిగా లాక్కుంటే, వేలాది కుటుంబాల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంది. ఇప్పటికైన ప్రభుత్వం పోడు భూముల సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని పోడు రైతులు వేడుకుంటున్నారు.

## ఆధిపత్యం సహేతుకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

చట్టపాలన అనే భావనను ఆయన విపులీకరించారు. కోర్టులు ఆచరణాత్మకంగా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గవాయ్ ఉద్బోధించారు. అందరికీ న్యాయం జరిగేలా చూసుకోవడానికి టెక్నాలజీ ఒక మార్గంగా ఉండాలని చెప్పిన మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ వ్యాఖ్యలను ఆయన ప్రత్యేకంగా ఉటంకించారు. 'న్యాయవ్యవస్థలో సాంకేతికత డ్రైవర్ సీటును ఆక్రమించిన మరుక్షణం నుంచి దానిపై ప్రజల విశ్వాసం దెబ్బతినడం ప్రారంభం అవుతుంది. దానితో పాటు చట్ట పాలన పునాదులపై ప్రజలకున్న విశ్వాసం కూడా దెబ్బతినడాన్ని మనం చూస్తాం' అని సిజెఐ బిఆర్.గవాయ్ వివరించారు. 'మన కోర్టుల ముందుకు వచ్చే ప్రతీ కేసు న్యాయం దక్కుతుందన్న ఆశతో రావడం జరుగుతుంది. వారి విశ్వాసానికి అనుగుణంగా న్యాయ వ్యవస్థ పరిష్కారం అందరికీ సమానంగా ఉండాలి' అని గవాయ్ చెప్పారు. ప్రజలు ఎప్పుడైతే సంప్రదాయం, ఆవిష్కరణల మూలమలుపు మధ్య నిలబడినప్పుడు న్యాయస్థానాలు చట్టపాలనకు కాపలాదారులుగా ఉండి పురాతన జ్ఞానం, భవిష్యత్ న్యాయం రెండింటికీ రూపశిల్పులుగా వ్యవహరించాలని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com